
'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 111

బుధవారం 12-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫాక్స్‌కాన్ సొంత ప్లాన్

చిప్ ప్లాంటు ప్రోత్సాహకాల కోసం విడిగా దరఖాస్తు చేసుకునే యోచన -13లో



టెస్టు సమరం...

నేటి నుంచి భారత్, వెస్టిండీస్ తొలి మ్యాచ్. ఫేవరెట్‌గా టీమిండియా. -12లో



ఎవరెస్ట్ వద్ద కూలిన హెలికాప్టర్

నేపాల్‌లోని ఎవరెస్ట్ శిఖరం సమీపంలో హెలికాప్టర్ కూలిన ఘటనలో ఐదుగురు మెక్సికన్లు సహా ఆరుగురు మృతిచెందారు.

- వివరాలు 6లో



స్థానికంలో తృణమూల్ ఆధిక్యం

పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం దిశగా దూసుకెళ్తోంది.

- వివరాలు 6లో



కీలక బిల్లుకు ఇజ్రాయెల్ ఓకే

సుప్రీంకోర్టు అధికారాలను నియంత్రిస్తూ ప్రభుత్వం తెచ్చిన న్యాయ సంస్కరణల బిల్లును పార్లమెంట్ ప్రాథమికంగా ఆమోదించింది.

- వివరాలు 6లో



బాహుబలి రాకెట్

చంద్రయాన్-3లో భాగంగా ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను చందమామ వద్దకు మోసుకెళ్లే ఎల్‌వీఎం-3 రాకెట్ విశేషాలు..

- వివరాలు 6లో

'ఫ్రీ' ఫైర్!

అగ్గేసిన కాంగ్రెస్..

అందుకున్న బీఆర్‌ఎస్

ఉచిత విద్యుత్‌పై మంటలు

రైతులకు 3 గంటల ఉచిత విద్యుత్ చాలు కానీ 8 గంటలు ఇవ్వొచ్చన్న రేవంత్

కమీషన్ల కోసమే 24 గంటల ఉచిత విద్యుత్ అంటూ ఆరోపణలు

భగ్గుమన్న అధికార బీఆర్‌ఎస్

ఉచిత విద్యుత్ ఎత్తివేసే కుట్రలో భాగమేనని ధ్వజం

రాష్ట్రవ్యాప్తంగా రెండురోజుల పాటు ఆందోళనలకు కేటీఆర్ పిలుపు

కాంగ్రెస్‌కు ఓ విధానమేదీలేదు: బీజేపీ

నష్ట నివారణకు దిగిన హస్తం పార్టీ..

ఉచిత విద్యుత్‌పై పేటెంట్ తమదేనంటూ ఎదురుదాడి

రైతులకు ఉచిత విద్యుత్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టీకరణ


మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేగింది. తెలంగాణ రైతాంగానికి టోటల్‌గా ఎనిమిది గంటల ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుందని, 24 గంటల ఉచిత విద్యుత్ మాత్రం విద్యుత్ సంస్థల నుంచి కమీషన్ల కోసమేనంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వేడి రాజేశాయి. అధికార బీఆర్‌ఎస్ రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమంది. తాము అమలు చేస్తోన్న రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఎత్తివేసే కుట్రకు కాంగ్రెస్ పాల్పడుతోందని, అందులో భాగంగానే రేవంత్‌రెడ్డి అమెరికాలో ఈ వ్యాఖ్యలు చేశారని విరుచుకుపడింది. పలువురు మంత్రులు, ఆ పార్టీ నేతలు రేవంత్ వ్యాఖ్యలను ఖండించారు. మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావులు కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధించారు. ధరణి ఎత్తివేస్తామని, ఉచిత విద్యుత్ తీసేస్తామని చెప్తున్న కాంగ్రెస్ పార్టీకి కరెంటు షాకులు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీపీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలకు మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణలో 95% సన్నకారు రైతులే

- వారి వద్ద 3 ఎకరాల్లోపే భూములు.. ఆ భూముల్లో పూర్తిగా నీరు పారించేందుకు 3-8 గంటల ఉచిత విద్యుత్ చాలు
- కమీషన్ల కక్కుర్తి కోసమే సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ పేరిట కేసీఆర్ నినాదం: రేవంత్ - వివరాలు 2లో

ఉచిత విద్యుత్ వద్దంటే.. ఊరి పొలిమేర దాకా ఉరికించండి

- ఉచిత విద్యుత్ రద్దుకు గాంధీభవన్ కేంద్రంగా కుట్ర: కేటీఆర్
- కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలపై నేడు, రేపు నిరసనలు చేపట్టాలని పిలుపు - వివరాలు 2లో

వారంలోగా వీఆర్‌ఏల సర్దుబాటు

సీఎం కేసీఆర్ నిర్ణయం..

- నీటిపారుదల, ఇతర శాఖల్లో వారి సేవల వినియోగం
- సంప్రదింపులకు కేటీఆర్ నేతృత్వంలో కేబినెట్ సబ్‌కమిటీ
- పనితీరును బట్టి పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ..
- సీఎస్‌కు ముఖ్యమంత్రి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల (వీఆర్‌ఏ)ను వారి సేవలు విద్యార్హతలు, సామర్థ్యాలను బట్టి విస్తృతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. వారిని నీటిపారుదల సహా ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. వీఆర్‌ఏల సర్దుబాటు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సీఎం కేసీఆర్ మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వీఆర్‌ఏలతో చర్చించి వారి అభిప్రాయాలను సేకరించాలని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు మంత్రి కేటీఆర్ నేతృత్వంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌తో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేబినెట్ సబ్‌కమిటీ వీఆర్‌ఏలతో బుధవారం నుంచి చర్చలు ప్రారంభించనుంది. ఉప సంఘం సూచనల ప్రకారం వీఆర్‌ఏల సేవల వినియోగంపై చర్యలు తీసుకోవాలని కేసీఆర్ ఆదేశించారు. ఉప సంఘం తుది నివేదిక సిద్ధమైన తర్వాత మరోమారు చర్చించి తుది నిర్ణయం మిగతా 3వ పేజీలో ▶

ఈడీ చీఫ్ పొడిగింపు చట్టవిరుద్ధమే

ఈ నెల 31లోగా ఎస్‌కే మిశ్రా పదవి నుంచి తప్పుకోవాలి: సుప్రీంకోర్టు





న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చీఫ్ సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం చట్టవిరుద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నెల 31వ తేదీ తర్వాత ఆయన పదవిలో కొనసాగరాదని తేల్చిచెప్పింది. ఈలోగా ఈడీకి కొత్త చీఫ్‌ను నియమించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ నేతలు రణదీప్ సూర్జేవాలా, జయా ఠాకూర్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహువా మొయిత్రా, సాకేత్ గోఖలేతోపాటు పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గావై, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. మిశ్రా పదవీ కాలాన్ని ఇక పొడిగించవద్దని ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వును ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆక్షేపించింది. తక్షణమే ఈడీ అధిపతిగా మరొకరిని నియమించడం కష్టసాధ్యమన్న ప్రభుత్వ విజ్ఞప్తిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ నెల 31 దాకా గడువు ఇచ్చింది. మిశ్రా తొలిసారిగా 2018 నవంబర్ 19న ఈడీ అధిపతిగా నియమితులయ్యారు. 2020లో ఒకసారి, 2022లో మరోసారి ఆయన పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది. వాస్తవానికి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం మిశ్రా 2023 నవంబర్ 18 దాకా ఈడీ చీఫ్‌గా పదవిలో కొనసాగవచ్చు. కానీ, కోర్టు ఆదేశాలతో పదవి నుంచి వైదొలగడం తప్పనిసరిగా మారింది.

న్యూస్‌రీల్

గోదావరి నికర జలాల్లో మిగులే లేదు..



గోదావరి నికర జలాల్లో మిగులు లేదని సీడబ్ల్యూసీ తేల్చిన నేపథ్యంలో గోదావరి-కావేరి అనుసంధానాన్ని ఎలా చేపడతారని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థను తెలంగాణ, ఏపీ నీటిపారుదల శాఖలు నిలదీశాయి.

- వివరాలు 5లో

ముగిసిన అధిక పెన్షన్ గడువు



అధిక పెన్షన్‌కు సంబంధించి ఈపీఎఫ్‌ఓ తలపెట్టిన జాయింట్ ఆప్షన్ నమోదు ప్రక్రియ గడువు ముగిసింది. దాదాపు నాలుగున్నర నెలల పాటు కొనసాగిన ప్రక్రియకు 11వ తేదీ అర్ధరాత్రితో తెరపడింది.

- వివరాలు 5లో

వరదల్లో చిక్కుకున్న ముగ్గురు వైద్యులు క్షేమం



హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి వరదల్లో చిక్కుకున్న ముగ్గురు ఉస్మానియా వైద్య కళాశాల వైద్యులు క్షేమంగా ఉన్నారు. వైద్యులను సురక్షితంగా హైదరాబాద్‌కు చేర్చాలని మంత్రి హరీశ్ అధికారులను ఆదేశించారు.

- వివరాలు 14లో

కాకతీయుల తర్వాత మళ్లీ ఇప్పుడే!



ఏడు శతాబ్దాల విరామం తర్వాత వేయి స్తంభాల దేవాలయంలో అంతర్భాగంగా ఉన్న కల్యాణ మంటపంలో శివపార్వతుల కల్యాణం జరగబోతోంది. కాకతీయుల హయాం తర్వాత మళ్లీ ఇంతకాలానికి కల్యాణ మంటపం కళకళలాడబోతోంది.

- వివరాలు 14లో

పిండిప్రోలులో విత్తనాలు వేసినా ఇప్పటివరకు మొలకెత్తని పత్తి



కాటన్‌పై కాటు

28.70 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే 10 లక్షల ఎకరాల్లోనూ మొలకెత్తని విత్తనం

- రెండోసారి మళ్లీ విత్తనాలు చల్లుతున్న రైతులు
- వర్షాలు రాక ఆలస్యమవుతున్న వరి నార్లు
- ఇతర పంటలు వేసే పరిస్థితీ లేదు.. మొత్తమ్మీద గతేడాది కన్నా 11.31 లక్షల ఎకరాల్లో తగ్గిన పంటల సాగు
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం

ఖరీఫ్ సాగు నిరాశాజనకంగా ఉంది. వేసిన పంటలు మొలకెత్తడంలేదు. వరి నార్లు వేసే పరిస్థితి లేదు. పంటలకు అదను దాటిపోతోంది. రుతుపవనాలు ఆలస్యం కావడం, ఆ తర్వాత కూడా సరైన వర్షాలు లేకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం పెరగడంలేదు. సీజన్ మొదలై నెల దాటినా ఇప్పటికీ వర్షాభావంతో రైతాంగం విలవిల్లాడుతోంది. ఈసారి తిండి గింజలకు కూడా కరువు ఏర్పడుతుందన్న ఆందోళన అటు రైతులను, ఇటు వ్యవసాయ అధికారులను వేధిస్తోంది.

- వివరాలు 3లో

కారు.. వీధిపోరు!

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ భారత్ రాష్ట్ర సమితి నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. నేతలు చివరకు వ్యక్తిత్వ హననానికి సైతం పాల్పడుతూ వీధికెక్కుతున్నారు. రోజుకో చోట.. రోజుకో నేత అనే రీతిలో నియోజకవర్గ స్థాయి మొదలుకుని క్షేత్ర స్థాయి వరకు పరస్పర విమర్శలు, దూషణలు తెరమీదకు వస్తున్నాయి.

- బీఆర్‌ఎస్ నేతల మధ్య ముదురుతున్న విభేదాలు
- టికెట్ల వేటలో దూషణలు
- ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ స్వరం పెంచుతున్న నేతలు
- 40కి పైగా నియోజకవర్గాల్లో బహుళ నాయకత్వం సమస్య
- సిట్టింగ్‌లపై నిందారోపణలకు దిగుతున్న ఆశావహులు



సిట్టింగ్‌లు తమను కలుపుకొని వెళ్లకపోవడంతో అసంతృప్తితో ఉన్న నేతలు క్రమంగా స్వరం పెంచుతున్నారు. పార్టీ అధినేతపై విశ్వాసం, విధేయత ప్రకటిస్తూనే సొంత పార్టీ ఎమ్మెల్యేలు లక్ష్యంగా బహిరంగ ఆరోపణలు, విమర్శలకు దిగుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల, జిల్లా పరిషత్‌ల చైర్మన్లు, పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న నేతలు, వివిధ సందర్భాల్లో టికెట్లు ఆశిస్తూ పార్టీలో చేరినవారు.. మిగతా 2వ పేజీలో ▶

రాజయ్యా.. ఇక చాలు

- అంతా సీఎం చూసుకుంటారు
- మళ్లీ ఎక్కడా మాట్లాడొద్దు..
- ఎమ్మెల్యే రాజయ్యకు కేటీఆర్ క్లాస్?
- భేటీ తర్వాత కడియంతో వివాదం ముగిసిందన్న రాజయ్య

2లో



అభివృద్ధికి నిధులివ్వండి

వెనుకబడిన జిల్లాలకు నిధులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు మంత్రి హరీశ్ వినతి



- జీఎస్టీ సమస్యల పరిష్కారానికి అధికారులను నియమించాలి
- 50వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో హరీశ్‌రావు ప్రస్తావన
- అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటన

నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న హరీశ్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం నిర్మలా సీతారామన్‌తో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 లోని సెక్షన్ 94(2) ప్రకారం ఈ మేరకు నిధులు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నామని వివరించారు. 2015-16, 2016-17, 2017-18, 2018-19, 2020-21 సంవత్సరాలకుగానూ మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



అలా నిఘా వర్గాల నుండి సమాచారం అందగానే స్పీచ్ మొదలుపెడతారు!


మంగళవారం బీజేపీ పదాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఇంద్రసేనారెడ్డి, ఈటల, డీకే అరుణ

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై ఆర్టీఐ అస్త్రం!

- సమాచార హక్కు చట్టం ద్వారా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఆస్తుల వివరాల సేకరణకు బీజేపీ నిర్ణయం
- పార్టీ నేతలు, కేడర్‌లో ఉత్సాహం నింపే దిశగా వ్యూహం
- 2018 ఎన్నికల అఫిడవిట్లలో పొందుపరిచిన ఆస్తులపైనా దృష్టి
- ప్రజలకు వివరించడం ద్వారా పార్టీకి మద్దతు కూడగట్టే యత్నం
- రాష్ట్రంలో మరిన్ని సభలు.. 29న ఖమ్మంకు అమిత్ షా?

- వివరాలు 3లో

మార్గదర్శిలో 'నల్ల' ఇంధనం!

నిబంధనలకు విరుద్ధంగా కోటి దాటి డిపాజిట్లు



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతమైంది. చిట్‌ఫండ్స్ ముసుగులో సాగిన నల్లధనం దందాపై దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. రిజర్వు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా సేకరించిన అక్రమ డిపాజిట్ల వివరాలను వెలికితీసేందుకు సిద్ధమైంది. మార్గదర్శిలో ఇప్పటికే మూసి వేసిన 23 చిట్ గ్రూపులతోపాటు మరికొన్ని గ్రూపుల మూసివేతకు చర్యలు చేపట్టింది. ఆ చిట్టీల నిర్వహణను ప్రభుత్వ అదీనంలోకి తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది.

- ఆ కోటీశ్వరుల అందరికీ నోటీసులు
- అక్రమ డిపాజిట్లపై కూపీ లాగుతున్న సీఐడీ
- ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు..
- 23 చిట్టీ గ్రూపుల మూసివేత... త్వరలో మరికొన్ని
- ఆ చిట్టీల నిర్వహణకు అధీకృత అధికారి నియామకానికి సన్నాహాలు

రూ. కోటికిపైగా డిపాజిట్‌దారులకు నోటీసులు

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.కోటి అంతకుమించి డిపాజిట్లు చేసినవారికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. డిపాజిట్ల ముసుగులో నల్లధనం వ్యవహారాలను వెలికి తీసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లను వసూలు చేయకూడదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ మాత్రం యథేచ్ఛగా అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తున్నట్లు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు వేర్వేరుగా నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. అక్రమ డిపాజిట్లకు సంబంధించి పూర్తి వివరాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ వెల్లడించలేదు. రశీదుల పేరిట భారీగా నల్లధనం దందా సాగిస్తున్నట్లు సీఐడీ ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

ఆదాయ వివరాల పరిశీలన..

రాష్ట్రవ్యాప్తంగా 37 మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో రశీదుల పేరిట డిపాజిట్ చేసిన వారి వివరాలను సీఐడీ సేకరించింది. డిపాజిట్‌దారుల వృత్తి, వ్యాపారాలు, ఆదాయ మార్గాలు, ఇతర వివరాలతో సీఐడీ అధికారులు ఇప్పటికే నివేదిక రూపొందించారు. మొదటి దశలో రూ.కోటి అంతకంటే ఎక్కువ డిపాజిట్ చేసినవారికి నోటీసులు జారీ చేశారు. డిపాజిట్ చేసిన ఆ మొత్తాన్ని ఎలాంటి ఆదాయ మార్గాల ద్వారా సేకరించారు? మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లోనే ఎందుకు డిపాజిట్ చేశారు? తదితర వివరాలను వెల్లడించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు సంస్థకు మిగతా 10వ పేజీలో ▶

చేజేతులా!

- ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడిందనే చర్చ
- కర్ణాటక విజయంతో ఊపు మీదున్న పార్టీకి తలనొప్పి అంటున్న రాజకీయ వర్గాలు
- సొంత పార్టీ నేతల్లోనూ భిన్నాభిప్రాయాలు
- నష్ట నివారణకు పెద్దసంఖ్యలో నేతలు రంగంలోకి..

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల్లో విజయం తర్వాత మంచి జోష్‌తో దూసుకెళుతున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీని.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌కు సంబంధించి చేసిన వ్యాఖ్యలు ఆత్మరక్షణలో పడేశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్‌కు లేనిపోని తలనొప్పి తెచ్చిపెట్టాయనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఇక సొంత పార్టీలోనే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రేవంత్ వ్యాఖ్యలను తప్పుపడుతుంటే, మరికొందరు మాత్రం..అధికార బీఆర్ఎస్ రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించే ప్రయత్నం చేస్తోందంటూ ఆయనకు మద్దతుగా నిలిచారు. మొత్తం మీద రేవంత్ వ్యాఖ్యల పర్యవసానం తీవ్రంగానే ఉంటుందని, 24 గంటల విద్యుత్ ఇవ్వకపోతే నిలదీసి ప్రభుత్వం చేత ఇప్పించాల్సిన బాధ్యత గల ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడిగా ఉండి.. అసలు 24 గంటల విద్యుత్తే అవసరం లేదన్నట్టుగా వ్యాఖ్యానించడం పార్టీకి నష్టం చేకూరుస్తుందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. పలువురు కాంగ్రెస్ నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి రేవంత్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా, జరగాల్సిన నష్టం జరిగిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధిష్టానం దృష్టికి..!

అమెరికా వేదికగా ఉచిత విద్యుత్‌పైనా, అవసరమైతే సీఎంగా సీతక్క అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే యోచనలో సీనియర్లు ఉన్నట్లు తెలుస్తోంది. రేవంత్ వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మల్లు రవి స్పందించారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'రేవంత్ అమెరికా వెళ్లేంతవరకు బాగానే ఉన్నాడు. అక్కడకు వెళ్లిన తర్వాత బాలకృష్ణ, ఎర్రబెల్లి ప్రభావం పడి అలా మాట్లాడుతున్నాడేమో' అంటూ ఎద్దేవా చేశారు. ఇక ఈ విషయమై కొందరు సీనియర్లు అనధికారికంగా మాట్లాడుతూ.. 'రేవంత్ పప్పులో కాలేస్తున్నాడేమో అనిపిస్తోంది. ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. గతంలో సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు యాధృచ్ఛికంగా ఒక్క పదం అన్నందుకే తెలుగుదేశం పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. వ్యవసాయం దండుగ అన్నందుకు తగిన మూల్యం చెల్లించుకున్నారు.



రేవంత్‌రెడ్డి కూడా అదే బాటలో వెళ్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా రైతులకు 7–9 గంటల విద్యుత్ ఇచ్చాం. అసలు ఉచిత విద్యుత్ గురించి ఎందుకు మాట్లాడాలి? 24 గంటలు ఇవ్వడం లేదని బీఆర్ఎస్‌ను విమర్శించాలి కానీ ఇస్తామంటే వద్దనడమెందుకు? దీంతో పాటు కాంగ్రెస్సే రేవంత్, రేవంతే కాంగ్రెస్ అని ఆయన అంటున్నారు. సీతక్కను సీఎం చేస్తామంటున్నారు. పీసీసీ ప్రెసిడెంట్, సీడబ్ల్యూసీ, సీఎం పదవులన్నీ తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారికేనా? అసలైన కాంగ్రెస్ వాదులకు ఏం పదవులు లేవా? ఇలాంటి విషయాలన్నీ రాహుల్‌గాంధీతోనే మాట్లాడుతాం.' అని వ్యాఖ్యానించడం గమనార్హం.

ఉచిత విద్యుత్ వద్దంటే.. ఊరి పొలిమేర దాకా ఉరికించండి

ఉచిత విద్యుత్ రద్దుకు గాంధీభవన్ కేంద్రంగా కుట్రలు: మంత్రి కేటీఆర్

- చీకటి యుగాన్ని తిరిగి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు
- దళారులు, భూ దందాల కోసమే 'ధరణి' రద్దు యోచన
- ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు వదులుకున్నాం
- కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలపై నేడు, రేపు నిరసనలు చేపట్టాలని పిలుపు



సాక్షి, హైదరాబాద్: ఉచిత విద్యుత్‌కు ఉరివేసేందుకు గాంధీభవన్ కేంద్రంగా కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను రైతులు తిప్పికొట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉచిత విద్యుత్ వద్దంటున్న వారిని ఊరి పొలిమేర దాకా ఉరికించాలని, మూడు గంటల కరెంట్ చాలంటున్న వారి మాడు పగిలేలా జవాబు చెప్పాలన్నారు. రైతులకు ఊపిరి లాంటి ఉచిత విద్యుత్‌ను నిలిపివేసి అన్నదాతల ఉసురు తీస్తామని కాంగ్రెస్ చెప్పడం ఆ పార్టీ రాక్షస బుద్ధికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. రైతాంగానికి ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ఆలోచన విధానానికి వ్యతిరేకంగా మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ వద్దంటున్న కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేయాలన్నారు. రైతులను పొడుచుకు తినేందుకు కాచుకు కూర్చున్న కాంగ్రెస్ రాబందుల్ని తరిమికొట్టి రైతు బంధువులకు అండగా నిలవాలని చెప్పారు.

రైతాంగాన్ని సంక్షోభం నుంచి బయటపడేశాం

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటపడేసి రైతాంగాన్ని రక్షించేందుకు సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రూ.వేల కోట్లు వెచ్చించి ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయతోపాటు అనేక సాగునీటి పథకాలు చేపట్టిందన్నారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు మాత్రమే ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ దుష్ట విధానాలకు పరాకాష్ట అని, ధరణి రద్దు, రైతుబంధు వద్దు అంటూ ఇప్పటికే వరుసగా రైతు వ్యతిరేక విధానాలను ప్రకటిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఎదురైన కష్టాలను రైతులు మరిచిపోరని, నాసిరకం విద్యుత్ సరఫరాతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలి రైతులు నిద్రలేని రాత్రులు గడిపారన్నారు. కాంగ్రెస్ హయాంలో అర్ధరాత్రి కరెంటుతో రైతులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడ్డారని, ఎరువులు, విత్తనాల కొరత, కల్తీ విత్తనాలు, పురుగు మందులు కూడా రైతులను కాటేశాయని చెప్పారు. ఉచిత విద్యుత్‌ను ఎత్తేసి మోటార్లకు మీటర్లు బిగించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం మెడపై కత్తి పెట్టినా రైతులను కాపాడుకునేందుకు రూ.30 వేల కోట్లు వదులుకున్నామని కేటీఆర్ అన్నారు. రైతులు బాగుపడటాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు విషం కక్కుతున్నాయని, గతంలో మాదిరిగా బ్రోకర్లు, దళారులను తిరిగి తెచ్చేందుకు ధరణి పోర్టల్ రద్దు చేస్తామంటూ ప్రకటిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాం నాటి చీకటి యుగాన్ని మళ్లీ తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

కేసీఆర్ ఆదేశిస్తే.. ఎన్నికల్లో పోటీ చేస్తా : మోత్కుపల్లి



యాదగిరిగుట్ట: సీఎం కేసీఆర్ ఆదేశిస్తే వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఏ స్థానం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆయన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదగిరిగుట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

నాకు సీఎం కావాలనే ఆశలేదు: మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: 'నేను రాజకీయాల్లో ఈ స్థాయికి చేరుకున్నా.. నాకు సీఎం కావాలనే ఆశ లేదు, ఆశకు కూడా ఓ హద్దు ఉండాలి. ఇప్పుడున్న దాంతో సంతోషంగా ఉన్నా' అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. మంగళవారం సికింద్రాబాద్ మహంకాళి దేవాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో గిరిజన ఎమ్మెల్యే సీతక్క ముఖ్యమంత్రి కావొచ్చనే వ్యాఖ్యలు వచ్చాయని, మీ పార్టీలో బీసీ సీఎం అనే ఆలోచన వస్తే మీరు పోటీలో ముందుంటారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తలసాని ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

రైతుల కష్టాలు రేవంత్‌కు తెలియదు



సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ చేసుకుని డబ్బులు సంపాదించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు ఎలా తెలుస్తాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఒక ప్రకటనలో ఖండించారు. ఒక పక్క ఉచిత విద్యుత్ ఇస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అబద్ధాలు మాట్లాడుతుంటే, వారి మిత్రుడు రేవంత్ వ్యవసాయానికి 24 గంటలు దండగా అనడం వెనుక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందానికి నిదర్శనమని అరుణ ఆరోపించారు. 'నువ్వు కొట్టినట్టు చేస్తే, నేను ఏడ్చినట్టు చేస్తా'అనే విధంగా సయోధ్య వారి మధ్య కుదిరిందన్నారు.

రాక్షస పాలనకు అంతం పలుకుదాం: జూపల్లి

కందనూలు: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో తొమ్మిదేళ్లుగా సాగుతున్న రాక్షస పాలనకు అంతం పలుకుదామని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలను మోసగించిన సీఎం కేసీఆర్‌కు ఒక్కక్షణం కూడా అధికారంలో ఉండే హక్కు లేదన్నారు. కేసీఆర్ పతనం కోసమే పాలమూరు ప్రజాభేరి భారీ బహిరంగ సభను కొల్లాపూర్‌లో ఈ నెల 20న లక్షలాది మందితో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలోనే ప్రియాంకాగాంధీ సమక్షంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో పాటు ఆయన కుమారుడు రాజేశ్‌రెడ్డి, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే గురున్నాథ్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరతారన్నారు.

'ఫ్రీ' ఫైర్

▶ మొదటి పేజీ తరువాయి

నిరసనగా బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. దీంతో మంగళవారం నాడే రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్లెక్కారు. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. మరోవైపు బీజేపీ కూడా కాంగ్రెస్‌కు ఒక విధానమంటూ లేదని, ఎవరికి తోచింది వారు చెబుతూ ప్రజలను గందరగోళ పరిస్థితుల్లోకి నెడుతున్నారని విమర్శించింది. రేవంత్ వ్యాఖ్యలు ఊహించని విధంగా వివాదాన్ని సృష్టించడంతో కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడింది.

సత్యాగ్రహ దీక్షను నీరుగార్చే కుట్ర: రేవంత్

బీఆర్ఎస్ విమర్శల పర్వం, కార్యాచరణపై అమెరికాలో ఉన్న రేవంత్‌రెడ్డి తాజాగా స్పందించారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసిన బీజేపీ కక్షపూరిత వైఖరిని నిరసిస్తూ చేపట్టిన సత్యాగ్రహ దీక్షను నీరుగార్చేందుకు బీజేపీ బీ టీం అయిన బీఆర్ఎస్ కుట్ర చేస్తోందని ఒక ప్రకటనలో విమర్శించారు. గాంధీ విగ్రహాల వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలకు సిద్ధమవుతున్న సమయంలో అసత్య, అసందర్భ అంశాన్ని తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ చిల్లర హడావుడి చేస్తోం



హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

దన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్న విషయం తేలడంతోనే బీఆర్ఎస్ మంత్రులు, నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో 12 గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని, ఇందుకు నిరసనగా బుధవా రం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్‌స్టేషన్ల ముందు కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టి కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బీఆర్ఎస్ వెన్నులో వణుకు పుట్టించిందని, అందుకే తాను అమెరికాలో మాట్లాడిన మాటలు అవకాశంగా తీసుకుని కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ స్కీం అని, ఆ విషయంలో కాంగ్రెస్‌ను వేలెత్తి చూపే అర్హత బీఆర్ఎస్‌కు లేదని స్పష్టం చేశారు.

రేవంత్ ఏమన్నారంటే?

అమెరికా పర్యటనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించిన గ్రీట్ అండ్ మీట్‌లో ఎన్ఆర్ఐలు అడిగిన ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి సమాధానాలిచ్చారు.ఈ సమావేశంలోనే ఉచిత విద్యుత్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. మీరు అధికారంలోకి వస్తే తెలంగాణ రైతాంగానికి నిరంతరాయంగా ఇస్తున్న కరెంటును కొనసాగిస్తారా లేక రద్దు చేస్తారా? రైతుబంధు కొనసాగిస్తారా? రద్దు చేస్తారా? అని ఓ ఎన్ఆర్ఐ ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన రేవంత్.. **'తెలంగాణలో 95% రైతులు మూడెకరాల లోపున్న చిన్న, సన్నకారు రైతులు. మూడెకరాలలోపు ఉంటే ఒక ఎకరానికి నీరు పారించాలంటే ఒక గంట చాలు. మూడెకరాలకు ఫుల్లుగా నీరు పారాలంటే మూడు గంటలు సరిపోతుంది. టోటల్‌గా ఎనిమిది గంటలు ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుంది. కేవలం విద్యుత్ సంస్థల దగ్గర కమీషన్లకు కక్కుర్తి పడి వ్యవసాయానికి 24 గంటలనే స్లోగన్ తీసుకొచ్చింది. ఉచిత కరెంటు అని కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతున్నాడు. ఇలాంటి ఉచితాలను అనుచితంగా స్వార్థానికి వాడుకోవద్దు. ఉచిత విద్యుత్ గురించి రైతు డిక్లరేషన్‌లో స్పష్టంగా చెప్పాం..'** అని అన్నారు.

ఉచిత విద్యుత్‌పై పేటెంట్ మాదే..

బీఆర్ఎస్, బీజేపీల విమర్శల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. రేవంత్ వ్యాఖ్యలు వైరల్ కావడం, బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించడంతో ఎదురుదాడికి దిగింది. నష్ట నివారణకు ఆ పార్టీ నేతలు ప్రయత్నించారు. మధుయాష్కీ గౌడ్, పొన్నం ప్రభాకర్, మల్లురవి, అద్దంకి దయాకర్, షబ్బీర్‌అలీ, రైతు విభాగం నేతలు కోదండరెడ్డి, సుంకేట అన్వేష్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ తదితరులు రేవంత్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తూనే బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే రైతులని, రైతులు అంటేనే కాంగ్రెస్ పార్టీ అని, రేవంత్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి మంత్రులు ఊరకుక్కల్లా మాట్లాడుతున్నారంటూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. విద్యుత్ కొనుగోళ్లలో జరుగుతున్న అవినీతిని ఎత్తిచూపేందుకే రేవంత్ అలా మాట్లాడారని, విద్యుత్ రంగంలో అవినీతిపై బహిరంగ చర్చకు మంత్రులు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇక ఉచిత విద్యుత్‌పై పేటెంట్ కాంగ్రెస్ పార్టీదేనని పార్టీ నేత అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించగా, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు తమపై బురద జల్లుతున్నారని మాజీ ఎంపీ మల్లురవి విమర్శించారు. బీజేపీ తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు మద్దతిచ్చిన బీఆర్ఎస్ చీప్ పాలిటిక్స్ చేస్తోందని ధ్వజమెత్తారు. పార్టీ విధాన నిర్ణయాన్ని రేవంత్ ప్రకటించలేదంటూ, రైతులకు ఉచిత విద్యుత్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. రైతు డిక్లరేషన్‌లో చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. ఉచిత కరెంటు గురించి ఎవరూ ఆలోచించని రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో దివంగత సీఎం వైఎస్ హయాంలోనే అమలు చేశామని, రైతులకు ఉచిత కరెంటు ఇవ్వడమనేది కాంగ్రెస్ పార్టీకి పేటెంట్ అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉచిత విద్యుత్‌కు సంబంధించి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ వక్రీకరించారని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

కాంగ్రెస్‌ను ముంచేందుకే: మంత్రి తలసాని

తను ఎటూ మునిగిపోతున్నాడని తెలిసి కాంగ్రెస్ పార్టీని ముంచేందుకు రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. రైతులకు మూడు గంటల విద్యుత్ చాలని సాక్షాత్తు టీపీసీసీ అధ్యక్షుడే అన్నారంటే ఆ పార్టీ ఎజెండా ఏమిటో తెలుస్తోంది. ఆ పార్టీలోని మిగతా నాయకులు, ఏఐసీసీ ముఖ్యులు దానికి మద్దతు ఇస్తున్నారా లేక ఆయనతో రైతులకు క్షమాపణలు చెప్పిస్తారో నిర్ణయించుకోవాలి. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తనకు పోటీ వస్తున్నాడని సీతక్క కూడా సీఎం కావచ్చని రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తు చేశారు. అందుకే అందరినీ ముంచి తానూ మునిగిపోవాలని ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతోపాటు కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు చేపట్టడంతో దేశం మొత్తం ఎంత ధాన్యం ఉత్పత్తి చేస్తుందో అంత ధాన్యం రాష్ట్రం నుంచే ఉత్పత్తి అవుతోంది.

రైతుల పొట్టగొట్టే కుట్ర: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సీఎం కేసీఆర్ రైతులకు అండగా నిలిచి ఆదుకుంటుంటే, కాంగ్రెస్ మాత్రం రైతుల పొట్టగొట్టే కుట్రలు చేస్తోంది. కాంగ్రెస్, టీడీపీ పాలనలో కరెంట్ లేక రైతులు అరిగోస పడ్డారు. కాంగ్రెస్‌కు రైతులంటే మొదటి నుంచి చిన్నచూపే. మొన్న ధరణి వద్దన్నారు.. ఇప్పుడు మూడు గంటల విద్యుత్ చాలంటున్నారు. రాబోయే రోజుల్లో రైతుబంధు, రైతు బీమా కూడా వద్దంటారు.

మతి భ్రమించి మాట్లాడుతున్న రేవంత్: మంత్రి పువ్వాడ అజయ్

రేవంత్‌కు ధైర్యం ఉంటే రైతులకు మూడు గంటల విద్యుత్ అంశాన్ని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలి. అమెరికాలో రేవంత్ మతి భ్రమించి మాట్లాడుతున్నారు. ఒక్కోచోట రెండు, 3 గంటలు మోటార్లు ఆడినా ఎకరానికి తడిపెట్టే పరిస్థితి ఉండనప్పుడు మూడు గంటల కరెంట్ రైతులకు ఎలా సరిపోతుంది. ప్రభుత్వ అధీనంలో ఉన్న విద్యు త్ సంస్థలు కమీషన్లు ఎలా ఇస్తాయో రేవంత్ చెప్పాలి.

రైతులు గుణపాఠం చెబుతారు: మంత్రి ఎర్రబెల్లి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బుధవారం రైతాంగం నిరసనలు చేపట్టాలి. రేవంత్ చెప్పినట్లు వ్యవసాయానికి 3 గంటలు కరెంట్ ఇస్తే రైతు బాగుపడతాడా? బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతులను పట్టించుకోకపోగా నిర్లక్ష్యం చేశాయి. రైతు పంట పండించుకోవడానికి ఉచిత కరెంటు ఇస్తే అది తప్పా? సరైన సమయంలో రైతులు వీరికి తగిన గుణపాఠం చెబుతారు.

కేసీఆర్ రక్షకుడు.. రేవంత్ భక్షకుడు: మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న 24 గంటల సరఫరాకు బదులు 8 గంటలు ఇస్తానని రేవంత్ చెప్పడం దారుణం. 24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తున్న కేసీఆర్ రైతులకు రక్షకుడు.. రేవంత్ భక్షకుడు. కాంగ్రెస్ హయాంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పొలాలు ఎండిపోవడం, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవడం చూశాం.

'చంద్ర'భూతం: దాసోజు శ్రవణ్

ధరణి రద్దు, ఉచిత విద్యుత్ వద్దు అంటున్న రేవంత్ రెడ్డి పేరుకు మాత్రమే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు.. కానీ చంద్రబాబు కనుసైగల్లో పనిచేస్తున్నారు. 'చంద్రభూతం' రేవంత్ రూపంలో తెలంగాణ రైతుల అస్తిత్వం, ఆత్మగౌరవంపై దాడి చేస్తోంది.

24 గంటల కరెంట్ రైతులకు వద్దా?: ఎంపీ రంజిత్‌రెడ్డి

24 గంటల కరెంట్ కాంగ్రెస్ నేతలకేనా.. రైతులకు వద్దా? రైతులకు ప్రథమ శత్రువు కాంగ్రెస్ పార్టీనే. కాంగ్రెస్, రేవంత్ రైతు వ్యతిరేక విధానాలను రైతులు గమనిస్తూనే ఉన్నారు. ఆ పార్టీకి రైతులే తగిన రీతిలో బుద్ధి చెబుతారు.

రైతాంగం ఆందోళనలు చేయాలి: ఎమ్మెల్సీ పల్లా

రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయి. మొన్న ధరణి రద్దు, నేడు ఉచిత విద్యుత్ అనుచితం అంటూ మాట్లాడటం శోచనీయం. ఆ రోజు చంద్రబాబు.. నేడు ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి చేసిన మాటలపై తెలంగాణ రైతాంగం ఆందోళనలు చేయాలి. రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేయాలి.

రాజయ్య... ఇక చాలు

- అంతా సీఎం చూసుకుంటారు.. పార్టీ గీత దాటితే చర్యలు
- ఎమ్మెల్యే రాజయ్యకు మంత్రి కేటీఆర్ క్లాస్?
- ఐదు నిమిషాల్లోనే ఫటాఫట్ చర్చలు
- భేటీ తర్వాత కడియంతో వివాదం ముగిసిందని రాజయ్య ప్రకటన
- ఇకపై ఎలాంటి వ్యాఖ్యలు చేయనని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ లక్ష్యంగా మాజీ ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్య మధ్య జరుగుతున్న మాటల యుద్ధం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వద్దకు చేరింది. ఇరువురు నేతల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరిన నేపథ్యంలో తనను కలవాల్సిందిగా ఎమ్మెల్యే రాజయ్యకు కేటీఆర్ సోమవారం సాయంత్రం ఫోన్ చేశారు. ఆ మేరకు రాజయ్య మంగళవారం ప్రగతిభవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ భేటీలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో జరుగుతున్న ఘటనలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరస్పర విమర్శలతో పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందని కేటీఆర్ చెప్పినట్టు సమాచారం.

ఇద్దరూ సీనియర్లు.. కలుపుకొని పోవాలి

మీడియాలో వస్తున్న వార్తలను కేటీఆర్ ప్రస్తావిస్తూ 'రాజన్నా చేసింది చాలు.. ఎక్కువేం మాట్లాడకు.. సీఎంకు చెప్తా.. ఆయనే అన్నీ చూసుకుంటారు. మళ్లీ ఎక్కడా మాట్లాడొద్దు.. ఏమీ చెప్పొద్దు.. ఇద్దరూ సీనియర్లు.. కలుపుకునిపోవాలి. పార్టీ గీత దాటితే ఎంతటి వారైనా వేటు తప్పదు' అని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాను పాల్గొన్న పల్లె నిద్ర, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన నివేదికను పుస్తకరూపంలో కేటీఆర్‌కు రాజయ్య అందజేశారు. కేవలం ఐదు నిమిషాల్లోనే కేటీఆర్‌తో రాజయ్య భేటీ ముగిసినట్లు తెలిసింది.

నాకే టికెట్ వస్తుందనే నమ్మకం ఉంది


'టికెట్ విషయాన్ని అధిష్టానం చూసు కుంటుంది. ఎవరికి టికెట్ ఇచ్చినా అధిష్టానం నిర్ణయాన్ని శిరసావహిస్తా. కేటీఆర్ నాతో మాట్లాడిన తీరు చూస్తే టికెట్ వస్తుందనే నమ్మకం ఉంది. కడియంపై ఎలాంటి చర్యలు ఉంటాయనే విషయాన్ని అధిష్టానం చూసుకుంటుంది' అని రాజయ్య పేర్కొన్నారు. తనపై స్థానికంగా వస్తున్న ఆరోపణలపై పోలీసులు విచారిస్తున్నారని, ఆ ఆరోపణలు నిరాధారమనే విషయం పార్టీ నాయకత్వానికీ తెలుసన్నారు.

ఇకపై నా నోటి నుంచి కడియం పేరు ఉండదు

కేటీఆర్‌తో భేటీ అనంతరం అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యే రాజయ్య తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో నెలకొన్న సమస్య సద్దుమణిగింది. కేటీఆర్ పిలుపు మేరకు ప్రగతిభవన్‌కు వచ్చి అన్ని విషయాలు వివరించాను. పార్టీ లైన్‌లో పనిచేయమని కేటీఆర్ ఆదేశించారు. 2018 ఎన్నికల సమయంలోనూ కడియం శ్రీహరి ఇలాగే వ్యవహరించారు. నియోజకవర్గాల్లో విభేదాలకు తావు ఉండకూడదనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యేలు కేంద్రంగా పనులు జరగాలని కేసీఆర్ ఆదేశించినా కడియం పట్టించుకోలేదు. ఇతర ఎమ్మెల్సీలు నన్ను అడిగి నిధులు కేటాయిస్తే కడియం మాత్రం గ్రూపులు ప్రోత్సహించేలా వ్యవహరించారు. కడియం శ్రీహరిపై నేను కొత్తగా మోపిన అభియోగాలేమీ లేవు. పాత వాటిని ఉటంకించాను. ఇప్పటికి ఈ వివాదం ముగిసిపోయిందని అనుకుంటున్నాను. నా నోటి నుంచి ఇకపై కడియం శ్రీహరి పేరు రాదు. కేసీఆర్ నాయకత్వంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలా పనిచేస్తా'' అని అన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉచిత విద్యుత్‌కు మంగళం

- 24 గంటలు రైతులకు ఉచిత విద్యుత్ మా నినాదం
- చంద్రబాబు నీడలా రేవంత్ వ్యవహారం
- మంత్రి జగదీశ్ రెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడినట్లేనని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. రైతాంగానికి ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు రవీంద్రనాయక్, గాదరి కిషోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి మూడు గంటల పాటు ఉచిత విద్యుత్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌గా భావించాల్సి ఉంటుందన్నారు. 'వ్యవ సాయానికి మూడు గంటల ఉచిత విద్యుత్' అని రేవంత్, 'దామరచర్ల విద్యుత్ ప్లాంటు రద్దు' అంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటనలు చేస్తున్నా రని, కాంగ్రెస్ నేతలను ప్రజలే రద్దు చేస్తారని జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ఎవరితోనూ టచ్‌లో లేరని, తెలంగాణ ప్రజానీకం అంతా తమ వెంటే ఉండటంతో కాంగ్రెస్ నేతలు మైండ్ గేమ్ ఆడుతున్నారని మండిపడ్డారు.

రేవంత్ రూపంలో చంద్రబాబు నీడ

గతంలో ఉచిత్ విద్యుత్ పథకాన్ని ఎగతాళి చేసిన చంద్రబాబు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం అయినా రేవంత్ రెడ్డి రూపంలో ఆయన నీడ తెలంగాణ రైతాంగాన్ని వెంటాడుతోందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఉచిత విద్యుత్ విషయంలో 20 ఏళ్ల కిందటి చంద్రబాబు విధానాన్ని అమలు చేసేందుకు ఆయన అనుచరుడిగా రేవంత్ పాటుపడుతున్నారని ఎద్దేవా చేశారు. వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించారని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. పార్టీ అధినేత హోదాలో రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై తెలంగాణ రైతాంగం తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు.

కారు.. వీధి పోరు!

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల కోసం లాబీయింగ్ చేస్తు న్నారు. టికెట్ల పోటీలో పర స్పరం సిగపట్లకు దిగుతు న్నారు. కార్యకర్తలు, అను యాయుల సమక్షంలో సొంత పార్టీకి చెందిన రాజ కీయ ప్రత్యర్థిపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. పార్టీ నేతలు లక్ష్మణరేఖ దాటుతున్నా.. అధినేత కేసీఆర్ చాలా సందర్భాల్లో ప్రతిస్పందించక పోవడంతో వివాదాలు మరింత ముదురుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థానిక నాయకత్వంతో పొసగని నేతలు బహిరంగ విమర్శలకు దిగుతున్నా పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. అయినప్పటికీ అధినేత మౌనం వెనుక ఆంతర్యం పార్టీ కేడర్‌కు అంతుపట్టడం లేదు. అయితే మాజీ ఉప ముఖ్యమంత్రులు తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరిల పరస్పర ఆరోపణలకు సంబంధించిన వివాదంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించి హెచ్చరికలు జారీ చేయడంతో ఈ తరహా పరిణామాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు.

రోజుకో చోట.. రోజుకో నేత

సుమారు 40కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ బహుళ నాయకత్వం సమస్యను ఎదుర్కొంటోంది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ టికెట్‌ను ఆశిస్తూ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు పలువురు నేతలు లాబీయింగ్‌కు దిగుతున్నారు. టికెట్ దక్కదనే అంచనాకు వచ్చిన కూచాడి శ్రీహరిరావు (నిర్మల్)తో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు ఇప్పటికే పార్టీని వీడారు. ఇటీవలి కాలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుపై సస్పెన్షన్ వేటు వేయగా, వారు కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించడంతో పాటు ఆ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నా చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉంటే పార్టీ టికెట్ ఆశిస్తున్న మెదక్, రాజేంద్రనగర్, కొత్తగూడెం, ఉప్పల్, హుజూరాబాద్, తాండూరు, మహబూబాబాద్ తదితర నియోజకవర్గాల నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, జనగామ, ఖానాపూర్, వరంగల్ పశ్చిమ, నాగార్జునసాగర్, కల్వకుర్తి, జహీరాబాద్, వేములవాడ తదితర నియోజకవర్గాల్లో టికెట్ ఆశిస్తున్న పలువురు నేతలు ఎక్కడికక్కడ విస్తృతంగా పర్యటిస్తున్నారు. సమావేశాలు, సభలు నిర్వహిస్తూ సొంత పార్టీకి చెందిన ప్రత్యర్థులపై విమర్శల దాడి చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ విధంగా కట్టుతప్పుతున్న నేతలపై చర్యలు లేకుంటే.. పరిస్థితి ఇతర పార్టీలకు అనుకూలంగా మారుతుందనే ఆందోళన పార్టీ కేడర్‌లో ఉంది. అయితే టికెట్ ఆశిస్తున్న నేతలంతా పార్టీ అధినేతకు విధేయులుగానే ఉంటున్నారని, ఎన్నికల నాటికి అంతా సద్దుమణుగుతుందని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.


క్లుప్తంగా...

14న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఈ నెల 14న కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 26 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో 20 కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని, దక్షిణాది రాష్ట్రాల నుంచి ఈ పరీక్ష కోసం 3,03,349 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించింది. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని వెల్లడించింది.

కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కల సేకరణలో ఓబీసీ కులగణన చేపట్టాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, పర్యాటక శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'క్యాస్ట్ సెన్సెస్ అండ్ ఓబీసీ ఇష్యూస్'పై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని పర్యాటక భవన్‌లో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబీసీ వర్గానికి చెందిన నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ఉన్నా ఓబీసీలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ఓబీసీ కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు. దేశంలో ఓబీసీ వర్గాలు, విద్యార్థులు, మేధావులు, సామాజికవేత్తలు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటం చేయాలని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, జాతీయ కోశాధికారి ఓ.కొండల్, రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటదాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ దత్త తదితరులు పాల్గొన్నారు.

44 వేల ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య




కాచిగూడ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో మంగళవారం తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణలతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని కలిసి విద్యా సంబంధిత సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన టెట్ పరీక్షలను 45 రోజుల్లో పూర్తి చేయాలని, 24 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

18 నుంచి టీపీయూఎస్ ఆందోళనలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యమించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్)నిర్ణయించింది. సంఘం సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేష్ ప్రకటించారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ కాంప్లెక్స్ స్థాయిలో సంతకాలు సేకరించి ప్రభుత్వానికి అందజేయాలని, 25న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలపాలని, 31న ఆర్డీవో కార్యాలయాల వద్ద వినతిపత్రాలు ఇవ్వాలని, ఆగస్టు 5న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేయాలని, 19న హైదరాబాద్ వద్ద మహాధర్నా చేపట్టాలని నిర్ణయించినట్టు సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

20న రాష్ట్రస్థాయి అర్చక ఉద్యోగుల సమావేశం



సాక్షి, హైదరాబాద్: అర్చక ఉద్యోగుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈనెల 20న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీచుపల్లి ఆంజనేయస్వామి దేవస్థానంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నామని అర్చక ఉద్యోగ జేఏసీ తెలిపింది. ఈ మేరకు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, శ్యాంసుందర్, ఆనంద్ శర్మ తదితరులు కలిసి ఆహ్వానించారు. సమావేశానికి హాజరవుతానని మంత్రి హామీ ఇచ్చినట్టు అర్చక ఉద్యోగ జేఏసీ తెలిపింది.

కాటన్‌పై కాటు



ఆదిలాబాద్ జిల్లాలో పత్తిసాగు దృశ్యం

28.70 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే..

10 లక్షల ఎకరాల్లోనూ మొలకెత్తని విత్తనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 33 జిల్లాలకుగాను 16 జిల్లాల్లో వర్షాభావం నెలకొందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఈ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, సోమవారం నాటికి 42.48 లక్షల ఎకరాల్లో సాగైంది. వాస్తవంగా గతేడాది ఇదే సమయానికి 53.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే ఈసారి ఏకంగా 11.31 లక్షల ఎకరాలు తక్కువగా సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. సీజన్ ఆలస్యం కావడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. ఈసారి కొద్దిపాటి వర్షాలకు రాష్ట్రంలో 28.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కానీ వాటిని కాపాడుకోవడం కూడా రైతులకు సవాల్‌గా మారింది. వర్షాలు లేకపోవడంతో అవి మొలకెత్తే పరిస్థితి లేకుండాపోతోంది. వ్యవసాయశాఖ తాజా అంచనా ప్రకారం దాదాపు 10 లక్షల ఎకరాల్లో కూడా పత్తి మొలకెత్తలేదని అధికారులు చెబుతున్నారు. మరికొన్నిచోట్ల పత్తి భూమిలోనే మాడిపోయిందని అంటున్నారు. దీంతో రైతులు మళ్లీ భూమిని దున్ని పత్తి వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. వాస్తవంగా పత్తి వేయడానికి ఈ నెలాఖరు వరకే గడువు. చిట్టచివరకు ఆగస్టు మొదటి వారంలోగా పూర్తి చేయాలి. ఆ తర్వాత పత్తి వేయడానికి అదనుపోయినట్లే. ఆలస్యమైతే చీడపీడలు ఆశిస్తాయి. పైపెచ్చు మళ్లీ దున్ని విత్తనాలు వేయాలంటే మరింత ఖర్చుతో కూడిన వ్యవహారం. మరోవైపు అనుకున్న వెరైటీలు దొరక్క ఏదో ఒక రకం విత్తనం వేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి ప్రభుత్వం కూడా పత్తి సాగును ప్రోత్సహించాలని పిలుపునిచ్చింది. కనీసం 65 లక్షల ఎకరాలకైనా పెంచాలని రైతులకు కోరింది. కానీ పరిస్థితి అందుకు అనుకూలంగా లేదు. గతేడాది మేరకైనా పత్తి సాగవుతుందా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. పత్తి అదను దాటిపోతే దానికి బదులుగా మొక్కజొన్న లేదా ఆముదం వంటి పంటలను రైతులు వేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై కసరత్తు

వర్షాలు లేకపోవడం, కాల్వల్లో నీటి విడుదల లేకపోవడంతో అనేకచోట్ల ఇంకా వరి నార్లు పోయలేదు. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్ ఎలా గట్టెక్కుతుందో అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి కూడా ఇదే పరిస్థితి ఉంటే రాష్ట్రంలో ఈ సీజన్ సాగు ప్రమాదంలో పడినట్లేనని వ్యవసాయ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో కంటింజెన్సీ ప్రణాళికపై వ్యవసాయశాఖ సమాలోచనలు చేస్తోంది. సకాలంలో పంటలు వేయని పరిస్థితి ఏర్పడితే ఏం చేయాలన్న దానిపై ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో మంతనాలు జరుపుతోంది. నార్లు వేయని పరిస్థితి నెలకొంటే వెదజల్లే పద్ధతిని ప్రోత్సహించాలని భావిస్తోంది. స్వల్పకాలిక రకాలైన వరి విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉండాలని కిందిస్థాయి సిబ్బందిని వ్యవసాయశాఖ ఆదేశించింది. రోజువారీగా జిల్లా అధికారులతో క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేస్తోంది.

ఖర్చు రెట్టింపైంది



నా రెండెకరాల భూమిలో 20 రోజుల క్రితం పత్తి గింజలు విత్తాను. కానీ వర్షాలు రాకపోవడంతో మొలకలు రాలేదు. దీంతో రెండోసారి పత్తి విత్తనాల ప్యాకెట్లు కొనుగోలు చేసి విత్తాను. పత్తి విత్తనాలకు రూ.3,500, సాగుకు రూ.6,000, విత్తడానికి రూ.1,000 ఖర్చయింది. వర్షం రాకపోవడంతో రెండుసార్లు విత్తనాలు వేయడంతో పెట్టుబడి రెట్టింపైంది. ఇప్పటివరకు రూ.21 వేలకుపైగా ఖర్చయింది.

– రేఖ శ్రీధర్, రైతు, నర్సింహులపేట, మహబూబాబాద్ జిల్లా

వానల్లేక మొలకెత్త లేదు



జూన్ మొదటి వారంలో పొడి దుక్కుల్లో నాలుగెకరాల్లో పత్తి విత్తనాలు పెట్టాం. సమయానికి వర్షాలు పడలేదు. ఎండ తీవ్రత బాగా ఉంది. దీంతో విత్తనాలు మొలకెత్తలేదు. మరోసారి విత్తనాలు వేయాల్సి వచ్చింది. రెండోసారి పెట్టిన విత్తనాలు ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్నాయి. రెండుసార్లు వేయాల్సి రావడంతో ఖర్చు ఎక్కువైంది.

– చామకూరి రమేష్, పిండిప్రోలు, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా

రాష్ట్రంలో పంటల సాగు ఇలా (విస్తీర్ణం లక్షల ఎకరాల్లో)..



పంట	సాధారణ సాగు	గతేడాది ఇదేసమయానికి	ఈసారి ఇప్పటివరకు
పత్తి	50.59	38.48	28.70
వరి	49.86	2.58	2.09
పప్పుధాన్యాలు	9.43	4.10	2.56
సోయాబీన్	4.13	3.21	2.85
మొక్కజొన్న	7.13	2.50	1.28

ఆగస్టు 25న సచివాలయ ప్రార్థనాస్థలాల ప్రారంభం

నల్లపోచమ్మ ఆలయం, మసీదు, చర్చిలపై సీఎం కేసీఆర్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన సచివాలయం ఆవరణలో నిర్మించిన నల్లపోచమ్మ దేవాలయం, మసీదు, చర్చిని ఆగస్టు 25న పునఃప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఆయా మతాల ప్రతినిధులను సంప్రదించి అందరికీ ఆమోదయోగ్యమైన తేదీని సీఎం ఖరారు చేసినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 25న హిందూ సంప్రదాయాలను అనుసరించి పూజారుల సమక్షంలో నల్లపోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి దేవాలయాన్ని సీఎం ప్రారంభిస్తారని వెల్లడించింది. అదేరోజున ఇస్లాం, క్రిస్టియన్ మతాల పెద్దల ఆధ్వర్యంలో మసీదు, చర్చిని ప్రారంభిస్తారని తెలిపింది. ఈ మేరకు సీఎం కేసీఆర్ మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారని పేర్కొంది. ఒకేరోజు మూడు మతాల ప్రార్థనా మందిరాలను ప్రారంభించే చారిత్రక నిర్ణయాన్ని సీఎం తీసుకున్నారని, సచివాలయ ఉద్యోగులకు ఈ మందిరాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొంది.

వారంలోగా వీఆర్‌ఏల సర్దుబాటు

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకుంటామన్నారు. వారంలోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలని నిర్దేశించారు.

లక్ష్యాలు సాధిస్తే క్రమబద్ధీకరణ

నాలుగేళ్ల శిక్షణ కాలాన్ని పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శుల పనితీరును నిబంధనల మేరకు పరిశీలించి క్రమబద్ధీకరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. వారి పనితీరును జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలిస్తుందని, నిర్దేశిత లక్ష్యాల్లో మూడింట రెండో వంతు పూర్తి చేసిన వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని చెప్పారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతను కాపాడేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించడం, మొక్కలు నాటించడం, వాటిని కాపాడే దిశగా పర్యవేక్షించడంతోపాటు పలు రకాల బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులు విధిగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను చేపట్టాలని సీఎస్ శాంతి కుమారి, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావును కేసీఆర్ ఆదేశించారు.

వారి పాత్ర అభినందనీయం

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర అభినందనీయమని కేసీఆర్ చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న గ్రామాలతో పోటీపడి తెలంగాణ పల్లెలు సాధించిన జాతీయ అవార్డుల్లో వారి కృషి ఇమిడి ఉందన్నారు. తెలంగాణ పల్లెలు మరింత గుణాత్మకంగా మార్పు చెందాలని, ప్రజల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి చెందే దిశగా పంచాయతీ కార్యదర్శుల కృషి కొనసాగుతూనే ఉండాలని ఆకాంక్షించారు. సమీక్షలో మంత్రులు కేటీఆర్, జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కేసులో మరో ముగ్గురు నిందితుల అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో మరో ముగ్గురు నిందితులను సిట్ మంగళవారం అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులోని నిందితుల సంఖ్య 77కు చేరింది. అరెస్టు అయినవారిలో ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థులు వాదిత్య నవీన్, గుగులోతు చంటితోపాటు సూర్యాపేటకు చెందిన ఎల్.సుమన్ ఉన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ వాదిత్య నవీన్ గ్రూప్–1, 4, ఏఈ, ఏఈఈ పరీక్షలు రాశాడు. మాస్ కాపీయింగ్‌లో ఆరితేరిన మాజీ ఏఈ పూల రమేశ్‌తో నవీన్ ఒప్పందం చేసుకొని మొదట ఏఈఈ పరీక్ష మాస్ కాపీయింగ్ చేశాడు. అనంతరం లీకైన ఏఈ పరీక్షపత్రాన్ని నవీన్ ద్వారా ఖమ్మం, సూర్యాపేటకు చెందిన పలువురికి రమేశ్ విక్రయించాడు. ఇప్పటికే నవీన్‌ను సిట్ అరెస్ట్ చేసింది. కాగా, నవీన్ ద్వారా రమేశ్‌కు ఉన్న సంబంధాలను గుర్తించిన సిట్ మరింత మంది నిందితులను గుర్తించి వరుసగా ఒక్కొక్కరిని అరెస్ట్ చేస్తోంది.

బీజేపీలో సోషల్ మీడియా పోస్టుల చిచ్చు

సాక్షి, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు బీజేపీ సోషల్ మీడియా వింగ్‌లో కలకలం రేపాయి. ఈ పోస్టులపై సోషల్‌వింగ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే రెండు వర్గాలుగా విడిపోయింది. కొన్నిరోజుల కిందటివరకు నేతల గ్రూపుల విభేదాలు బయటపడగా.. సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు తాజా వివాదానికి కారణమయ్యాయి. రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారని పలువురు ఈటల వర్గీయులు సోషల్ మీడియా వింగ్ వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతల కేంద్రంగా కాకుండా, పార్టీకి మేలు చేసేలా పోస్టులు ఉండాలని సూచించారు. బండి సంజయ్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల నుంచి తప్పించొచ్చని వార్తలొచ్చిన సందర్భంగా అటు బండి వర్గం, ఇటు ఈటల వర్గం ఒకరికి ఒకరు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీంతో తాజాగా పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇంచార్జుల సమావేశానికి నాంపల్లి కార్యాలయానికి వచ్చిన ఈటల వర్గీయులు... ఈటలకు వ్యతిరేకంగా కొందరు పోస్టులు పెట్టడంపై స్టేట్ ఆఫీస్ సోషల్ మీడియా ప్రతినిధులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా బండి, ఈటల వర్గాలు పరస్పరం దూషించుకున్నాయి. బీజేపీ సోషల్ మీడియా ఉద్యోగి ప్రశాంత్‌పై కొందరు దూషణకు దిగారు. వీరిలో ఈటల, కిషన్ రెడ్డి అనుచరులు అమర్ నాథ్, గిరివర్ధన్ రెడ్డి ఉన్నట్లు సమాచారం. సోషల్ మీడియా రూమ్‌కు తాళం వేసి మరీ దాడికి ప్రయత్నించినట్టు, ఈటలకు అనుకూలంగా కొందరు నినాదాలు కూడా చేసినట్టు తెలుస్తోంది. బీజేపీ కార్యాలయ సిబ్బంది ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై ఆర్టీఐ అస్త్రం!

సమాచార హక్కు చట్టం ద్వారా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఆస్తుల వివరాల సేకరణకు బీజేపీ నిర్ణయం

- పార్టీ నేతలు, కేడర్‌లో ఉత్సాహం నింపే దిశగా వ్యూహం
- 2018 ఎన్నికల అఫిడవిట్లలో పొందుపరిచిన ఆస్తులపైనా దృష్టి
- ప్రజలకు వివరించడం ద్వారా పార్టీకి మద్దతు కూడగట్టే యత్నం
- రాష్ట్రంలో మరిన్ని సభలు.. 29న ఖమ్మంకు అమిత్‌షా?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాషాయ దళం దూకుడు పెంచుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావడంలో భాగంగా రాష్ట్ర నాయకులు, కేడర్‌లో పూర్తి ఉత్సాహాన్ని, చైతన్యాన్ని నింపే చర్యలు చేపడుతోంది. వచ్చే మూడు, నాలుగు నెలలు యావత్ పార్టీ యంత్రాంగం పూర్తిగా ఎన్నికల యుద్ధంలో నిమగ్నమయ్యేలా వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికలకు తుదిరూపునిస్తోంది. ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఆస్తుల వివరాలను సేకరించి..గతంలో వారికి ఎన్ని ఆస్తులుండేవి, ఇప్పుడు ఎంత ఉన్నాయనే వివరాలు, ఇతర సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించింది. 2018 ఎన్నికలకు ముందు ఈసీకి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలో పొందుపరిచిన ఆస్తులు, ఇప్పుడున్న ఆస్తుల వివరాలు కూడా ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. తద్వారా క్షేత్ర స్థాయి నుంచి పార్టీకి మద్దతు కూడగట్టాలని భావిస్తోంది. సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం మంగళవారం కూడా కొనసాగింది. మంగళవారం నాటి భేటీలో ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, పార్టీ నేతలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఇంద్రసేనారెడ్డి, పొంగులేటి సుధాకరరెడ్డి, అర్వింద్ మీనన్,, ఏపీ జితేందర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ముఖ్య నేతలు కూడా పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాబోయే వందరోజుల్లో పార్టీ చేపట్టబోయే కార్యాచరణను ఖరారు చేశారు.

మరింత జోష్ నింపేలా..

గత శనివారం వరంగల్‌లో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ సర్కార్‌పై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు సంధించారు. ఆ మరునాడే 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల భేటీకి వచ్చిన సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇదే క్రమంలో పార్టీలో మరింత జోష్‌ను నింపేందుకు ఈ నెల 29న ఖమ్మం పట్టణంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ నిర్వహణకు పార్టీ సిద్ధమౌతున్నట్టు సమాచారం. గత నెలలో ఖమ్మంలో జరగాల్సిన అమిత్‌షా సభ వాయిదా పడడంతో తాజాగా మరో తేదీని జాతీయ నాయకత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. అమిత్‌షా పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఒకటి, రెండురోజుల్లోనే ఖరారు కానున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇక రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజక వర్గాలకు ఇన్‌చార్జిలుగా వివిధ రాష్ట్రాలకు చెందిన 119 మంది బీజేపీ ఎమ్మెల్యేలు రానున్నారు. ఆగస్టు 16 నుంచి వారం రోజుల పాటు వారికి కేటాయించిన నియోజక వర్గాల్లోనే మకాం వేసి క్షేత్రస్థాయిలో పరిస్థితులు, సమస్యలు పరిశీలించనున్నారు. వీరు తమ పరిశీలనపై జాతీయ నాయకత్వానికి నివేదికలు సమర్పించనున్నట్టు తెలుస్తోంది.

మోదీ విజయాలపై హోర్డింగులు!

వంద రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై...ముఖ్యంగా డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు రుణ మాఫీ, ధరణి సమస్యలు వంటి వాటిపై ప్రజల ముందుకు వెళ్లాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. ప్రతిరోజూ రాష్ట్రంలోని దళితవాడలు, బస్తీల్లో పర్యటించడం ద్వారా తొమ్మిదేళ్లలో వివిధ రంగాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించడంతో పాటు, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను, హామీలు నిలబెట్టుకోకపోవడాన్ని ఎండగట్టాలని నిర్ణయించింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను వివరిస్తూ రాష్ట్రంలో పలుచోట్ల హోర్డింగ్‌లు పెట్టాలని నిర్ణయించినట్టు పార్టీ నేతల సమాచారం. దీంతో పాటు వచ్చేనెల 15వ తేదీలోగా మరో 85 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఇప్పటికే 17 స్థానాల్లో సభలు నిర్వహించారు.

షాడో సీఎంలా కేటీఆర్: కిషన్‌రెడ్డి

తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అనే విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బీఆర్‌ఎస్‌పై పోరాటానికి హైకమాండ్ పలు మార్గదర్శకాలు ఇచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నేతలంతా శ్రమించాలి. అందరూ బాధ్యతగా వ్యవహరించాలి. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది బీఆర్‌ఎస్‌పై పోరాటానికే..' అని చెప్పారు. బీజేపీపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న విమర్శలను నేతలంతా దీటుగా ఎదుర్కోవాలని సూచించారు. 'రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో అవినీతికి పాల్పడింది. బీఆర్‌ఎస్ పార్టీ వేల కోట్లు దోచుకుంది. ప్రజాధనాన్ని మొత్తం దుర్వినియోగం చేస్తున్నారు. ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. ఇలాంటి అవినీతి బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బొమ్మ బొరుసు లాంటివి. ఎన్నికలకు ముందో, తర్వాతో ఈ రెండూ కలుస్తాయి. ఎవరికి ఓటేసినా కుటుంబ పార్టీకే ఓటు పడినట్లవుతుంది. మంత్రి కేటీఆర్ షాడో సీఎంలా వ్యవహరిస్తున్నారు. ఈ పార్టీలను ప్రజల వద్ద దోషిగా నిలబెట్టాలి. వచ్చే మూడు నెలలు సమగ్ర ప్రణాళికతో ప్రజల వద్దకు వెళ్లాలి. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ వైఫల్యాలను వివరించాలి. ప్రభుత్వాన్ని గద్దె దింపాలి.' అని కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో కొత్తగా బీబీఏ ఆనర్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి బీబీఏ ఆనర్స్ అందుబాటులోకి రానుంది. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కోర్సును ప్రవేశపెడుతున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఈ సంవత్సరం రెండు కాలేజీల్లో ఈ కోర్సు ఉంటుందని అధికారులు తెలిపారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ ఆప్షన్లతో కూడిన విద్యకు అఖిలభారత సాంకేతిక విద్యా మండలి అనుమతించింది. ఇందులో భాగంగా ఐదేళ్ల ఎంబీఏ కోర్సును ప్రవేశపెట్టాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఎంబీఏ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థి మూడేళ్ల తర్వాత ఎప్పుడైనా కోర్సు నుంచి బయటకు రావచ్చు. వీలైనప్పుడు తిరిగి కోర్సు పూర్తి చేయవచ్చు. మూడేళ్ల తర్వాత కోర్సు మానేస్తే బీబీఏ సర్టిఫికెట్ ఇస్తారు. ఇదే కోర్సును నాలుగేళ్ల తర్వాత మానేస్తే బీబీఏ ఆనర్స్ డిగ్రీ ఇస్తారు. ఐదేళ్ళూ చదివితే ఎంబీఏ సర్టిఫికెట్ అందజేస్తారు. విద్యా సంస్కరణల్లో భాగంగా దేశవ్యాప్తంగా ఈ తరహా ఆనర్స్ కోర్సులకు ప్రాధాన్యత లభిస్తోంది.



అసెంబ్లీలో బంగారు మైసమ్మ బోనాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో మంగళవారం బంగారు మైసమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం పచ్చగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. కేసీఆర్‌ని మూడోసారి కూడా ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మండలిలో ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, రేఖా నాయక్, కె.ప్రభాకర్‌రెడ్డి, కాలె యాదయ్య, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, వాణీదేవి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, బీఆర్‌ఎస్ ఎల్పీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి, ఉభయ సభల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వేరు కాదని నిరూపిస్తాం

- ఆ రెండూ ఒక్కటి కాబట్టే రాష్ట్రంలో అరాచక పాలనపై కాంగ్రెస్ నేతలు మాట్లాడటం లేదు
- బీజేపీ వ్యతిరేక కూటమి కోసం అఖిలేష్ దూతగా కేసీఆర్‌తో సంప్రదింపులు
- బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వేరు కాదని నిరూపిస్తామని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ప్రకటించారు. అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంగా బహిరంగ సభలు నిర్వహించి.. కేసీఆర్ వైఫల్యాలను ఎండగట్టి బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటే అని రుజువు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తిరిగి బీఆర్‌ఎస్ గూటికే చేరుతుంది కాబట్టి ఆ పార్టీకి ఓటేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటే కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ నేతలు నిలదీయడం లేదన్నారు. బీజేపీ వ్యతిరేక కూటమి కోసం అఖిలేశ్ దూతగా కేసీఆర్‌తో సంప్రదింపులు జరిపారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల కనీస మానవత్వం లేదని, అధికారంలో ఉన్న రాజస్తాన్‌లో రుణమాఫీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని విమర్శించారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఒక మాట.. కోమటి రెడ్డి వెంకటరెడ్డి మరోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. వారికో ఎజెండా లేదని ఎద్దేవా చేశారు.

రాజయ్య, కడియంల వివాదంపై కేసీఆర్ మాట్లాడరా?

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పరస్పరం అవినీతి ఆరోపణలు గుప్పిస్తుంటే వాటిపై సీఎం కేసీఆర్ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఏ పని చేసినా అధికార పార్టీ ఎమ్మెల్యేలే 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని, ఇటువంటి అవినీతి బీఆర్‌ఎస్ సర్కార్‌ను ప్రజలు తరిమికొడతారని హెచ్చరించారు.

ఎన్నికల కోసం వంద రోజుల భవిష్యత్ కార్యాచరణ

రాష్ట్రంలోని 17 లోక్ సభ స్థానాల పరిధిలో పార్టీ జాతీయస్థాయి అగ్రనేతలు ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా, జేపీనడ్డాలలో ఎవరో ఒకరి సభ ఉంటుందని లక్ష్మణ్ చెప్పారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు వంద రోజుల భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు. 'ఈ నెల 15 నుంచి 31 వరకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం 30వేల మందిని వ్యక్తిగతంగా కలుసుకుని మోదీ సర్కార్ విజయాలను తెలియజేస్తాం. 16న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిఫిన్ బైటక్ పేరిట సహపంక్తి భోజన కార్యక్రమాలు నిర్వహిస్తాం.. ముందుగా 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజక వర్గాల్లో సభలు నిర్వహించి,. ఆ తర్వాత మిగిలిన అసెంబ్లీ స్థానాల్లో సభలు నిర్వహిస్తాం. నవయువ ఓటర్ల ఎన్‌రోల్ మెంట్ చేసి వారితో సమావేశాలు జరుపుతాం. ప్రతి పది రోజులకు ఒక అంశంపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాం' అని లక్ష్మణ్ ప్రకటించారు.

సారూ..జీతాలివ్వండి ప్లీజ్ !

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి ఉద్యోగుల జేఏసీ మొర

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది కాలంగా విద్యుత్ ఉద్యోగులకు జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయూస్ జేఏసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. పెద్దసంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు బ్యాంకుల నుంచి గృహ, వాహన, వ్యక్తిగత, విద్యారుణాలను తీసుకున్నారని, ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీలోగా బ్యాంకులకు కిస్తీలు చెల్లించాల్సి ఉండగా, జీతాలు ఆలస్యం కావడంతో గడువులోగా చెల్లించలేకపోతున్నారని పేర్కొంది. దీంతో ఉద్యోగుల సిబిల్ స్కోర్ పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. జూన్ నెల జీతాలు 11వ తేదీనాటికి కూడా చెల్లించలేదని వాపోయింది. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ జి.సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు మంగళవారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. బ్యాంకులకు కిస్తీలు చెల్లించేందుకు విద్యుత్ ఉద్యోగులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటున్నారని వారు వాపోయారు. జీతాల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంతో ఉద్యోగులు మానసిక స్థైర్యం కోల్పోతున్నారని తెలిపారు.

'ఉమ్మడి పౌర స్మృతి దేశాభ్యున్నతికి గొడ్డలి పెట్టు'

సాక్షి, హైదరాబాద్: కేంద్రం చెబుతున్న ఉమ్మడి పౌర స్మృతి దేశాభ్యున్నతికి గొడ్డలి పెట్టు అని బీఆర్‌ఎస్ లోక్ సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర రావు తెలిపారు. దేశ మౌలిక సూత్రమైన భిన్నత్వంలో ఏకత్వానికి ఈ చట్టం తూట్లు పొడుస్తుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగించి, ప్రజల మధ్య చిచ్చు పెట్టే పౌర స్మృతి బిల్లును పార్లమెంటులో అడ్డుకుని తీరుతామని నామా చెప్పారు. బిల్లును ఉపసంహరించేంత వరకు రాజీలేని పోరాటం చేసి, ఉభయ సభలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.





సాయాన్ని తిరస్కరించినప్పుడు మాత్రమే నువ్వు స్వేచ్ఛగా ఉండగలవు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 12 జూలై 2023

మన పాపమే... ఈ ప్రకృతి శాపం!

కనీసం నలభై, యాభై ఏళ్ళుగా ఎన్నడూ చూడనంతటి వర్షం. ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులుగా వర్షాలతో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, జమ్మూ – కశ్మీర్‌లలో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు. ఉత్తర భారతావనిలో అనేక చోట్ల ఎత్తైన ఆలయ శిఖరాలను సైతం ముంచేస్తూ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు. పేరుకుపోయిన బురదలో కూరుకుపోయిన ఆవాసాలు. ఆకస్మిక వరదలతో సిమ్లాలో కుప్పకూలిన భవనాలు. చమోలీలో కొట్టుకుపోయిన బ్రిడ్జీలు. విరిగిపడ్డ కొండచరియలు, కోతపడ్డ రహదారులు. ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్న యమునా నదితో దేశ రాజధాని ఢిల్లీకి సైతం వరద ముప్పు. హిమాచల్‌లో 70 మందికి పైగా దుర్మరణం. ఒక్క ఉత్తరాఖండ్‌లోనే రూ.4 వేల కోట్లకు పైగా నష్టం. వరదలో చిక్కుకున్న వందలాది గ్రామాలు, వేలాది జనం. ప్రకృతి కోపిస్తే, మనిషి పిపీలకమేనని ఇవన్నీ మరోసారి ఋజువు చేస్తున్నాయి. వాతావరణ మార్పుతో పాటు అభివృద్ధి పేరిట మనం చేస్తున్న పర్యావరణ విధ్వంసమూ ఈ బీభత్సానికి కారణమని వెక్కిరిస్తున్నాయి. పట్టణాభివృద్ధి ప్రణాళికలో మన డొల్లతనాన్ని నగ్నంగా నిలబెడుతున్నాయి.

హిమాలయ సానువుల్లోని పర్యాటక ప్రాంతాల్లో విద్యుత్కేంద్రాలే మునిగిపోయి, మట్టి పేరుకుపోవడంతో కరెంట్ లేదు. సాయం చేసే మనిషి లేడు. అనుకోకుండా వచ్చి ఇరుక్కుపోయిన వేల మంది పర్యాటకులు ఎలాగోలా బయటపడదామంటే బస్సులు లేవు. విమాన సర్వీసులు లేవు. దోవ, ధైర్యం చెప్పే నాథుడు లేడు. కాసింత రోడ్డు దాటడానికి సైతం వేలకు వేలు దోపిడీ చేస్తున్న కొందరు దళారుల నడుమ ప్రభుత్వ యంత్రాంగం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కుల్లూ, మనాలీ లాంటి ప్రాంతాల్లో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బియాస్ నది ధాటికి ఆపి ఉంచిన వాహనాలు సైతం లక్కపిడతల్లా కొట్టుకుపోయాయి. ఇరుకైన జనావాసాల మధ్య నుంచి భారీ వృక్షాలు, కొయ్య దుంగలు కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి.

పదేళ్ళ క్రితం 2013 జూన్ మధ్యలో ఉత్తరాఖండ్‌ను వణికించిన 'హిమాలయన్ సునామీ' లాంటి ప్రళయ భీకర దృశ్యాలనే తాజా సన్నివేశాలూ తలపిస్తున్నాయి. దృశ్యాలే కాదు... ఈ భారీ వర్షాలు, ఆకస్మిక వరదలకు కారణాలూ దాదాపు అప్పటి లాంటివేనని శాస్త్రవేత్తలు అనడం గమనార్హం. అప్పుడైనా, ఇప్పుడైనా ఒక పక్కన ఋతుపవనాలు, మరోపక్కన మధ్యధరా సముద్రంలో తలెత్తి, ఉత్తర భారతావనికి ఆకస్మిక వర్షాలు తెచ్చే తుపాను – రెండూ ఏకకాలంలో కలగలసి ఈ ముప్పు తెచ్చాయి. జూన్ చివరి వరకు వర్షపాతం 10 శాతం కొరవ పడితే, వారం రోజుల్లో ఈ వాతావరణ ఉత్పాతంతో 2 శాతం అధిక వర్షపాతం స్థాయికి చేరుకున్నామన్న లెక్క నివ్వెరపరుస్తోంది. అంతకన్నా కలవరమేమిటంటే, భూతాపం రోజురోజుకూ పెరుగుతున్నవేళ ఇలా ఉమ్మడిగా ముప్పు మీదపడడం పోనుపోనూ ఎక్కువవుతుందట! అలాగే, పర్యావరణ రీత్యా అతి సున్నిత హిమాలయ రాష్ట్రాలైన హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో ప్రాజెక్టుల పేరిట సాగిస్తున్న విధ్వంసకర అభివృద్ధి నమూనాను ఇకనైనా మార్చుకోకుంటే వినాశనం తప్పదనడానికి తాజా ఘటన మరో హెచ్చరిక.

తాజా ఘటనలు ఋతుపవనాలపై వాతావరణ మార్పుల ప్రభావానికీ అద్దం పడుతున్నాయి. వర్షం పడదు. పడితే కాసేపే భారీ వర్షం, ఆ వెంటే వరద. ఆకస్మిక వాన, వరదల్ని ముందుగా అంచనా వేయడం కష్టమే. వాతావరణ మార్పులను నిశితంగా గమనిస్తూ, ఆకస్మిక వరదలొచ్చే ప్రదేశాలను గుర్తించి హెచ్చరించాల్సి ఉంటుంది. ఈ ప్రమాదభరిత వాతావరణ ఘటనల్ని పసిగట్టాలంటే రాడార్ల వినియోగమే శరణ్యమని వాతావరణ శాస్త్రవేత్తల మాట. దానివల్ల 3 గంటల ముందే ముప్పును పసిగట్టవచ్చు. అయితే, ఇకపై హిమాలయాలు, పడమటి కనుమల లాంటి పర్వత ప్రాంతాల్లో భారీ వర్షాలు, భూపతనాలు పెరుగుతాయన్న హెచ్చరికను చెవికెక్కించుకోవాలి. నిరుడు జనవరి మొదటి నుంచి సెప్టెంబర్ 30 మధ్య మొత్తం 273 రోజుల్లో ఏకంగా 242 రోజుల్లో ఏదో ఒక ప్రకృతి విలయం తప్పలేదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కథనం. అంటే, తరచూ ఎదురయ్యే ముప్పు రీత్యా దీర్ఘకాలిక ప్రణాళికలే ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

ఇక, దేశ రాజధాని ఢిల్లీ సైతం మొన్నటి దాకా ఎర్రటి ఎండతో, ఆపైన ముంచెత్తిన వానతో చిగురుటాకులా వణికిపోయింది. వీవీఐపీలు తిరిగే ఇండియా గేట్, జనక్‌పురి సహా మూడు ప్రధానమైన చోట్ల గత వారంలో రహదారులు కుంగిపోయాయి. కొన్నిచోట్ల 8 అడుగుల లోతు గుంటలుపడ్డాయి. ఇవన్నీ మన పట్టణ ప్లానింగ్ వ్యవస్థ ఎంత అస్తవ్యస్తంగా ఉందో అద్దం పడుతున్నాయి. ఇప్పటికే ముంబయ్, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సహా అనేక నగరాల్లో పదే పదే ఇలాంటి పరిస్థితులే చూస్తున్నాం. చెట్ల నరికివేత, చెరువులు – నదీతీరాల్ని ఆక్రమించేలా విచ్చలవిడి నిర్మాణాలకు అనుమతి వీటికి కారణం. కాసింత వానకే మురుగునీటి పారుదల వ్యవస్థ కుప్పకూలుతోంది.

ఇవన్నీ మన పాపాల ఫలితమే. ఇకనైనా, పాలకులు ఉష్ట్రపక్షి స్వభావాన్ని విడనాడాలి. విచ్చలవిడి అభివృద్ధితో వినాశనమే అని గ్రహించాలి. అంతకంతకూ పట్టణాలకు వలసలు పెరుగుతున్నందున పెరిగే అవసరాలకు తగ్గట్టు సరైన రీతిలో పట్టణాభివృద్ధి ప్రణాళిక చేయాలి. చెరువులు, కాలువలను మొత్తం పట్టణ స్వరూపంలో భాగమని గుర్తించాలి. వాటిని సవ్యంగా కాపాడి, నిర్వహిస్తేనే అర్బన్ ఫ్లడ్స్‌ను నివారించవచ్చు. అలాగే, ఇప్పటికే భారీ అప్పుల్లో పీకల లోతు కూరుకుపోయిన హిమాచల్ లాంటి రాష్ట్రాలు ఈ జలవిలయ నష్టాల నుంచి బయటపడాలంటే కష్టమైనా కొన్ని కఠిననిర్ణయాలు తీసుకోక తప్పదు. ప్రకృతిని మనం కాపాడితేనే అది మనల్ని కాపాడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి: బ. దశమి రా.8.57 వరకు, తదుపరి ఏకాదశి
నక్షత్రం: భరణి రా. 11.12 వరకు, తదుపరి కృత్తిక
వర్జ్యం: ఉ. 8.59 నుండి 10.34 వరకు
దుర్ముహూర్తం: ప.11.40 నుండి 12.32 వరకు
అమృతఘడియలు: సా.6.24 నుండి 8.04 వరకు.

సూర్యోదయం: 5.36
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

బలపడుతున్న భారత్-నాటో బంధం?

భారతదేశం సాంప్రదాయికంగా నాటోతో వ్యవహారంలో జాగరూకతతో వ్యవహరిస్తోంది. కూటమి చారిత్రక లక్ష్యం, మన సన్నిహిత సైనిక భాగస్వామి రష్యాపై దాని వైఖరిని దృష్టిలో ఉంచుకుంటే ఈ ధోరణి అర్థం చేసుకోదగినదే. ఇంత స్పష్టమైన అభ్యంతరాలు ఉన్నప్పటికీ, భారత్ గత రెండు దశాబ్దాలుగా నాటోతో ఆశ్చర్యకరమైన రీతిలో అన్యోన్యతను కలిగి ఉంది. హిందూ మహాసముద్రంలో దొంగతనాల (పైరసీ) విషయంలో ఉమ్మడి భాగస్వామ్య సవాలుపై భారత్, నాటో మధ్య ఆచరణాత్మక సహకారం స్పష్టంగా ఉంది. కాబూల్ నుండి అమెరికా బలగాల ఉపసంహరణకు ముందు భారత అధికారులు నాటో అధికారులతోనూ తమ దృష్టికోణాలను పంచుకున్నారు. 2007లో ఎస్తోనియాపై గణనీయమైన సైబర్ దాడుల తర్వాత భారత్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) ఫిన్లాండ్‌తో, నాటోతో సహకరించింది.



నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) వార్షిక శిఖరాగ్ర సమావేశం లిథువేనియా రాజధాని విల్నియస్‌లో జరుగుతోంది (జూలై 11-12). ఉత్తర అమెరికా, ఐరోపా దేశాల పరస్పర రక్షణ కూటమిగా 1949 నుండి ఉంటూ వస్తున్న నాటోను ఇటీవలి వరకు చాలామంది ప్రచ్ఛన్న యుద్ధ అవశేషంగానే భావించారు. (ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మెక్రాన్ అయితే 2019లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నాటో బ్రెయిన్ డెత్ గురించి ప్రముఖంగా ప్రకటించారు కూడా.) కానీ ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం నాటో కూటమిలో సరికొత్త ప్రయోజనాత్మక లక్ష్యాన్ని నింపింది. గత సంవత్సరంలో ఫిన్లాండ్‌ను నాటోలో చేర్చుకున్నారు. సభ్యులందరి ఆమోదానికి లోబడి స్వీడన్ కూడా కూటమిలో చేరుతుందని భావిస్తున్నారు. దీంతో నాటో సభ్యత్వం 32 దేశాలకు పెరగనుంది.

పైగా, మంగోలియా, పాకిస్తాన్ వంటి విభిన్న దేశాలతో సహా 39 దేశాలతో నాటో అధికారిక భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. వాటిలో మూడు (రష్యా, బెలారస్, అఫ్గానిస్తాన్) దేశాల సభ్యత్వాన్ని ప్రస్తుతం నిలిపివేశారు. ఇవి పార్లమెంటరీ వ్యవహారాల నుండి సాంకేతిక సహకారం వరకు వివిధ స్థాయుల్లో ప్రమేయాన్ని కలిగి ఉన్నాయి. కొన్ని నాటో భాగస్వామ్య దేశాలైన జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్... రష్యాకు వ్యతిరేకంగా సమన్వయం విషయంలో మరింత సన్నిహితంగా ఉన్నాయి.

నాటో 2022 వ్యూహాత్మక భావన అనేది రష్యాపై దృష్టిని తిరిగి కేంద్రీకరించడం, కూటమి సభ్యత్వ విస్తరణను చేపట్టడంతో సహా చైనా ప్రజా రిపబ్లిక్‌కు (పీఆర్‌సీ) కొంత ప్రాధాన్యమిచ్చింది. బీజింగ్ 'ప్రకటిత ఆశయాలు, దాని బలవంతపు విధానాలు, మన ఆసక్తులను, భద్రతను, విలువలను సవాలు చేస్తున్నాయి' అని ప్రకటించింది. 'యూరో-అట్లాంటిక్ భద్రతకు పీఆర్‌సీ ద్వారా ఎదురయ్యే దైహిక సవాళ్లను పరిష్కరిస్తా'మని ఈ డాక్యుమెంట్ ప్రతినబూనింది.

నాటో ఆందోళన చెందుతున్న అంశాల్లో చైనాను కూడా చేర్చడం వల్ల భారత్‌తో ఈ కూటమి చర్చలకు ఎక్కువ అవకాశం ఉంది. ఇండో-పసిఫిక్ దేశాలతో నిమగ్నమవ్వడానికి జపాన్‌లో నాటో కార్యాలయాన్ని ప్రారంభించవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. మారుతున్న ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా దాని వ్యూహాత్మక ప్రాధాన్యాలు ఉంటున్నాయి. భారతదేశం సాంప్రదాయికంగా నాటోతో వ్యవహారంలో జాగరూకతతో వ్యవహరిస్తోంది. కూటమి చారిత్రక లక్ష్యం, భారతదేశ సన్నిహిత సైనిక భాగస్వామి రష్యాపై దాని వైఖరిని దృష్టిలో ఉంచుకుంటే ఈ మౌనం కొంతవరకు అర్థం చేసుకోదగినదే. ఇంత స్పష్టమైన అభ్యంతరాలు ఉన్నప్పటికీ, భారత్ గత రెండు దశాబ్దాలుగా నాటోతో ఆశ్చర్యకరమైన రీతిలో అధికారిక అన్యోన్యతను కలిగి ఉంది.

భారత్, నాటో మధ్య ప్రారంభ వ్యవహారాలు... ఆయుధాల నియంత్రణ, తీవ్రవాద వ్యతిరేక సమస్యలతో నడిచాయి. వాటి మొదటి అధికారిక ఒడంబడిక 2005లో జరిగింది. తరువాతి రెండేళ్లలో, అంటే 2006, 2007లో ఇండియా తరఫున ప్రణబ్ ముఖర్జీ రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిగా ఇరు హోదాల్లో నాటో సెక్రటరీ జనరల్‌తో సమావేశమయ్యారు. నాటో డిప్యూటీ సెక్రటరీ జనరల్ 2007లో భారత్‌ను సందర్శించారు. 2019లో నాటో-భారత్ మధ్య జరిగిన రాజకీయ చర్చల్లో చైనా, తీవ్రవాదం, పాకిస్తాన్ వంటి అంశాలు చోటు చేసుకున్నాయి. రెండు సంవత్సరాల తరువాత, నాటో సెక్రటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ న్యూఢిల్లీలో యేటా జరిగే 'రైజీనా డైలాగ్'ని ఉద్దేశించి ప్రసంగించారు.

హిందూ మహాసముద్రంలో దొంగతనాల(పైరసీ) విషయంలో ఉమ్మడి భాగస్వామ్య సవాలుపై భారత్, నాటో మధ్య ఆచరణాత్మక సహకారం చాలా స్పష్టంగా ఉంది. 2009, 2011 మధ్య, బీజింగ్‌లో చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఆతిథ్య భేటీలోనూ, బ్రస్సెల్స్‌లో నాటో నిర్వహించిన సమావేశంలోనూ గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో పైరసీ వ్యతిరేక ప్రయత్నాలను సమన్వయం చేయడంలో భారత్, నాటో అధికారులు పాల్గొన్నారు. భారత నౌకాదళం వాలెన్సియాలోని నాటో ర్యాపిడ్ డిప్లాయబుల్ కోర్‌తో కూడా పరిచయాలను ఏర్పరచుకుంది. ఈ దశలు కొన్ని కచ్చితమైన ఫలితాలను అందించాయి. ఉదాహరణకు, 2011 మే నెలలో, అరేబియా సముద్రంలో సముద్రపు దొంగల దాడిని అడ్డుకోవడానికి భారత నౌకాదళం నాటో పెట్రోలింగ్ నౌకలతో సమన్వయం చేసుకుంది. రెండు సంవత్సరాల తరువాత, నాటో నౌకాదళ వాహనాలు గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో 14 మంది భారతీయ నావికులను రక్షించడంలో సహాయపడ్డాయి.

నాటో, భారత్ మధ్య కాలానుగుణమైన అధికారిక వ్యవహారాలు అఫ్గానిస్తాన్, సైనిక విద్య, శాంతి పరిరక్షక కార్యకలాపాలు, సైబర్ భద్రత వంటి ఇతర రంగాలకు విస్తరించాయి. కాబూల్ నుండి అమెరికా బలగాల ఉపసంహరణకు ముందు, భారత అధికారులు అక్కడి అంతర్జాతీయ భద్రతా సహాయ దళం (ఐఎస్ఏఎఫ్)లో పాల్గొన్న నాటో అధికారులతోనూ, సైనిక కమాండర్లతోనూ తమ దృష్టికోణాలను పంచుకున్నారు. 2007లో ఎస్తోనియాపై గణనీయమైన సైబర్ దాడుల తర్వాత భారత్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) ఫిన్లాండ్‌తో, నాటోతో సహకరించింది. తర్వాత 2008లో ఉత్తర సముద్రంలో నాటో కసరత్తులకు భారత అధికారులను పరిశీలకులుగా ఆహ్వానించారు. ఇటీవల, కమాండెంట్ నేతృత్వంలోని భారత జాతీయ రక్షణ కళాశాల ప్రతినిధి బృందం, నాటో మారిటైమ్ ఇంటర్‌డిక్షన్ ఆపరేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించింది.

బ్రస్సెల్స్ సదస్సు దృక్పథం నుండి అఫ్గానిస్తాన్ ఇప్పుడు వెనక్కిపోయి ఉండవచ్చు. అయినప్పటికీ ఇది న్యూఢిల్లీకి అధిక ప్రాధాన్యం కలిగిన అంశమే. ఏదేమైనా, అతి వ్యాప్తి చెందుతున్న వారి ఎజెండాల స్వరూపాలు నేడు మరింత సులభంగా స్పష్టంగా కనిపిస్తున్నాయి. సముద్ర భద్రత, సైబర్ భద్రత, ఇండో-పసిఫిక్‌లో రాజకీయ పరిణామాలు, వృత్తిపరమైన సైనిక విద్య, వాతావరణ మార్పులు, బహుశా ఆయుధాల నియంత్రణతోపాటు అణు ఎస్కలేటరీ డైనమిక్స్ ఇందులో ఉన్నాయి. సహజంగానే, వేర్వేరు ప్రయోజనాలు, ఆసక్తులు, తరచుగా భిన్నమైన భౌగోళిక రాజకీయ ప్రాధాన్యతల దృష్ట్యా... భారత్, నాటోలు రష్యాతో పరస్పర చర్చలకు భిన్నమైన విధానాలను కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు.

ఆర్మేనియా, కజకిస్తాన్, సెర్బియా వంటి రష్యాతో సన్నిహితంగా ఉన్న అనేక భాగస్వామ్యదేశాలతో నాటో తలపడుతోంది. అంతే కాకుండా, ఇటీవలి వరకు అది న్యూఢిల్లీతో కంటే బీజింగ్, మాస్కోలతో మరింత విస్తృతమైన సన్నిహిత సంబంధాలను కలిగి ఉంది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అధికారులు నాటోతో విద్యా శిక్షణా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. నవంబర్ 2021 వరకు, మాస్కోలో నాటో తన కార్యాలయం కూడా కలిగి ఉంది. వాటి మధ్య విభిన్న అనుకూలతలు ఉన్నప్పటికీ... ఇండో-పసిఫిక్‌లో పెరుగుతున్న వ్యూహాత్మక పోటీని నాటో అంగీకరించడం అనేది భారతదేశంతో విస్తృతమైన, లోతైన సంభాషణకు తలుపులు తెరుస్తుంది.

– ధ్రువ జైశంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఓఆర్ఎఫ్ అమెరికా;
అమ్మార్ నైనార్, జూనియర్ ఫెలో, ఓఆర్ఎఫ్ అమెరికా
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం గొప్ప?



అందరూ ఎందుకు స్వీడన్ 'నాటో' ఒప్పందానికి సంతోషపడుతున్నారు? 'నాటో' వ్యాప్తి అనేది ప్రమాద తీవ్రతను పెంచేది కాదా? దీన్ని తిప్పికొట్టడానికి పుతిన్ ఉక్రెయిన్‌ను దురాక్రమించడా?

– యూజీన్ ఫింకెల్, పొలిటికల్ సైంటిస్ట్

ఇదీ తెలీదా?



మీకు నచ్చని రచయితను దేశం నుంచి బహిష్కరించినా కూడా మీకు నచ్చని అంశాలే రాస్తాడు. దానికి మీరు చేయగలిగింది పెద్దగా ఏమీవుండదు. ఈ మాత్రం కనీసపు ఇంగిత జ్ఞానం కూడా లేని వాళ్ళు ఏం మేధావులో?

– అమిత్ మాలవీయా, కాలమిస్ట్

కొంచెం ఆగుదాం!



జీవితపు మౌలికాంశాలకు నవజీవనం కల్పించాల్సిన సమయం ఇదే. ప్రకృతి ప్రకోపం ముందు దురాశ, వేగం లాంటివాటికి చెల్లుబడి లేదని గుర్తించాలి. ప్రకృతి పర్యావరణ సూత్రాలకు అనుగుణంగా జీవించడాన్ని మనం మరోసారి నేర్చుకోవాలి. అవధి లేని అభివృద్ధి అనేది ఒక భ్రాంతి.

– వందనా శివ, పర్యావరణవేత్త

అవసరం లేదు



సెమీకండక్టర్ పరిశ్రమకు ఇండియా భారీ కేంద్రం కాలేదు, కాకూడదు కూడా! ప్రపంచంలోని అత్యంత పొడి దేశాల్లో మనదీ ఒకటి. లక్షలమందికి తాగునీరు లేదు. సెమీకండక్టర్ల తయారీకి చాలా ఎక్కువ నీళ్లు కావాలి. ఆ పరిశ్రమ మనకు అక్కర్లేనిది.

– గౌరవ్ సబ్నిస్, అసోసియేట్ ప్రొఫెసర్

ఇక్కడే నయం



నేను ఒక నెలకు పైగా యూకేలో ఉన్నాను. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత లాంటి వాటిని పోల్చిచూస్తే ఇండియా ఎంత సురక్షితంగా ఉందో చెప్పలేను! ప్రాథమికంగా నేను చెప్పాలనుకునేది ఏమంటే– తాజా గాలి, మంచి వాతావరణం, ఇవి తప్పించి యూకే వెళ్లడానికి ఇంకే కారణమూ లేదు.

– రజత్ శర్మ, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్

రోడ్లుంటే సరా?



మనం ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మిస్తున్నాం, కానీ ఎవరూ నియమాలను పాటించడం లేదు. ట్రక్కులు, బస్సులు తప్పుడు లేన్లలో ప్రయాణిస్తాయి. కార్లు, ఇతర వాహనాలకు కొన్నిసార్లు నడవడానికి తగనంతటి దారుణమైన టైర్లుంటాయి. పదేపదే హారన్ కొట్టనక్కర్లేదనీ, కారు దీపాలను ఆర్పుతూ వెలుగుతూ ఉంటే చాలనీ అర్థం కాదు.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

ఎలాంటి ప్రయాణం!



రేపు (జూలై 12) నా 26వ పుట్టినరోజంటే నమ్మలేక పోతున్నా. ఐక్య రాజ్య సమితిలో ప్రసంగించి పదేళ్లు అయింది. అప్పటి ఆ పదహారేళ్ల అమ్మాయికి తర్వాత ఏం జరుగుతుందో, ఎలాంటి అద్భుతమైన మనుషులను కలుస్తుందో, ఏ ప్రదేశాలకు వెళ్తుందో తెలీదు. బాలికల విద్య కోసం పోరాటం కొనసాగించాలన్న పట్టుదల మాత్రమే ఆమెకు ఉండేది.

– మలాలా యూసఫ్‌జాయ్, విద్యా యాక్టివిస్ట్

తొండి ఆట

కైలాసం చేరతా
ఇక అనుకునేసరికి
ఆశించిన పందెం పడక
పెద్ద పాము మింగుతుంది
ఆట మళ్లీ మొదటికి చేరుతుంది

పులి మేక ఆట ఆడుదామని
పురుసత్ గా కూర్చునేసరికి
మేకలన్నీ ఏకమై పులిని కట్టడి చేయలేక
మూగగా అరుస్తూ కకావికలమవుతాయి
పులి ప్రతిసారి మేకల్ని కాజేస్తుంది
64 తెలుపు నలుపు గళ్ళ
చదరంగం క్రీడ క్రీనీడలో
మోహరించిన చతురంగ బలగాలు
రౌద్ర ప్రతాపంతో కాలు దువ్వుతాయి
కారాలు మిరియాలు కార్పణ్యాలు నూరి
శత్రువును దునుమాడుతాయి
మంత్రి మంత్రాంగం ఫలించకుంటే
రాజు చక్రబంధంలో చేతులెత్తేస్తాడు
అన్ని ఆటల వలెనే
చెస్‌లో సామాన్య సైనికులే ఎర అవుతారు!

నూకలు పెడితే మేకలు కాస్తావా?
పెద్దపులి వస్తే భయపడతావా?

వెన్నుపోటో, పచ్చి నీటి మాటలో
ఏది ఏమైతేనేం
ఎట్లైనా తొండి చేసి నాయకులు విజేతలవుతారు!
ఐదేళ్లకో మారు ప్రజలు పరాజితులవుతారు!!

– జూకంటి జగన్నాథం

మౌలిక వసతుల ఏర్పాటు ముఖ్యం

అభిప్రాయం



డా॥ పెంట కృష్ణ

అమెరికా మాజీ అధ్యక్షుడు లిండన్ బి. జాన్సన్ విద్యను ఒక సమస్యగా చూడకుండా ఒక అవకాశంగా చూడాలన్నారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడాన్ని భారంగా భావిస్తోంది. ఒక సమస్యగా చూస్తోంది. కానీ విద్య అనేది సమర్థ మానవ వనరుల నిర్మాణంలో కీలకపాత్ర వహిస్తుంది. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రభుత్వం విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరిపింది. 'ఏన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్' (ఏఎస్ఈఆర్) ను పరిశీలిస్తే కానీ తెలంగాణలో పాఠశాల విద్యావ్యవస్థ తీరు తెన్నులు అవగతం కావు.



ఏఎస్ఈఆర్ 2022 నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులు రెండవ తరగతి పాఠాన్ని చదువగలవారు 2018 సంవత్సరంలో కేవలం 18 శాతం ఉండగా, అది కాస్త 2022 నాటికి 5.2 శాతానికి పడిపోయింది. ఐదవ తరగతి విద్యార్థులు రెండవ తరగతి పాఠాన్ని 2018 లో 40.7 శాతం విద్యార్థులు మాత్రమే చదవగలిగారు. 2022 నాటికి అలా చదవగలిగినవారి శాతం 31.7 తగ్గింది. ఎనిమిదవ తరగతి విద్యార్థులు రెండవ తరగతి పాఠాలను 2018 సంవత్సరంలో 69 శాతం చదవగా, 2022 నాటికి 61.8 శాతానికి తగ్గారు. ఈ విధంగా పాఠశాల విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం తగ్గుముఖం పట్టిందన్నమాట.

అలాగే తెలంగాణ 'సోషియో ఎకనామిక్ సర్వే' ప్రకారం రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో 2021-22 సంవత్సరానికి 62.29 లక్షల మంది పిల్లలు నమోదు చేసుకోగా... వీరిలో 50.23 శాతం మంది ప్రయివేట్, 49.77 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తే సగానికి పైగా పాఠశాల విద్య ఇంకా ప్రయివేటు వారి చేతుల్లోనే ఉంది. అంటే ప్రభుత్వ విద్యపై ఇంకా సగం మంది ప్రజలకు నమ్మకం కలగడం లేదు అని అర్థమౌతుంది. ప్రభుత్వ విద్య ప్రజలు నమ్మే విధంగా ఉండాలంటే కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి. కానీ ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలమైంది. రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అటువంటప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుంది అనేది ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశల వారిగా ఇంగ్లీషు మీడియంలో బోధన చేపట్టాలి. విద్యకు సరిపడా బడ్జెట్లో నిధులు కేటాయించి వాటిని ఖర్చు చేయాలి. అప్పుడే ప్రభుత్వ విద్యపై ప్రజలలో నమ్మకం కలుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతమూ పెరుగుతుంది.

'కొఠారీ కమిషన్' సిఫారసులు విద్యపై బడ్జెట్‌లో ఆరు శాతం నిధులు కేటాయించాలని సూచించింది. నేడు ఆర్థికాభివృద్ధి జ్ఞానం ఆధారితంగా నిర్మితమవుతున్నది. కావున విద్యపై నిధుల కేటాయింపులు పెరగవలసిన అవసరం ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా విద్యకు కేటాయించిన నిధులు అరకొరగా ఉన్నాయి. భారతదేశంలో పాఠశాల విద్యపై యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ తన 2021-22 నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో 30,023 ప్రభుత్వ పాఠశాలల్లో 11,124 పాఠశాలలకు కుళాయి నీటి సరఫరా లేదు. 1,859 పాఠశాలల్లో తాగునీరు లేదు. అంతేకాకుండా 2,124 పాఠశాలల్లో టాయిలెట్ సౌకర్యం లేదు. బాలురకు మరుగుదొడ్ల సౌకర్యం ఉన్న పాఠశాలలు 22,043 కాగా, బాలికలకు మరుగుదొడ్ల సౌకర్యం ఉన్న పాఠశాలలు 26,066.


వివిధ నివేదికల సారాంశాన్ని చూసినప్పుడు తెలంగాణలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన తరగతి గదులు, టాయిలెట్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు లేవని స్పష్టమౌతుంది. ఈ వసతులు కల్పించకపోవడం అంటే పిల్లల చదువుకునే హక్కును నిరాకరించడమే. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం వెంటనే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి.

– వ్యాసకర్త చరిత్ర విద్యార్థి, మొబైల్: 8008390993

తెలుగుజాతి సారస్వత శిఖరం

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు తెలుగు జాతి శాశ్వతంగా గుర్తుంచుకోవలసిన శిఖరాగ్ర సమానుడు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య సౌహార్ద సయోధ్యకు పాటుపడిన అపర మేధావి.

కృష్ణాజిల్లా పెనుగ్రంచిపోలులో 1876లో జన్మించిన ఆయన విద్యాభ్యాసం తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో సాగింది. చిన్నతనంలోనే మరాఠీలో అనేక రచనలు చేశారు. విద్యార్థి దశలోనే 'సమాచార్', 'వివిధ విజ్ఞాన్ విస్తార్' వంటి మరాఠీ పత్రికలకి సంపాదకత్వం వహించడమే కాదు, 'కేసరి', 'మహారాష్ట్ర' వంటి పత్రికల్లో జరిగే చర్చలు, వాదోపవాదాల్లో కూడా చురుకుగా పాల్గొన్నారు. తెలుగులో 'జనరంజని' పత్రిక నడిపారు. విజయవాడలో పనిచేస్తూ స్త్రీ విద్యా వ్యాప్తి కోసం అప్పట్లో రాయసం వెంకట శివుడు ఆధ్వర్యంలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో లక్ష్మణరావు, ఆయన సోదరి అచ్చమాంబ కూడా రాసేవారు. లక్ష్మణరావు ఉన్నతికి అక్క అచ్చమాంబ ఆదరణ ఎంత ఉన్నదో, తొలి కథా రచయిత్రిగా, స్త్రీవాదిగా, సంస్కర్తగా అచ్చమాంబ ఉన్నత వ్యక్తిత్వం సంతరించుకోవడంలో ఆయన ప్రోత్సాహం అంతే ఉంది.



కొమర్రాజు లక్ష్మణరావు

బ్రిటిష్ తత్వవేత్త హెర్బర్ట్ స్పెన్సర్ 'అజ్ఞాత వాదా'న్ని విశ్వసించిన లక్ష్మణరావు మతాతీత లౌకిక వాద సిద్ధాంతాన్ని జీవితాంతం అనుసరించారు. ఏ ఇతర మార్గం పైనా కూడా కించిత్తు ద్వేష భావం లేకుండా ప్రవర్తించారు. తెలుగు జాతి సాంస్కృతిక వికాసాన్ని కొత్త పుంతలు తొక్కించిన కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి వంటి వారి అడుగుజాడల్లో నడిచిన సంస్కర్త లక్ష్మణరావు. హైదరాబాదులో ఈనాటికీ కొనసాగుతోన్న 'శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయా'న్ని స్థాపించడం మొదలు, 'విజ్ఞాన చంద్రికా మండలి', 'విజ్ఞాన చంద్రికా పరిషత్తు', 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వంటి సంస్థల్లో ఆయన నిర్వహించిన పాత్ర అమోఘం. గాడిచర్ల హరిసర్వోత్తమరావు విశిష్ట రచన 'అబ్రహాం లింకన్' మొదలుకొని కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర వరకూ తెలుగు వారికి విశిష్టమైన గ్రంథాల్ని అందించిన ఘనత కొమర్రాజు వారిదే.

కొమర్రాజుకు శాశ్వత కీర్తిని ఆర్జించింది మాత్రం 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ' నిర్మాణం. 'శివాజీ చరిత్ర' మొదలుకొని, 'హిందూ మహా యుగము', 'మహమ్మదీయ మహా యుగము' వంటి రచనలు ఆయన స్వయంగా చేశారు. 'జ్ఞానమొక భాష యొక్క యబ్బ సొమ్ము కాదు' అని ధైర్యంగా నినదించిన ఆయన వ్యవహారిక భాష విషయంలో మాత్రం విజ్ఞత ప్రదర్శించకుండా, సంప్రదాయవాదిగా మిగిలిపోవడం బాధాకరం. ఆ ఒక్క అంశం మినహా, ఆయనలో వేలెత్తి చూపేందుకు ఏమీ లేదు. అయితే చిన్న (46 ఏళ్ల) వయసులోనే 1923 జూలై 12న ఉబ్బసం వ్యాధితో అకాల మరణం చెందడం తెలుగు జాతి సారస్వత స్రవంతికి తీరని లోటుగా మిగిలిపోయింది.

– గౌరవ్, సామాజిక కార్యకర్త
(నేడు కొమర్రాజు లక్ష్మణరావు శతవర్ధంతి)

క్లుప్తంగా...

రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఒమర్ జలీల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సయ్యద్ ఒమర్ జలీల్‌ను రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గరిష్టంగా రెండేళ్ల వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఆయన పదవిలో కొనసాగుతారని పేర్కొంది. మైనారిటీల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్‌ను కార్మిక శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆయనకు ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వ్యవసాయంలో అసమానతలు రూపుమాపేలా..

సీజీఐఏఆర్, మేనేజ్ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా వ్యవసాయ రంగంలో స్త్రీ పురుష అసమానతలను రూపుమాపేందుకు ది కన్సార్టియం ఆఫ్ ఇంటర్నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్స్ (సీజీఐఏఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లు ముందుకొచ్చాయి. ఈ మేరకు సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫామ్, మేనేజ్‌లు హైదరాబాద్‌లో మంగళవారం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ అంతరాన్ని రూపుమాపేందుకు అవసరమైన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. హైదరాబాద్‌లోని మేనేజ్‌లో జరిగిన కార్యక్రమంలో సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫామ్ డైరెక్టర్ డాక్టర్ నికోలిన్ డి హాన్, మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ఒప్పందంపై సంతకాలు చేశారు. లింగ సమానత్వాన్ని మెరుగుపరచడానికి, వ్యవసాయరంగంలో యువతకు అవకాశాలను కల్పించడానికి కృషి చేయడంతోపాటు మహిళా రైతులతో వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తారు. మేనేజ్‌తో ఒప్పందం చేసుకోవడం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవసాయ విస్తరణ వ్యవస్థలో నిమగ్నం కావడానికి తోడ్పడుతుందని సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫామ్ డైరెక్టర్ నికోలిన్ డి హాన్ అన్నారు. వ్యవసాయంలో స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫామ్ వచ్చే అక్టోబర్‌లో ఢిల్లీలో వ్యవసాయంలో అంతర్జాతీయ స్త్రీ పురుష అసమానతపై సమావేశాన్ని ఏర్పాటు చేస్తోంది.

ఎమ్మెల్యే టికెట్‌ను తిరస్కరించా: జాజుల



ఆదిలాబాద్ రూరల్: 'గతంలో ఓ పార్టీ నాకు అంబర్‌పేట్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇస్తానంటే.. అది నా కాలి గోటితో సమానమని చెప్పి తిరస్కరించాను' అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీలు తలదించుకునే మేకల్లాగాక గర్జించే సింహాలుగా మారాలని, పదవులు ఆశించే స్థాయి నుంచి రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీసీల రాజకీయ ప్లీనరీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా రిమ్స్ ఆసుపత్రి ఎదుట ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటైనా బీసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు మాదిరిగా బీసీబంధు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరితే.. సీఎం కేసీఆర్ 136 బీసీ కులాల్లోని కొన్ని కులాలకు మాత్రమే రూ.లక్ష వరకు ఇస్తామంటున్నారని మండిపడ్డారు. సీఎం ఇచ్చే రూ.లక్ష వద్దని, తమకు సీఎం పీఠం ఇస్తే కేసీఆర్‌కు తామే రూ.10 లక్షలు ఇస్తామని తెలిపారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీల రాజకీయ ప్లీనరీకి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రావాలని కోరారు.. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కూతురిపై కేసు!

హైకోర్టు ఉత్తర్వులపై జనగామ పోలీసుల స్పందన?

జనగామ: నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాలకు తన కూతురు తుల్జా భవానీ రెడ్డి, అల్లుడు రాహుల్‌రెడ్డి అడ్డు తగులుతున్నారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి వేసిన పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించింది. ఈ మేరకు పిటిషన్‌లో పేర్కొన్న ప్రతివాదులకు షోకాజ్ నోటీసులను జారీ చేసింది. పిటిషన్‌లోని మొదటి ఆరుగురికి (పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులు) అందించిన షోకాజ్ నోటీసులను ప్రభుత్వ న్యాయవాది అందుకోగా, ఎమ్మెల్యే కూతురు, అల్లుడికి రిజిస్టర్ పోస్టు చేశారు. ఎమ్మెల్యే పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుని, ఆయన అధికారిక కార్యక్రమాలకు విఘాతం కలగకుండా, కూతురు, అల్లుడిపై చర్యలు తీసుకోవాలని జనగామ, చేర్యాల ఎస్‌హెచ్‌వోలను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కూతురుపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా సమాధానం చెప్పలేదు.

కొత్త ట్రిబ్యునల్‌పై మాట నిలబెట్టుకోండి

- కృష్ణా నదీ జలాల వివాదం తేలే వరకు 50:50 నిష్పత్తిలో నీటిని పంచండి
- కాళేశ్వరం మూడో టీఎంసీ సహా సీతారామ, సమ్మక్క బ్యారేజీలను ఆమోదించండి
- కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరిన మంత్రి హరీశ్‌రావు
- ఏపీ చేపడుతున్న పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులు అడ్డుకోవాలని వినతి



ఢిల్లీలో షెకావత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న హరీశ్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీ జలాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య పునఃపంపకాలకు సంబంధించి గత అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఇచ్చిన హామీ మేరకు కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. కృష్ణా జలాల్లో ప్రస్తుతం ఉన్న వాటాలను సవరించి రెండు తెలుగు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిన తాత్కాలిక కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన మంత్రి హరీశ్‌రావు మంగళవారం రాత్రి కేంద్రమంత్రి షెకావత్‌ను కలిశారు. సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, ఇరిగేషన్ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ కుమార్ కూడా పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి విన్నవించిన అంశాలు ఇలా....

1) తెలంగాణలో గోదావరి బేసిన్‌లోని సీతారామ ఎత్తిపోతల పథకం, సమ్మక్క సాగర్ ప్రాజెక్టు, కాళేశ్వరం అదనపు టీఎంసీ, డా.బీఆర్ అంబేడ్కర్ వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఆమోదముద్ర వేయాలి.
2) 2021 గెజిట్ నోటిఫికేషన్ అనంతరం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి 2022లో తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌ను అందించింది. సీడబ్ల్యూసీ క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని వినతి.
3) గోదావరి వరద జలాలను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా పోలవరం ప్రాజెక్టులో భాగమైన కుడి, ఎడమ మెయిన్ కాలువలను అనుమతించిన దాని కంటే ఎక్కువగా విస్తరిస్తోంది. కుడి, ఎడమ మెయిన్ కెనాల్ విస్తరణ ద్వారా 493 టీఎంసీల కేటాయింపులకు వ్యతిరేకంగా ఏపీ దాదాపు 1500 టీఎంసీల సామర్థ్యాన్ని సృష్టిస్తోంది. ఇది గోదావరి మిగులు జలాల్లో తెలంగాణ వాటాపై ప్రభావం చూపుతుంది. అంతేగాక ఆమోదం లేని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెంకటనగరం ప్రాజెక్టులను ఎడమ కాలువపై, చింతలపూడి ఎత్తిపోతల పథకం (మొదటి దశ - రెండవ దశ), గోదావరి-పెన్నార్ లింక్ వంటి అనేక ప్రాజెక్టులను కుడి కాలువపై నిర్మిస్తోంది. కుడి, ఎడమ కాలువ అక్రమ విస్తరణను, ఈ అనుమతులు లేని అక్రమ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో జోక్యం చేసుకొని నిర్మాణం చేయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలి.
4) కృష్ణా జలాల్లో సమానమైన కేటాయింపుల కోసం కొత్తగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ అనేకసార్లు అభ్యర్థించింది. ట్రిబ్యునల్ నిర్ణయం పెండింగ్‌లో ఉన్నందున తెలంగాణ, ఏపీ మధ్య ప్రస్తుత నీటి సంవత్సరం నుంచి ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకునే వరకు నీటి భాగస్వామ్య నిష్పత్తిని 50:50కి సవరించాలి.

ట్రిబ్యునల్‌పై త్వరలోనే నిర్ణయం చేస్తామన్నారు : మంత్రి హరీశ్‌రావు

కేంద్రమంత్రి షెకావత్‌తో భేటీ అనంతరం మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుపై ఇచ్చిన మాట వాస్తవమేనని కేంద్రమంత్రి వెల్లడించారన్నారు. ఈ అంశంపై అధికారులతో సంప్రదించి నిర్ణయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వీటితో పాటు ఏపీ చేపట్టిన పోలవరం కుడి, ఎడమ కాలువల అక్రమ విస్తరణ, డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తీసుకొనేలా చేపట్టిన పనులతో గోదావరి జలాల్లో రాష్ట్రానికి ఉన్న హక్కులను తెలంగాణ కోల్పోతున్న అంశాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

కాలు నరికి.. కడియాలు దోచి.. మహిళ దారుణ హత్య

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

షాద్‌నగర్ రూరల్: కాలు నరికి కడియాలను దోచుకొని ఓ మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణ సీఐ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం బంగంపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, గంగమ్మ(40) దంపతులు. బతుకుదెరువుకోసం రెండేళ్ల క్రితం పట్టణానికి వచ్చిన దంపతులు పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో గుడిసె వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. వెంకటయ్య డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంవద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా గంగమ్మ ఇళ్లలో పని చేస్తోంది. కాగా, గంగమ్మ ఈ నెల 8న సొంత ఊరు బంగంపల్లికి వెళుతున్నానని భర్తకు చెప్పి బయలుదేరింది. అదేరోజు గుర్తు తెలియని వ్యక్తులు గంగమ్మ ఒంటిపై ఉన్న నగలకోసం మాయమాటలు చెప్పి పట్టణ శివారు ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ దారుణంగా హత్య చేసి మృతురాలి ఒంటిపై ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నారు. 40 తులాల కాళ్ల వెండి కడియాలు తీసుకునేందుకు ప్రయత్నించగా కడియాలు రాలేదు. దీంతో గంగమ్మ కాలు నరికి కడియాలను దోచుకొని పరారయ్యారు.

అదృశ్యం కేసు నమోదైన రోజే హత్య వెలుగులోకి..

నాలుగు రోజులైనా భార్య తిరిగి రాకపోవడం, ఇంటికి వెళ్లలేదని తెలియడంతో వెంకటయ్య మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, పట్టణ శివారులోని హాజిపల్లి రోడ్డు సమీపంలోని ముళ్ల పొదల్లో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు 100కు డయల్ చేసి సమాచారాన్ని అందించారు. పోలీసులు వెంకటయ్యను ఘటనా స్థలానికి తీసుకువెళ్లడంతో మృతి చెందిన మహిళ గంగమ్మగా గుర్తించారు. నాలుగు రోజుల క్రితమే మహిళ దారుణ హత్యకు గురికావడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వచ్చింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు.

అభివృద్ధికి నిధులివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

ఏడాదికి రూ.450 కోట్లు మేర నిధులు ఇవ్వడం జరిగింది. 2014-15, 2019-20, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు గాను తెలంగాణకు నిధులు మంజూరు చేయలేదన్న అంశాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు గాను ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం నిధులు మంజూరు చేయాలని కోరారు.

జీఎస్టీ సమస్యల పరిష్కారానికి అధికారులను నియమించాలి

తెలంగాణకు రావాల్సిన ఐజీఎస్టీ నిధులు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి హరీశ్‌రావు జీఎస్టీ కౌన్సిల్‌ను కోరారు. ఈ విషయమై అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయాలంటూ చాలా కాలంగా జీఎస్టీ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 50వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. తెలంగాణకు రావాల్సిన ఐజీఎస్టీ నిధుల అంశాన్ని ప్రస్తావిస్తూ, మహారాష్ట్రకు చెందిన ఒక ట్యాక్స్ పేయర్ రూ.82 కోట్లు తెలంగాణకు చెల్లించాల్సి ఉందని... ఇదే విషయాన్ని ఆ ట్యాక్స్ పేయర్ కూడా అంగీకరించారని వివరించారు. అయితే తనకు రిఫండ్ రాగానే చెల్లిస్తామని సదరు ట్యాక్స్ పేయర్ హామీ ఇచ్చారని, అయితే ఆయనకు రిఫండ్ ఇంకా పెండింగ్‌లోనే ఉందని జీఎస్టీ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో జరిగిన 47వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే ఈ అంశాన్ని లేవనెత్తామని... ఆఫీసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు హామీ లభించినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదన్నారు. కాగా ఈ ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక మంత్రి సానుకూలంగా స్పందించారు. 47వ జీఎస్టీ కౌన్సిల్ మీటింగులో చర్చించుకున్నట్లుగా ఆఫీసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

థాంక్యూ సీఎం గారూ..

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్‌కు సంజయ్ ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం కేసీఆర్‌కు ఎంపీ బండి సంజయ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం సంజయ్ ట్వీట్ చేశారు. సంజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం లేఖ పంపించారు. ప్రజా సంక్షేమానికి శ్రమిస్తున్న సంజయ్ ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు ప్రజలకు సేవలు అందించాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని కోరుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు.

ఆ స్కీములన్నీ స్కాములే: వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పాలనలో స్కామ్ లేని స్కీమ్‌లేదని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. 'ప్రజల సొమ్ము దోచుకో.. ఫామ్ హౌస్‌లో దాచుకో..' ఇదే కేసీఆర్ పాలనా సిద్ధాంతమని పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ మేనిఫెస్టోకు విలువ లేదు.. వాగ్దానానికి దిక్కులేదు' అని ఆరోపించారు. 'మస్త్ చెప్తం తియ్' ఇదే కేసీఆర్ హామీల సారాంశమని అన్నారు. మంగళవారం ట్విట్టర్ వేదికగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ఆమె ప్రపంచ జనాభా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మంచి చేస్తారని నమ్మి, అధికారమిస్తే.. 10 ఏళ్ల పాలనలో కనీసం 10 పథకాలు కూడా అమలు చేయని కేసీఆర్ దేశానికి దార్శనికుడట అని ఎద్దేవా చేశారు. 'సున్నా వడ్డీ పేరిట 60 లక్షల మంది మహిళలను మోసం చేశారు.. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని 30 లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టారు.. కేజీ టు పీజీ అని చెప్పి 2 వేల సర్కారీ బడులనే బంద్ చేశారు.రూ.5 వేల రైతు బంధు చూపించి, రూ.35 వేల సబ్సిడీ పథకాలను ఆపారు' అని ఆరోపించారు.

నకిలీలను అరికట్టేందుకు సమగ్ర చట్టం రావాలి

రాష్ట్ర వ్యవసాయరంగంలో అద్భుత పురోగతి: మంత్రి నిరంజన్‌రెడ్డి



మొబైల్ వ్యాన్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి

ఏజీ వర్సిటీ: వ్యవసాయంలో నకిలీలను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా సమగ్ర చట్టం రావాల్సి ఉందని, పెస్టిసైడ్స్, బయోపెస్టిసైడ్స్ నాణ్యతా ప్రమాణాలు గుర్తించడానికి రాష్ట్రంలో ఓ వ్యవస్థ తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రో కెమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో 'నాణ్యమైన దిగుబడి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల పాత్ర' అనే అంశంపై వర్సిటీ విద్యాసంస్థ రూపొందించిన 10 మొబైల్ వ్యాన్‌లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి వ్యవసాయ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించామని ఆయన చెప్పారు. గ్రామాలలో రైతు వేదిక కేంద్రాలు, నీటిపారుదల సౌకర్యాల విస్తరణ, చెరువుల పునరుద్ధరణతో వ్యవసాయంలో గణనీయమైన పెరుగుదల సాధ్యపడిందని, రైతుల సంపాదన కూడా పెరిగిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఈ మొబైల్ వ్యాన్‌లు రైతులకు కీలకమైన సమాచారాన్ని అందజేస్తాయని అన్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అభివృద్ధి చెందుతోందని, రైస్ మిల్లింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం ఆధునిక రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతు, పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, ఏసీఎఫ్ఐ సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ గోస్వామి, ఐసీఎఫ్ఐ చైర్మన్ ఆర్‌జీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలోకి మహారాష్ట్ర నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహారాష్ట్రలోని వేర్వేరు పార్టీలకు చెందిన నేతలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. అధినేత వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో చంద్రపూర్ జిల్లా సీడీసీబీ బ్యాంక్ మాజీ డైరెక్టర్, జిల్లా సహకార బోర్డ్ ఉపాధ్యక్షుడు, ఎన్సీపీ వరోరా పూర్వ అధ్యక్షుడు వసంత్ మరోట్‌రావ్ విధాతే, దివంగత మాజీ మంత్రి వామన్‌రావు గదంవార్ సోదరుడు, చంద్రపూర్ జెడ్పీ సభ్యులు సతీశ్ గదంవార్, ఆమ్‌ఆద్మీ పార్టీ మాజీనేత ఆశీష్ ఘుమే, చంద్రపూర్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల నేత అమిత్ దేవ్ రావ్ కంకే, భద్రావతి నగర్ పరిషత్ సేవక్ రాహుల్ సొంటక్కె తదితరులున్నారు. చేరికల కార్యక్రమంలో బాల్క సుమన్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అధిక పెన్షన్ గడువు

- మరికొంత సమయం ఇవ్వాలని చందాదారులు, యాజమాన్యాల వినతి
- పలుమార్లు పొడిగింపు నేపథ్యంలో మరో అవకాశం లేదన్న ఈపీఎఫ్‌ఓ

సాక్షి, హైదరాబాద్: అధిక పెన్షన్‌కు సంబంధించి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) తలపెట్టిన జాయింట్ ఆప్షన్ నమోదు ప్రక్రియ గడువు ముగిసింది. ఇప్పటికే పలుమార్లు గడువును పొడిగిస్తూ... దాదాపు నాలుగున్నర నెలల పాటు కొనసాగిన అధిక పెన్షన్ ఆప్షన్ ప్రక్రియకు ఈనెల 11వ తేదీ అర్ధరాత్రితో తెరపడింది. దేశవ్యాప్తంగా దాదాపు 19 లక్షల మంది అధిక పెన్షన్ కోసం ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చినట్లు ఈపీఎఫ్‌ఓ అధికారుల అంచనా. వీటికి సంబంధించిన పూర్తి గణాంకాలను ఈపీఎఫ్‌ఓ ఇంకా వెల్లడించలేదు. కాగా, గడువు ఇంకా పొడిగించాలంటూ చందాదారులు, యాజమాన్యాలు ఈపీఎఫ్‌ఓను కోరినప్పటికీ.. పొడిగింపుపై ఈపీఎఫ్‌ఓ ఎలాంటి ప్రకటన చేయలేదు.

అంతా గందరగోళం..: ఈపీఎఫ్‌ఓ తలపెట్టిన అధిక పెన్షన్ విధానంపై గందరగోళం చందాదారులను వీడలేదు. ఎంప్లాయీ పెన్షన్ పథకంలో భాగంగా అమలు చేయనున్న అధిక పెన్షన్ ఆప్షన్ చందాదారులందరికీ ఆసక్తి కలిగించింది. 2014 కంటే ముందు సర్వీసులో చేరి ఈపీఎస్ పథకం పరిధిలో ఉన్నవారికి మాత్రమే ఈ అధిక పెన్షన్ వర్తిస్తుంది. అయితే.. అధిక పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే క్రమంలో నిబంధనలన్నీ ఈపీఎఫ్‌ఓ కోడ్ భాషలో పేర్కొంటూ ఇచ్చిన సర్క్యులర్లు చందాదారుల దిమ్మతిరిగేలా చేశాయి. ఈ నిబంధనలపై అవగాహన కలిగించడంలో ఈపీఎఫ్‌ఓ అధికారులు విఫలమయ్యారనే వాదనలొచ్చాయి. ఈపీఎఫ్‌ఓ కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లినా దీనిపై సరైన సమాచారం ఇవ్వలేదంటూ చందాదారులు మండిపడ్డ దాఖలాలు అనేకం. దీంతో చాలామంది ఆప్షన్ ఇవ్వడానికి వేచిచూశారు. మరికొందరు ఆప్షన్ ఇవ్వడానికి వెబ్ లింకు తెరిస్తే.. అప్‌లోడ్ చేయాల్సిన డాక్యుమెంట్లు, వివరాలను చూసి జడుసుకునే పరిస్థితి వచ్చింది. యాజమాన్యాలు సైతం ఉద్యోగులకు ఎలాంటి సూచనలు చేయలేదనే విమర్శలున్నాయి. ఈ విషయమై ఈపీఎఫ్‌ఓ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖల్లాలేవు. దీంతో గడువు తేదీ పొడిగింపు కోసం ఈపీఎఫ్‌ఓకు వినతులు వెల్లువెత్తాయి. కానీ ఇప్పటికే పలుమార్లు అవకాశం కల్పించామంటున్న అధికారులు... ఇక గడువును పొడిగించే అవకాశం లేదని సంకేతాలిచ్చారు.

గోదావరి నికర జలాల్లో మిగులే లేదు

కావేరి-గోదావరి అనుసంధానం ఎలా సాధ్యం

- తీవ్ర అభ్యంతరం తెలిపిన ఏపీ, తెలంగాణ
- నికర జలాల్లో మిగులు లేదని సీడబ్ల్యూసీ తేల్చింది
- అది వాస్తవమేనని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ అంగీకారం
- ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని నీటితో అనుసంధానం చేపడతామని వెల్లడి
- ఇందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి తీవ్ర వ్యతిరేకత
- ఏకాభిప్రాయానికి వచ్చాకే అనుసంధానం
- కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: గోదావరి నది నికర జలాల్లో మిగులు లేదని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చిన నేపథ్యంలో గోదావరి-కావేరి అనుసంధానాన్ని ఎలా చేపడతారని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ)ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నీటిపారుదల శాఖల అధికారులు నిలదీశారు. గోదావరి బేసిన్‌లో రెండు రాష్ట్రాల్లో పూర్తయిన, నిర్మాణం , ప్రతిపాదన దశలో ఉన్న ప్రాజెక్టులకే 306 టీఎంసీల మేర నికర జలాల కొరత ఉందని సీడబ్ల్యూసీ తేల్చిన అంశాన్ని ఎత్తిచూపారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను తరలిస్తే రాష్ట్రాల్లో ప్రాజెక్టుల ఆయకట్టు ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ స్పందిస్తూ.. గోదావరిలో నికర జలాల్లో మిగులు లేని మాట వాస్తవమేనని అంగీకరించారు. ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.26 టీఎంసీలను తరలించేలా గోదావరి-కావేరి అనుసంధానాన్ని చేపడతామని చెప్పడంతో ఛత్తీస్‌గఢ్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మా కోటా నీటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ స్పందిస్తూ.. గోదావరి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాకే గోదావరి-కావేరి అనుసంధానం చేపడతామని తేల్చిచెప్పారు. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన ఎన్‌డబ్ల్యూడీఏ 71వ పాలక మండలి సమావేశం మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వింద రసింగ్ వోరా, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్, సీఈ రమేశ్, అంతర్రాష్ట్ర విభాగం డీడీ సుబ్రహ్మణ్య ప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అనుసంధానానికి సిద్ధమన్న ఎన్‌డబ్ల్యూడీఏ

గోదావరిలో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.26 టీఎంసీలను ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్(కృష్ణా), సోమశిల (పెన్నా) మీదుగా గ్రాండ్ ఆనకట్ట(కావేరి)కి తరలించడానికి రూపొందించిన గోదావరి-కావేరి అనుసంధానం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు ఇచ్చామని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్‌సింగ్ చెప్పారు. ఇందులో తెలంగాణకు 45, ఏపీకి 44, తమిళనాడుకు 40, కర్ణాటకకు 9.9, పుదుచ్చేరికి 2.1 టీఎంసీలు ఇస్తామని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే నాలుగుసార్లు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని.. అనుసంధానం పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ చెప్పడంతో ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

అనుసంధానానికి అంగీకరించమన్న ఛత్తీస్‌గఢ్

కోటా నీటిని వాడుకోవడానికి ప్రాజెక్టులు చేపడతున్నామని.. ఎట్టిపరిస్థితుల్లోనూ గోదావరి-కావేరి అనుసంధానానికి అంగీకరించబోమని ఛత్తీస్‌గఢ్ అధికారులు తేల్చిచెప్పారు. ఈ క్రమంలో మీరు ప్రాజెక్టులు కట్టేలోగా మహానది నుంచి గోదావరికి జలాలను తరలిస్తామని.. వాటిని కావేరికి తీసుకెళ్తామని ఛత్తీస్‌గఢ్ అధికారులకు ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ సర్దిచెప్పబోగా ఏపీ, తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మహానది నుంచి గోదావరికి జలాలను తెచ్చినా సరే.. రెండు రాష్ట్రాల అవసరాలు తీర్చాకే కావేరికి గోదావరిని తరలించాలని తేల్చిచెప్పారు. రెండు రాష్ట్రాల ప్రాజెక్టుల ఆయకట్టు ప్రయోజనాలకు విఘాతం కల్పించేలా చేపట్టే గోదావరి-కావేరి అనుసంధానానికి అంగీకరించే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులన్నింటికీ అనుమతులు జారీ చేసిన తర్వాతే నదుల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని తెలంగాణ స్పష్టం చేసింది.

ఛత్తీస్‌గఢ్ సమ్మతి తర్వాతే...

అన్ని రాష్ట్రాలు లేవనెత్తిన అంశాలను పరిష్కరించడంతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి రాతపూర్వక సమ్మతి తీసుకున్న తర్వాతే అనుసంధానం ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్తామని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్ సింగ్ హామీ ఇచ్చారు. మరో మూడు నెలల్లో ఈ మేరకు చర్యలు తీసుకుంటామని, అనంతరం డిసెంబర్ నెలాఖరు నాటికి ప్రాజెక్టు డీపీఆర్‌ను ఖరారు చేసి సంబంధిత రాష్ట్రాలతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించనున్నట్టు వెల్లడించారు.

క్లుప్తంగా...

చంద్రయాన్-3 సన్నాహాలు

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చంద్రయాన్-3 ప్రయోగ సన్నాహాలను ముగించింది. లాంచ్ రిహార్సల్ 24 గంటలపాటు జరిగినట్లు బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం మంగళవారం ట్విట్టర్‌లో వెల్లడించింది. ముందస్తు సన్నద్ధతలో భాగంగా ఈ రిహార్సల్ జరిగినట్లు తెలియజేసింది. చంద్రయాన్-2కు కొనసాగింపుగానే చంద్రయాన్-3 మిషన్‌ను ఇస్రో చేపట్టింది. ఎల్‌వీఎం రాకెట్ ద్వారా ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్, రోవర్‌ను చంద్రుడిపైకి పంపించనున్నారు.

ఎవరెస్ట్ సమీపంలో కూలిన హెలికాప్టర్

ఐదుగురు మెక్సికన్లు సహా ఆరుగురి దుర్మరణం



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

కఠ్మాండు: నేపాల్‌లోని ప్రఖ్యాత ఎవరెస్ట్ శిఖరం సమీపంలో హెలికాప్టర్ కూలిన ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ఐదుగురు మెక్సికోకు చెందిన పర్యాటకులు, ఒక పైలట్ ఉన్నారు. మనంగ్ ఎయిర్ సంస్థకు చెందిన ఒక ప్రైవేట్ హెలికాప్టర్ మంగళవారం ఉదయం సొలుఖుంబు జిల్లాలోని సుర్కీ ఎయిర్‌పోర్ట్ నుంచి ఖాడ్మాండూకు బయల్దేరింది. బయల్దేరిన తొమ్మిది నిమిషాలకే దానికి భూమిపై అధీకృత సంస్థతో సిగ్నల్ సంబంధాలు తెగిపోయాయి. చివరిసారిగా లాంజూరా పాస్ ఏరియాలో సిగ్నల్ ట్రాక్ అయింది. అప్పుడు హెలికాప్టర్ 12,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోందని త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మేనేజర్ జ్ఞానేంద్ర చెప్పారు. అలా అది కొద్దిసేపటికే లిఖుపికె గ్రామ మున్సిపాలిటీలోని లాంజూరా ప్రాంతంలో కుప్పకూలింది. భారీ శబ్దంతో పేలిపోయి హెలికాప్టర్ ధ్వంసమైన విషయాన్ని స్థానికులు చెప్పడంతో గాలింపు బృందం ఘటనాస్థలికి చేరుకుని అక్కడే పడి ఉన్న ఆరుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకుంది. మరణించిన పర్యాటకులు అంతా ఒకే కుటుంబానికి చెందిన వారని వెల్లడైంది. మరణించిన పైలట్ గురుంగ్‌కు హిమాలయాల్లో 7,000 గంటలకుపైగా హెలికాప్టర్ నడిపే అపార అనుభవం ఉంది. ప్రతికూల వాతావరణం కారణంగానే హెలికాప్టర్ కూలి ఉంటుందని భావిస్తున్నారు.

బాహుబలి రాకెట్

ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం-3 వాహక నౌక

రాకెట్ ద్వారా ఇప్పటివరకు మూడు ప్రయోగాలు విజయవంతం


గగన్‌యాన్ మిషన్‌లో సైతం సేవలందించనున్న ఎల్‌వీఎం-3

ఇస్రో అమ్ములపొదిలో కీలక అస్త్రం

చం ద్ర యా న్ 3

దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చంద్రయాన్-3 ప్రయోగానికి సమయం దగ్గరపడుతోంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 2.35 గంటలకు జియో సింక్రనస్ లాంచ్ వెహికల్ ఎంకే-3(ఎల్‌వీఎం-3) రాకెట్ శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇందుకోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సైంటిస్టులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రయోగం ఎట్టిపరిస్థితుల్లోనూ గురి తప్పకూడదన్న లక్ష్యంతో శ్రమిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పుడు అందరి దృష్టి ఎల్‌వీఎం-3 రాకెట్‌పైనే కేంద్రీకృతమై ఉంది. చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను చందమామ వద్దకు మోసుకెళ్లే ఈ రాకెట్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అవేమిటో తెలుసుకుందాం..

–సాక్షి, నేషనల్ డెస్క్





మూడు కీలక దశలు

ఇస్రో అభివృద్ధి చేసిన లాంచ్ వెహికల్స్‌లో అత్యంత శక్తివంతమైనది ఎల్‌వీఎం-3. నిజానికి ఇదొక బాహుబలి రాకెట్. భారీ పరిమాణంలో పేలోడ్‌ను అంతరిక్షంలోకి సులభంగా మోసుకెళ్లగలదు. ఇందులో రెండు ఘన ఇంధన బూస్టర్లు, ఒక ద్రవ ఇంధన కోర్ స్టేజ్‌తో కూడిన మూడు దశలు ఉన్నాయి. రాకెట్ నింగిలోకి దూసుకెళ్లడానికి ప్రాథమిక దశలో ఘన ఇంధన బూస్టర్లు దోహదపడతాయి. రాకెట్ చంద్రుడి కక్ష్యలోకి చేరడానికి ఇక ద్రవ ఇంధన కోర్ స్టేజ్ సాయపడుతుంది.

ఎలా పనిచేస్తుంది?

దశల వారీగా ఇంధనాన్ని మండించడం ద్వారా రాకెట్‌ను నింగిలోకి పంపిస్తారు. ఘన, ద్రవ ఇంధన ఇంజిన్లు, స్ట్రాప్-ఆన్ బూస్టర్లు నిర్దేశిత సమయాల్లో పనిచేస్తాయి. ఎల్‌వీఎం-3లో విద్యుత్ సరఫరా కోసం రెండు వికాస్ ఇంజిన్లు ఉన్నాయి. ప్రాథమిక దశలో రెండు సాలిడ్ ప్రొపలెంట్ బూస్టర్లు అదనపు శక్తిని అందజేస్తాయి. పేలోడ్ నిర్దేశిత కక్ష్యలోకి చేరుకోవడానికి అవసరమైన శక్తిని దేశీయంగా అభివృద్ధి చేసిన క్రయోజెనిక్ ఇంజిన్ సీఈ-20 సమకూరుస్తుంది. మొదట రెండు బూస్టర్లను ఒకేసారి మండిస్తారు. దాంతో రాకెట్ టేకాఫ్ అవుతుంది. తర్వాత లిక్విడ్ కోర్ స్టేజ్‌ను 113 సెకండ్లపాటు, రెండు ఎస్200 బూస్టర్లను 134 సెకండ్లపాటు మండిస్తారు. టేకాఫ్ తర్వాత 217 సెకండ్లకు భూమికి 115 కిలోమీటర్ల ఎత్తున శాటిలైట్‌తో కూడిన పేలోడ్ రాకెట్ నుంచి విడిపోతుంది.

- ఎల్‌వీఎం-3 రాకెట్ బరువు 640 టన్నులు, పొడవు 43.5 మీటర్లు. 4,000 కిలోల పేలోడ్‌ను జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లోకి మోసుకెళ్లగలదు.
- రాకెట్‌కు అవసరమైన శక్తిని సమకూర్చడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఇందులో రెండు సాలిడ్ స్ట్రాప్-ఆన్ మోటార్లు(ఎస్200), ఒక లిక్విడ్ కోర్ స్టేజ్(ఎల్110), 28 టన్నుల బరువైన ప్రొపలెంట్ లోడింగ్‌తో కూడిన ఒక హై-థ్రస్ట్ క్రయోజనిక్ అప్పర్ స్టేజ్(సీ25) ఉన్నాయి.
- ఈ రాకెట్‌ను మొదట 'జీఎస్ఎల్‌వీ-ఎంకే3'గా వ్యవహరించేవారు. ఇస్రో దీనికి ఎల్‌వీఎం-3గా నామకరణం చేసింది. దీనిద్వారా ఇప్పటివరకూ 3 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. చంద్రయాన్-3 నాలుగో ప్రయోగం కానుంది.
- ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడానికి ఎల్‌వీఎం-3 వాహక నౌకను గతంలో ఉపయోగించారు. జీశాట్-19 కమ్యూనికేషన్ శాటిలైట్, ఆస్ట్రోశాట్ అస్ట్రానమీ శాటిలైట్, చంద్రయాన్-2 లూనార్ మిషన్‌ను ఇదే రాకెట్ ద్వారా ప్రయోగించారు. భారతదేశంలో తొలి మానవ సహిత స్పేస్ క్రాఫ్ట్ ప్రయోగమైన గగన్‌యాన్ మిషన్‌లో ఎల్‌వీఎం-3 వాహక నౌక తన సేవలను అందించనుంది.
- భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ల ప్రయోగాల్లో ఎల్‌వీఎం-3 ద్వారా మనం స్వయం సమృద్ధి సాధించినట్లేనని ఇస్రో హర్షం వ్యక్తం చేసింది.



ఢిల్లీలో లోతట్టు ప్రాంతం నుంచి రిక్షాలో తరలిపోతున్న ఓ కుటుంబం

మహోగ్ర యమున

- ఢిల్లీలో వరద నీటితో ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నది
- సురక్షిత ప్రాంతాలకు వేలాది మంది ముంపు ప్రాంతాల ప్రజల తరలింపు

న్యూఢిల్లీ: ఎగువ హరియాణా ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న వరదనీటితో ఢిల్లీలో యమునా నది మహోగ్రంగా మారింది. దీంతో నది ప్రవాహంలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. దీంతో ముంపు ప్రాంతాల్లోని వేలాది మంది ప్రజలను ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. సోమవారం రాత్రి నుంచే ఈ తరలింపు ప్రక్రియ మొదలుపెట్టారు. సంబంధిత వివరాలను ఢిల్లీ రాష్ట్ర జలశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పత్రికా సమావేశంలో వెల్లడించారు. 'ముంపు ప్రాంతాల స్థానికుల కోసం వేలాది టెంట్‌లను ఈస్ట్, నార్త్, నార్త్‌ఈస్ట్, సౌత్‌ఈస్ట్, సెంట్రల్, షాదారా జిల్లాల్లో ఏర్పాటుచేశాం. హరియాణాలోని హాత్నీ కుండ్ బ్యారేజ్ నుంచి వరదనీటిని దిగువకు వదలడం వల్లే ఢిల్లీలో ఈ అప్రమత్త పరిస్థితి దాపురించింది. అయితే ఢిల్లీకి వరదలు మాత్రం రాబోవు. నదీ పరివాహక ప్రాంతాల్లోని జనావాసాల్లోకి వరదనీరు చేరదు. శిబిరాల్లో ఇప్పటికే ఆహారం, తాగునీరు, ఇతర వసతులు సిద్ధంచేశాం' అని ఆయన చెప్పారు.

పేదరికంపై భారత్ విజయం!

- 15 ఏళ్లలో 41.4 కోట్ల మందికి విముక్తి
- ఐక్యరాజ్యసమితి నివేదిక



ఐక్యరాజ్యసమితి: ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో ఒకటైన భారత్ పేదరికంపై విజయం సాధించడంలో ముందంజలో ఉందని ఐక్యరాజ్యసమితి ప్రశంసించింది. భారత్‌లో 2005/2006 నుంచి 2019/2021 దాకా.. 15 సంవత్సరాల్లో ఏకంగా 41.4 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించింది. ఈ మేరకు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యూఎన్‌డీపీ) యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌తో కలిసి గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్(ఎంపీఐ) నివేదికను తాజాగా విడుదల చేసింది. గత 15 ఏళ్లలో పేదరికాన్ని అంతం చేయడంలో భారత్ సహా 25 దేశాలు మెరుగైన ఫలితాలు సాధించాయని పేర్కొంది. ఈ జాబితాలో కాంబోడియా, చైనా, కాంగో, హోండూరస్, ఇండోనేసియా, మొరాకో, సెర్బియా, వియత్నాం తదితర దేశాలు ఉన్నాయని తెలియజేసింది. ఇండియాలో 2005/2006లో 55.1 శాతం మంది పేదలు ఉండగా, 2019/2021 నాటికి వారి సంఖ్య 16.4 శాతానికి తగ్గిపోయిందని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. దేశంలో 15 సంవత్సరాల క్రితం 64.5 కోట్ల మంది పేదలు ఉండగా, 2019/2021లో 23 కోట్ల మంది ఉన్నట్లు తేలిందని వివరించింది. ఇదే సమయంలో సరైన పౌష్టికాహారం అందుబాటులోని ప్రజల సంఖ్య 44.3 శాతం నుంచి 11.8 శాతానికి తగ్గిపోయిందని వెల్లడించింది. శిశు మరణాలు 4.5 శాతం నుంచి 1.5 శాతానికి తగ్గిపోయాయని పేర్కొంది. పారిశుధ్య సదుపాయాలు అందుబాటులో లేని వారి సంఖ్య 50.4 శాతం నుంచి 11.3 శాతానికి తగ్గిందని తెలియజేసింది. ఎక్కువ మందికి తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించడంలో భారత్ గణనీయమైన ప్రగతి సాధించిందని కొనియాడింది.

అదానీ-హిండెన్‌బర్గ్ దర్యాప్తు ఎక్కడిదాకా వచ్చింది?

- గడువులోగా నివేదించండి
- సెబీకి సూచించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కంపెనీ షేరు ధర వేగంగా పెరిగేలా వ్యాపార దిగ్గజం గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ సంస్థ పలు అక్రమాలకు పాల్పడిందన్న హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో ఈ కేసును త్వరగా తేల్చాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే పొడిగించిన ఆగస్ట్ 14 గడువులోపు దర్యాప్తు పూర్తి చేసి తమకు నివేదించాలని దర్యాప్తు బాధ్యత తీసుకున్న సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ)ని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. 'దర్యాప్తు కొనసాగుతోంది. ఇచ్చిన గడువులోగా దర్యాప్తు పూర్తిచేసేందుకు సెబీ కృషిచేస్తోంది. కోర్టు నియమించిన నిపుణుల కమిటీ సూచనల మేరకు నిర్మాణాత్మక స్పందనను సోమవారమే కోర్టుకు సెబీ తెలియజేసింది' అని సెబీ తరఫున సుప్రీంకోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. 'సెబీ స్పందన సరే.. కేసు ఎక్కడిదాకా వచ్చింది? దర్యాప్తులో ఏ మేరకు పురోగతి ఉంది?' అని తుషార్‌ను బెంచ్ ప్రశ్నించింది. ఈ అంశంలో పిటిషనర్ల తరఫున వాదిస్తున్న న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదన వినిపించారు. 'సెబీవంటి దర్యాప్తు సంస్థలు సహకరించడం లేదని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించింది. ఈ దర్యాప్తులో సెబీ ముందుకు వెళ్లే అవకాశమే లేదు. ఎందుకంటే ఈ ఉదంతంలో లబ్ధి పొందిన వారు ఎవరనేది తెలకుండా సంబంధిత నిబంధనలు మార్చబడ్డాయి. షేరు ధర పెరగడంతో లబ్ధిపొందిన వారు ఎవరనేది తెలకుండా, లావాదేవీలు బహిర్గతంకాకుండా చేస్తున్నారు' అని వాదించారు.

ఆగస్టు 2 నుంచి పూర్తిస్థాయి విచారణ

'ఆర్టికల్ 370 రద్దు' పిటిషన్లపై సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ: రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఆగస్టు 2వ తేదీ నుంచి రోజువారీగా పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఈ రద్దును వ్యతిరేకిస్తూ వివిధ సంఘాలతోపాటు వ్యక్తులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్టికల్ 370 రద్దును కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలించింది. ఈ కేసులో ఏవైనా ఫైళ్లు గానీ, లిఖితపూర్వక వినతులు గానీ ఈ నెల 27లోగా సమర్పించవచ్చని సూచించింది. ఇందుకోసం ఇద్దరు లాయర్లను నియమించనున్నట్లు వెల్లడించింది. ఆగస్టు 2 నుంచి సోమవారం, శుక్రవారం మినహా రోజువారీగా పూర్తిస్థాయిలో విచారణ ప్రారంభిస్తామని పేర్కొంది. ఈ నెల 27 తర్వాత ఎలాంటి డాక్యుమెంట్లు స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దయ్యాక కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొందంటూ కేంద్ర ప్రభుత్వం సోమవారం సమర్పించిన అఫిడవిట్ ఈ కేసు విచారణపై ఎలాంటి ప్రభావం చూపబోదని ధర్మాసనం తేల్చిచెప్పింది. మరోవైపు ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించిన పిటిషన్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించాలని ఐఏఎస్ అధికారి షా ఫైజల్, షెహలా రషీద్ విజ్ఞప్తి చేయగా, సుప్రీంకోర్టు ధర్మాసనం అందుకు అంగీకరించింది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే.

రాంగ్‌సైడ్‌లో వచ్చి ఢీకొట్టిన స్కూల్ బస్

కారులోని ఆరుగురి దుర్మరణం

ఘజియాబాద్(యూపీ): రాంగ్‌రూట్‌లో దూసుకొచ్చిన ఒక స్కూల్ బస్సు.. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ సరిహద్దు వద్ద ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘజియాబాద్ అదనపు డీసీపీ రమానంద్ ప్రమాద వివరాలను ట్వీట్‌చేశారు. 'మీరట్ నుంచి ఎనిమిది మందితో బయల్దేరిన కారు గురుగ్రామ్ వైపుగా మంగళవారం ఉదయం ఆరింటపుడు ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై వెళుతోంది. అదే సమయానికి రాంగ్‌సైడ్ సీఎన్‌జీ ఇంధనాన్ని నింపుకున్న పాఠశాల బస్సు ఒకటి అదే రూట్‌లో రాంగ్‌సైడ్ అలాగే వస్తోంది. దీంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. వేగంగా ఢీకొనడంతో కారులోని ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. నుజ్జునుజ్జయిన కారులో ఇరుక్కున్న ఇద్దరినీ కష్టపడి బయటకు తీసి ఆస్పత్రిలో చేర్పించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. నోయిడాలోని ఒక స్కూల్‌కు చెందిన ఈ బస్సులో ప్రమాదం జరిగినపుడు విద్యార్థులు ఎవరూ లేరు. ఢిల్లీ నుంచి ఈ బస్సు తిరిగొస్తోంది. బస్సు డ్రైవర్‌ను అరెస్ట్‌చేశాం' అని ఆయన వెల్లడించారు.

పుట్టినరోజున అందుకున్న ప్రత్యేక కానుక ఏంటంటే..

థానే: పుట్టినరోజు అంటే సంబరం. అందులోనూ జన్మదిన వేడుకలో అందుకునే చిన్న చిన్న కానుకలు అంటే అపురూపంగా చూసుకుని మురిసిపోతారు. అలాంటిది ఒక మహిళ అనూహ్యంగా టమాటాలను గిఫ్ట్‌గా అందుకుని ఆశ్చర్యంలో మునిగింది. మహారాష్ట్రలోని థానే పట్టణంలో ఈ కొత్త రకం బహుమతి ఘటన జరిగింది. సంబంధిత వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. థానె జిల్లాలోని కళ్యాణ్ ప్రాంతంలోని కొచాడీలో ఉండే సోనల్ బోర్సే పుట్టినరోజు వేడుక ఆదివారం జరిగింది. ఆ ప్రాంతంలో కేజీ టమాటా ఏకంగా రూ.140 ధర పలుకుతోంది. అదే రోజు ఆమె నాలుగు కేజీలకుపైగా టమాటాలు ఉన్న బుట్టలను బహుమతిగా అందుకున్నారు. ఈసారి అకాల వర్షాలు, బిపర్‌జోయ్ తుపాను మిగిల్చిన విషాదం కారణంగా పంట నాశనమై దిగుబడి భారీగా తగ్గిపోయి టమాటా ధర రిటైల్ మార్కెట్లో చుక్కలనంటుతోంది. కొద్దిరోజులు గడిస్తే కొత్త పంట వచ్చి ధరలు తగ్గుముఖం పడతాయని మార్కెట్ వర్గాలు భరోసా ఇస్తున్నాయి.

కంపెనీ సీఈఓ, ఎండీ దారుణ హత్య

బనశంకరి: సిలికాన్ సిటీ బెంగళూరులో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఉద్యోగం తీసేశారని ఒక మాజీ ఉద్యోగి ఉన్మాదిగా మారి కంపెనీ సీఈఓ, ఎండీలను కత్తితో పొడిచి చంపాడు. అమృతహళ్లి పంపా లేఔట్‌లో ఈ ఘోరకృత్యం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. ఏరోనిక్స్ మీడియా ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఫణీంద్ర సుబ్రమణ్య, సీఈఓ వినుకుమార్‌లపై మంగళవారం సాయంత్రం ఆఫీసులోకి చొరబడిన జోకర్ ఫెలిక్స్ అనే మాజీ ఉద్యోగి కత్తితో దాడి చేశారు. విచ్చలవిడిగా పొడవడంతో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. కొద్దిరోజుల క్రితం ఈ కంపెనీలో పనిచేసే నిందితుడు ఫెలిక్స్ ఇక్కడ ఉద్యోగం మానేసి సొంతంగా కంపెనీ ప్రారంభించాడు. తన వ్యాపారానికి ఫణీంద్ర, వినుకుమార్‌లు అడ్డు తగులుతున్నారని అనుమానించి ఆఫీస్‌కొచ్చి హత్యచేశాడు.

స్వీడన్‌కు సై.. ఉక్రెయిన్‌కు నై

నాటోలో సభ్యత్వంపై కూటమి శిఖరాగ్ర సదస్సులో నిర్ణయం

విల్నియస్: స్వీడన్‌ను తమ కూటమిలో 32వ సభ్యదేశంగా చేర్చుకునేందుకు నాటో అంగీకరించింది. లిథువేనియా దేశంలోని విల్నియస్ నగరంలో జరుగుతున్న నాటో శిఖరాగ్ర సదస్సు ఇందుకు వేదికగా నిలిచింది. అయితే ఉక్రెయిన్‌కు సభ్యత్వంపై 31 సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఇప్పట్లో ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం దక్కకపోవచ్చు. యుద్ధంలో నిమగ్నమైన దేశానికి సభ్యత్వం ఇవ్వకూడదన్న నిబంధన కారణంగా ఇప్పుడే కూటమిలో చేర్చుకోలేమని, యుద్ధం ముగిశాక వెంటనే సభ్యత్వం ఇచ్చేలా పాత రెండంచెల పద్ధతిని సరళతరం చేశామని నాటో ప్రధాన కార్యదర్శి జీన్స్ స్టోల్టెన్‌బెర్గ్ మీడియాతో చెప్పారు. కాగా, తమ పట్ల నాటో వైఖరిని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా తప్పుబట్టారు.

బెంగాల్ స్థానిక ఎన్నికల్లో టీఎంసీ ఆధిక్యం

30,391 పంచాయతీ సీట్లు గెలుచుకున్న అధికార టీఎంసీ



స్థానిక ఎన్నికల్లో టీఎంసీ గెలుపు వార్త తెలిసి పార్టీ మహిళా కార్యకర్తల సంబరాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ స్థానిక ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) ఘన విజయం దిశగా దూసుకెళ్తోంది. మంగళవారం రాత్రి 11:30కి ప్రకటించిన ఫలితాల్లో 30,391 సీట్లను కైవసం చేసుకుంది. ఓట్ల లెక్కింపులో మరో 1,767 పంచాయతీ స్థానాల్లో ముందంజలో కొనసాగు తోంది. టీఎంసీ ప్రధాన ప్రత్యర్థి అయిన బీజేపీ 8,239 పంచాయతీ సీట్లను తన ఖాతాలో వేసుకుంది. మరో 447 సీట్లలో ముందంజలో ఉంది. లెఫ్ట్ ఫ్రంట్ 2,534 స్థానాల్లో విజయ బావుటా ఎగురవేసింది. కాంగ్రెస్ పార్టీ 2,158 సీట్లను సొంతం చేసుకుంది. సీపీఎంకు 2,409 సీట్లు లభించాయి. ఇతర పార్టీలు 725 సీట్లు దక్కించుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు 1,656 స్థానాలు సాధించడం విశేషం. రాష్ట్రంలో మొత్తం 63,229 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇక 9,728 పంచాయతీ సమితి స్థానాలకు ఎన్నికలు జరగ్గా, టీఎంసీ 2,155 స్థానాలను గెలుచుకుంది. 493 సీట్లలో లీడింగ్‌లో ఉంది. బీజేపీ 214 స్థానాలను గెలిచింది. 113 చోట్ల లీడింగ్‌లో ఉంది. 928 జిల్లా పరిషత్ సీట్లకు టీఎంసీ ఇప్పటివరకు 77 స్థానాల్లో విజయం సొంతం చేసుకుంది. ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది. బెంగాల్‌లో శనివారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో భారీగా హింస చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ హింసాకాండలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 11 మంది అధికార టీఎంసీకి చెందినవారే ఉన్నారు.

మరో చీతా మృత్యువాత

భోపాల్: ఆఫ్రికా ఖండం నుంచి భారత్‌లో అడుగుపెట్టిన చీతాలు ఒక్కొక్కటిగా మృత్యుదేవత దిశగా అడుగులేస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయవనంలో ఉన్న మగ చీతా తేజస్ మంగళవారం కన్నుమూసిందని అధికారులు వెల్లడించారు. దీంతో గత నాలుగు నెలల్లో మరణించిన చీతాల సంఖ్య ఏడుకు పెరిగింది. నాలుగేళ్ల వయసు ఉన్న తేజస్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చారు. మరణించిన ఏడు చీతాల్లో నమీబియా చీతా జ్వాలకు జన్మించిన మూడు చీతా కూనలూ ఉన్నాయి. దీంతో గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన చీతాల పునర్‌ఆగమన కార్యక్రమం నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 'వాటిల్లో అవి ఆధిపత్యం కోసం చేసుకున్న ఘర్షణల్లో గాయపడటం వల్లే తేజస్ మరణించి ఉంటుంది. మరణించేనాటికి ఇది ఇంకా ఎన్‌క్లోజర్‌లోనే ఉంది' అని వైల్డ్‌లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జేఎస్ చౌహాన్ అంచనావేశారు. రెండు మగ చీతాలను అడవిలోకి వదిలేసిన మరుసటి రోజే ఇలా ఒకటి మరణించడంపై వన్యప్రాణి ప్రేమికులు ఆవేదన వ్యక్తంచేశారు.

న్యాయ సంస్కరణల బిల్లుకు

ఇజ్రాయెల్ పార్లమెంట్ ఆమోదం

జెరూసలేం: సుప్రీంకోర్టు అధికారాలను నియంత్రిస్తూ ఇజ్రాయెల్ ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయ సంస్కరణల బిల్లుకు పార్లమెంట్ ప్రాథమికంగా ఆమోదం తెలియజేసింది. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో 124 మంది సభ్యులుండగా, బిల్లుకు మద్దతుగా 64 మంది ఓటేశారు. బిల్లుపై ఇక నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో చర్చ జరగనుంది. వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతారు. మార్పులు చేర్పుల అనంతరం పార్లమెంట్‌లో తుది ఓటింగ్ జరుగుతుంది. న్యాయ సంస్కరణల బిల్లును ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ అభివర్ణించారు. న్యాయ వ్యవస్థను సంస్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని గుర్తుచేశారు. బిల్లు చట్టం రూపం దాలిస్తే.. ప్రభుత్వం, మంత్రులు, ప్రజాప్రతినిధులు తీసుకొనే నిర్ణయాలను రద్దు చేసే అధికారం ఇక సుప్రీంకోర్టుకు ఉండదు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలను వ్యతిరేకించే హక్కు జడ్జీలకు లేదని నెతన్యాహూ అనుచరులు వాదిస్తున్నారు. మరోవైపు న్యాయ సంస్కరణల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడం పట్ల దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జెరూసలేం, హైఫా, టెల్ అవివ్ తదితర నగరాల్లో వేలాది మంది రోడ్లను దిగ్బంధించారు. దేశంలో బలంగా ఉన్న న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థ సంస్కరణల బిల్లును అమెరికాతోసహా పలు దేశాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

విరాళాల సేకరణలో బీజేపీ టాప్

- ఆరేళ్లలో రూ.10 వేల కోట్ల విరాళాలు సేకరించిన బీజేపీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ విరాళాల సేకరణలో అన్ని రాజకీయ పార్టీల కంటే చాలా ముందంజలో ఉంది. భారత రాజకీయాల్లో సంస్కరణల కోసం పోరాడుతున్న అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే సంస్థ చేసిన అధ్యయనంలో ఇలాంటి పలు అంశాలు వెల్లడయ్యాయి. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. 2016-17 నుంచి 2021-22 మధ్య కాలంలో ఎలక్టోరల్ బాండ్లు, ప్రత్యక్ష కార్పొరేట్ విరాళాలు సహా ఇతర విరాళాల ద్వారా మొత్తంగా ఆరేళ్లలో రూ.10,122 కోట్లు బీజేపీకి వచ్చాయి. బీజేపీ ప్రకటించిన మొత్తం విరాళాలు ఇతర జాతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం విరాళాల కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. బీజేపీ తర్వాత స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విరాళాల రూపంలో రూ.1547.439 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రూ.823.301 కోట్లు, సీపీఐ(ఎం) రూ.367.167 కోట్లు, ఎన్సీపీ రూ.231.614 కోట్లు సేకరించాయి.

ప్రాంతీయ పార్టీల్లో బీజేడీ

ప్రాంతీయ పార్టీల జాబితాలో బిజు జనతాదళ్ (బీజేడీ) అత్యధికంగా రూ.692.60 కోట్లు విరాళాలు సేకరించింది. ఇక తెలంగాణరాష్ట్రంలోని అధికార బీఆర్ఎస్ రూ.476.89 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత డీఎంకే పార్టీ రూ.475.73 కోట్లు, వైఎస్ఆర్‌సీపీ రూ.456.20 కోట్లు, శివసేన రూ.267.90 కోట్లు, ఆప్ రూ.169.70 కోట్లు, టీడీపీ రూ.168.67 కోట్ల విరాళాలు సేకరించాయి.

సహకార సంఘాల బలోపేతంపై

14న సమావేశం

వ్యవసాయ, రైతు సంక్షేమంపై మార్గనిర్దేశం చేయనున్న అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీఓ)ల ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) బలోపేతం చేసే మార్గాలపై మోదీ సర్కార్ దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా 14వ తేదీన ఢిల్లీలో సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశాన్ని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో నిర్దేశించిన 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతను ప్రతిబింబించేలా షా ప్రసంగించనున్నారు. ఎఫ్‌పీఓల మద్దతుతో పీఏసీఎస్‌లను ఎలా బలపరచాలి, సహకార రంగాన్ని పటిష్టపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలను ఈ సందర్భంగా అమిత్ షా వివరిస్తారు.



..పక్కింట్లో గుట్టుగా చోరీ

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డ ఓ పని మనిషి పక్కింటి గుట్టు తెలుసుకుని చోరీకి పాల్పడింది. విచారణలో అడ్డంగా దొరికిపోయింది.

-8లో



నిల్వచేసిన సిలిండర్లతోనే ప్రమాదాలు

నిల్వ చేసిన సిలిండర్లతోనే నగరంలో ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కేవలం అవగాహన లోపం.. నిర్లక్ష్యం ఈ ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది.

-8లో

13న చలో బస్ భవన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బధిరులు, దివ్యాంగులకు, 70 శాతానికిపైగా సర్టిఫికెట్ ఉన్నవారికి 50 శాతం రాయితీ బస్‌పాస్ ఇవ్వాలని, సిటీలో ఉచిత ప్రయాణం కల్పించాలని తదితర పది డిమాండ్లతో ఈ నెల 13న బస్ భవన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సొసైటీ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం



బంగారు బోనంతో జోగిని నిషా క్రాంతి

చార్మినార్: పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంగళవారం భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించారు. అంతకుముందు గౌలిపురా నుంచి కోట్ల అలీజాలోని కోట మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం జోగిని నిషా క్రాంతి బంగారు బోనంతో బయలుదేరారు. పోతరాజుల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలతో అమ్మవారికి బంగారు బోనం బోనాన్ని సమర్పించారు. చార్మినార్ వద్ద ఆలయ ట్రస్టీ బంగారు బోనానికి పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కమిటీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్, ఉపాధ్యక్షుడు బుల్లెట్ శ్రీధర్, మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య మాట్లాడుతూ.. ఈ నెల 13న లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, ప్యారసాని వెంకటేష్, కోట మైసమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాయికోటి బాబురాజా పాల్గొన్నారు.

15న ప్రజా కలాల- గళాల గర్జన

నాంపల్లి: బీరెల్లి కుట్ర కేసు ఎత్తేసి, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 15న శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా కలాల-గళాల గర్జన పేరిట ఆటా-పాటా-మాటా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క పేర్కొన్నారు. మంగళవారం నాంపల్లిలోని గన్‌పార్కు వద్ద కార్యక్రమ కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించి ప్రసంగించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆట- పాట ద్వారా పోరాటం చేసిన కళాకారులపై బనాయించిన ఉపా కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. తనతో పాటు మోహన్ బైరాగి, రాజు, సురేష్, పైలం సంతోష్, వెంకన్న, యాది, బుల్లెట్ వెంకన్న, చందు, అరుణ, అనుబాయి, సురేందర్, మల్లేపల్లి వెంకట్ వంటి వారు డజన్ల కొలది జైళ్లలో మగ్గారని గుర్తు చేశారు. ప్రస్తుతం కళాకారులపై బనాయించిన ఉపా కేసులను ఎత్తివేయించడానికి పోరాడాల్సిన అవసరం వచ్చిందన్నారు. ప్రజా కలాల-గళాల గర్జన, ఆటా-పాటా-మాటా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పులిచర్మం రవాణా పేరుతో రూ.20 లక్షలు స్వాహా

- 70 ఏళ్ల వ్యక్తిని మోసగించిన సైబర్ నేరగాళ్లు

హిమాయత్‌నగర్: నగరానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడికి ఫోన్ చేసి.. మీ పేరుపై పులిచర్మం విదేశాలకు రవాణా అవుతోందంటూ బెదిరించి రూ.20 లక్షలు కాజేశారు. బాధితుడు మంగళవారం సిటీ సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొద్దిరోజుల క్రితం సదరు వృద్ధుడికి ముంబైకి చెందిన ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ కాల్ వచ్చింది. మీ పేరుపై పులిచర్మం థాయ్‌లాండ్‌కు రవాణా అవుతోందని చెప్పారు. దీంతో పులిచర్మం తానెందుకు రవాణా చేస్తానంటూ వృద్ధుడు బదులివ్వడంతో.. మీ ఆధార్/పాన్ కార్డు వివరాలతో పాటు వాటి జిరాక్స్ ఉన్నాయన్నారు. తాము పులిచర్మాన్ని, మీ వివరాలు సీబీఐకి అప్పగిస్తున్నాం. వారే మీకు కాల్ చేస్తారన్నారు. గంట తర్వాత సీబీఐ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నానంటూ మరో వ్యక్తి వృద్ధుడికి కాల్ చేశాడు. జంతువులకు సంబంధించిన చర్మాలను విదేశాలకు ఎన్నేళ్లుగా రవాణా చేస్తున్నారంటూ బెదిరించాడు. దీంతో బాధితుడు తనపై కేసులు పెట్టొద్దు. ఏదైనా పొరపాటు జరిగితే సరిదిద్దుకుంటానన్నాడు. అలాగైతే తాము చెప్పిన అకౌంట్‌కు డబ్బు పంపించాలని వృద్ధుడి నుంచి రూ.20 లక్షలు కాజేశారు.



నగరంలో ఆషాఢ మాసం బోనాల జాతర సంబరాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్న వేళ.. అసెంబ్లీలో పని చేసే ఉద్యోగులు సైతం ఉత్సవాలను సంబరంగా జరుపుకొన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో అమ్మవారికి తొట్టెలను తీసుకెళ్తూ ఇలా ఆటాపాటలతో ఆహ్లాదంగా కనిపించారు.

అసెంబ్లీలో బోనాల సందడి

పండగ పూట విషాదం

వంటగ్యాస్ సిలిండర్ లీక్

- గదిలో ఎగిసిపడిన మంటలు
- ఏడుగురికి తీవ్ర గాయాలు
- వీరిలో ఆరుగురి పరిస్థితి విషమం

ముషీరాబాద్: వంట గ్యాస్ సిలిండర్ లీకేజీతో మంటలు చెలరేగి ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మంగళవారం దోమలగూడలోని రోజ్ కాలనీలో విషాదాన్ని నింపింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన పద్మ వచ్చే ఆదివారం బోనాల పండగ కోసం పద్మారావు నగర్‌లో నివసించే కూతురు ధనలక్ష్మి, అల్లుడు శ్యామ్, మనవరాలు శరణ్య, మనవళ్లు అభినవ్, విహాన్‌లను ఇంటికి తీసుకువచ్చింది. ఎల్‌బీనగర్‌కు చెందిన సొంత చెల్లెలు నాగమణి, మరిది ఆనంద్‌ను కూడా పండగకు ఆహ్వానించింది. వీరిలో అల్లుడు శ్యామ్ మినహా మిగతా వారంతా ఒకే ఒక చిన్న గదిలో ఉన్నారు. మంగళవారం పిండి వంటలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో స్టవ్‌ను వెలిగించడంతో గ్యాస్ లీకైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి గది అంతటా వ్యాపించాయి. పొగ వ్యాపించింది. గదిలోని ఏడుగురు మంటల్లో చిక్కుకుపోయి హాహాకారాలు చేశారు.

సాహసం చేసిన స్థానికులు..

గదిలోంచి అరుపులు రావడంతో సమీపంలో నివసించే గోవిందరావు అనే వ్యక్తి మరో ఇద్దరు యువకులతో కలిసి లీకవుతున్న గ్యాస్ సిలిండర్‌ను చాకచక్యంతో బయటకు తీసుకువచ్చారు. లేనిపక్షంలో ఏడుగురూ మంటల్లో మసైపోయేవారని స్థానికులు చెప్పారు. అప్పటికే గదిలోని దుస్తులు, పరుపులు చాలా వరకు కాలిపోయాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఏడుగురిని స్థానికులు గదిలోంచి బయటకు తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించారు. దోమలగూడ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని బాధితులను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాంగ్రెస్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ యాదవ్, నగేష్ ముదిరాజ్, కార్పొరేటర్ రచనశ్రీ, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు సందర్శించారు.



గదిలో చెల్లాచెదురుగా పడి ఉన్న సామగ్రి

గాయాలతో గాంధీ ఆస్పత్రిలో..

వంట గ్యాస్ లీకేజీ ప్రమాదంలో గాయపడిన ఏడుగురిలో ఆరుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తీవ్రమైన వేడి గాలులను పీల్చడంతో శ్వాసకోశ నాళాలు, గుండె, ఇతర అంతర్గత అవయవాలు దెబ్బ తిన్నాయని చెప్పారు. పద్మ 40 శాతం, ధనలక్ష్మి 60, అభినవ్ 50, శరణ్య 30, విహాన్ 40, ఆనంద్ 36, నాగమణి 60 శాతం కాలిన గాయాలతో పీఐసీయూ, టీఎంటీ, బర్న్స్ వార్డుల్లో వైద్యం అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. గాయపడిన చిన్నారులకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు తరలించామన్నారు. టీఎంటీలో నలుగురు క్షతగాత్రులకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని వివరించారు.

అనుమతుల్లేని సెల్లార్లు ఎన్నో!



చందానగర్ సర్కిల్‌లోని శ్రీదేవి థియేటర్ వద్ద సెల్లార్ అక్రమ తవ్వకాల్ని నిలిపివేసిన అధికారులు

వర్షాకాలంలో పొంచిఉన్న ప్రమాదాలు

- 78 అక్రమ సెల్లార్ల తవ్వకాల గుర్తింపు
- నగరంలో గుర్తించనివి ఇంకా మరెన్నో..

సాక్షి, సిటీబ్యూరో: ప్రమాదాలు జరిగినప్పుడే అనుమతుల్లేని సెల్లార్ల తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు కేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించే జీహెచ్‌ఎంసీ అధికారులు.. తర్వాత ఆ విషయమే మరిచిపోతున్నారు. దీంతో నగరంలో అక్రమసెల్లార్ల తవ్వకాలు ఆగడం లేదు. అడ్డూఅదుపూ లేకుండా అవి సాగుతూనే ఉన్నాయి. అలాంటి వాటి వల్ల స్థానికులకు, ఆ మార్గాల్లో ప్రయాణాలు చేసేవారికి ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. వాస్తవానికి ప్రతి సంవత్సరం వర్షాకాలంలో సెల్లార్లకు అనుమతులివ్వరు. కొత్తగా తవ్వకాలపై నిషేధం విధిస్తారు. అప్పటికే పురోగతిలో ఉన్నవాటికి సైతం పూర్తిస్థాయి రక్షణ చర్యలతో పనులు చేసుకునేందుకు అనుమతిస్తారు. కానీ.. నగరంలో ఇవేవీ అమలు కావడం లేదు. ఇటీవల కేపీహెచ్‌బీలో సెల్లార్ తవ్వకాలతో రోడ్డు కుంగడం ఇందుకు నిదర్శనం.

నిలిపివేసేందుకు అధికారుల చర్యలు

- ఈ నేపథ్యంలో తనిఖీలు చేయగా 218 సెల్లార్ల తవ్వకాలు అధికారుల దృష్టికి వచ్చాయి. వీటిలో పది, అంతకంటే ఎక్కువ సెల్లార్ల తవ్వకాలు జరుగుతున్న సర్కిళ్లలో శేరిలింగంపల్లి (16), చందానగర్ (10), మూసాపేట (11), గోషామహల్(12), ఎల్‌బీనగర్ (17)లున్నాయి. మొత్తం సెల్లార్లలో 130 సెల్లార్లకు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులున్నప్పటికీ, మిగతా 78 సెల్లార్లకు అనుమతులే లేవు. వాటిని అక్రమంగా తవ్వుతున్నారు. వాటిని నిలిపివేసేందుకు చర్యలు తీసుకున్నట్లు, ఇప్పటికే కొన్నింటిని ఆపివేసినట్లు అధికారులు తెలిపారు. అధికారుల తనిఖీల్లో ఈ సెల్లార్ల తవ్వకాలు దృష్టికి రాగా, వారి దృష్టికి రానివి ఇంకా ఎక్కువే ఉంటాయనే అభిప్రాయాలున్నాయి. అలాంటి వాటివల్ల ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది.
- తీరా ప్రమాదాలు జరిగాక చర్యలనడం కంటే అన్ని ప్రాంతాలనూ విస్తృతంగా తనిఖీలు చేసి, అక్రమంగా జరుగుతున్న అన్ని సెల్లార్ల తవ్వకాలను, అనుమతులున్నా నిబంధనలు పాటించకుండా తవ్వుతున్న వాటిని అడ్డుకోవాలని నగర ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నో ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తూతూమంత్రంగా చర్యలు

- జీహెచ్‌ఎంసీ అధికారులు సెల్లార్ల తవ్వకాల్లో పాటించాల్సిన నిబంధనల్ని గత జనవరిలోనే జారీ చేశారు. అప్పట్లో అకాల వర్షాల నేపథ్యంలో నిబంధనలు జారీ చేశారు కానీ అమలు చర్యలు మాత్రం మరిచారు. ఇప్పుడు తనిఖీ చర్యలు చేపట్టారు. చెప్పుకోవడానికన్నట్లుగా తప్ప తనిఖీలు పూర్తిస్థాయిలో జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.
- నిబంధనల మేరకు సెల్లార్ల తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో చుట్టూ బారికేడింగ్‌తో పాటు రిటైనింగ్ వాల్ నిర్మించాలి. సగం తవ్వి పనులు ఆపేసి ఉంటే వాటిని పూడ్చివేయాలి. చుట్టుపక్కల భవనాల భద్రతను పరిశీలించాలి. నిబంధనలకనుగుణంగా నడుచుకోని పక్షంలో పనుల్ని వెంటనే నిలిపివేయడంతో పాటు నిర్మాణ అనుమతిని, బిల్డర్ లైసెన్సును రద్దుచేయాలి.



పడిగాపులే..

జేబీఎస్- ఎంజీబీఎస్ కారిడార్‌లో సర్వీసులు అంతంతే

- నగటున 12- 15 నిమిషాలకో మెట్రో మాత్రమే..
- ప్రయాణికుల ఆదరణా అంతంతమాత్రమే
- మిగతా రెండు కారిడార్‌లలో 4 లక్షలకు పైగా ప్రయాణికులు
- ఈ కారిడార్‌లో 2,5000 దాటని ప్రయాణికుల సంఖ్య
- పాతబస్తీ వరకు పొడిగిస్తేనే ప్రయోజనమంటున్న నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్.. హరిత మెట్రో కారిడార్. ఈ రూట్‌లో రైలెక్కాలంటే కనీసం 12 నుంచి 15 నిమిషాల వరకు పడిగాపులు కాయాల్సిందే. నాగోల్-రాయదుర్గం, ఎల్‌బీనగర్-మియాపూర్ కారిడార్లలో ప్రతి 3 నుంచి 5 నిమిషాలకు ఒకటి చొప్పున వందల కొద్దీ సర్వీసులు పరుగులు తీస్తుండగా... 9 మెట్రో స్టేషన్‌లతో, నగరం ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే జేబీఎస్- ఎంజీబీఎస్ లైన్‌లో మాత్రం ప్రయాణికులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీంతో ఆ రూట్‌లో మెట్రో సేవలను వినియోగించుకొనేందుకు సైతం చాలామంది వెనుకడుగు వేస్తుండటం గమనార్హం.

వేచి చూడలేక..

- విద్యార్థులు, ఉద్యోగులు, ఐటీ నిపుణులు తదితర రంగాలకు చెందిన ప్రయాణికులకు జేబీఎస్- ఎంజీబీఎస్ కారిడార్ అందుబాటులో ఉంది. కానీ సమయపాలన సరిగా లేకపోవడంతో చాలా మంది మెట్రోను వినియోగించుకోలేకపోతున్నారు. దీంతో ఏ స్టేషన్‌లో చూసినా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు పల్చగానే కనిపిస్తున్నారు. 'స్టేషన్‌కు వెళ్లే వరకు మెట్రో అందుబాటులో ఉందంటే సంతోషం. ఒకసారి ట్రైన్ వెళ్లిపోయిందంటే మరోదాని కోసం కనీసం 15 నిమిషాలు ఎదురు చూడాల్సి వస్తోంది. అందుకే మెట్రో స్టేషన్‌కు వెళ్లాలంటేనే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుంటున్నాం' అని కార్ఖానాకు చెందిన ఆనంద్ తెలిపారు. మెట్రోలో వెళ్లాలని ఉన్నప్పటికీ సికింద్రాబాద్ నుంచి కోఠికి వెళ్లేందుకు తాను ఆర్టీసీ బస్సులు లేదా ఆటోలను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు.
- ప్రయాణికుల రద్దీ అత్యధికంగా ఉండే ఒక్క రాయదుర్గం స్టేషన్‌లోనే రోజుకు 32 వేల మంది ప్రయాణం చేస్తుండగా, జేబీఎస్-మెట్రో కారిడార్‌లోని 9 స్టేషన్‌లలో కలిపి రోజుకు కేవలం 25000 మంది మాత్రమే ప్రయాణం చేయడం గమనార్హం. ప్రతి రోజు 5.10 లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. నాగోల్-రాయదుర్గం రూట్‌లో 2.25 లక్షలు, ఎల్‌బీనగర్-మియాపూర్ రూట్‌లో 2.60 లక్షల చొప్పున రాకపోకలు సాగిస్తున్నారు. కానీ ఈ రూట్‌లో మాత్రం ప్రయాణికుల రాకపోకలు చాలా తక్కువగా ఉన్నాయి. 'చిక్కడపల్లి నుంచి ప్రతి రోజు కోఠీ విమెన్స్ కాలేజీకి వెళ్తాను. కాలేజీకి వెళ్లే టైంలో ఒక్కోసారి 20 నిమిషాలు ఎదురు చూడాల్సివస్తోంది. ఇది చాలా ఇబ్బంది కదా' అని ఓ విద్యార్థిని విస్మయం వ్యక్తం చేసింది.

సర్వీసులు పెంచాలి...

ఇప్పటికిప్పుడు సర్వీసులను పెంచితే తప్ప ఈ రూట్‌లో మెట్రోపై ప్రయాణికులకు నమ్మకం కలగదు. ప్రస్తుతం 12 నిమిషాల నుంచి 15 నిమిషాలకు ఒకటి చొప్పున తిరుగుతోంది. కనీసం 5 నిమిషాలకు ఒకటి చొప్పున తిరిగితే ప్రయాణికుల ఆదరణ పెరిగే అవకాశం ఉంది. ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా ఫలక్‌నుమా వరకు మెట్రోను పొడిగించనున్నట్లు తాజాగా సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఈ రూట్‌కు సైతం ప్రయాణికుల ఆదరణ అనూహ్యంగా పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ మార్గంలో ఇప్పటికే సర్వే పూర్తి చేయడంతో పాటు సమగ్రమైన నివేదిక సైతం సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. మూడు కారిడార్లలో కలిపి ఎల్‌అండ్‌టీ సంస్థ ఇప్పటి వరకు 69 కి.మీ.కుపైగా పూర్తి చేసింది. ఈ కారిడార్‌ను కూడా ఫలక్‌నుమా వరకు పొడిగిస్తే మూడు కారిడార్‌లలో కలిపి 74 కి.మీ వరకు పెరగనుంది. అక్కడి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు కూడా అనుకూలంగా ఉంటుంది.

బడిబస్సుకు ముకుతాడు

తల్లిదండ్రులు ఓకే అంటేనే వాహనం రోడ్డెక్కాలి

- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీలో పేరెంట్స్ భాగస్వామ్యం
- మార్గదర్శకాల రూపకల్పనలో ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు
- రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో నిర్ణయం



సాక్షి, సిటీబ్యూరో: గత జూన్ 15న మీర్‌చౌక్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టడంతో 50 ఏళ్ల మహిళ తస్నీమ్ కౌసర్ మృతి చెందింది. ఈ నెల 10న బాలాపూర్‌లో స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం చిన్నారి మృతికి కారణమైంది. తల మీది నుంచి బస్సు దూసుకెళ్లడంతో ఆరేళ్ల చిన్నారి భావన తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మరణించింది.. ఒకటి రెండు కాదు ఈ ఏడాదిలో ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్‌లో తొమ్మిది స్కూల్ బస్సు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో రెండు ప్రమాదాలు ఘోరమైనవి కాగా.. 7 సాధారణ రోడ్డు ప్రమాదాలు. ఆయా ప్రమాదాల్లో ముగ్గురు మరణించగా.. ఆరుగురికి గాయాలయ్యాయి. బస్సుల ఫిట్‌నెస్‌లపైనే కాకుండా డ్రైవర్ల సామర్థ్యంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో తల్లిదండ్రులనూ భాగస్వాముల్ని చేయాలని నిర్ణయించారు. రవాణా శాఖ అధికారులు (ఆర్టీఏ), ట్రాఫిక్ పోలీసులు మార్గదర్శకాలను రూపొందించనున్నారు. ఇక నుంచి పేరెంట్స్ కమిటీ బస్సులను భౌతికంగా పరిశీలించి, సంతృప్తి చెందిన తర్వాతే బస్సులకు సామర్థ్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేయనున్నారు.

నియంత్రణ వ్యవస్థ ఎక్కడ?

రవాణా సౌకర్యం పేరిట పాఠశాల యాజమాన్యాలు ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు చార్జీ చేస్తుంటాయి. గ్రేటర్‌లో చాలా వరకు పాఠశాలలు బస్సుల నిర్వహణ బాధ్యతలను థర్డ్ పార్టీ ఏజెన్సీలకు అప్పగిస్తుంటాయి. ఫలితంగా చాలా మంది అనుభవం లేని డ్రైవర్లు ఈ వృత్తిలోకి ప్రవేశిస్తున్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం వంటి వాటిని తల్లిదండ్రులు గుర్తిస్తే తప్ప ఈ లోపాలను తనిఖీ చేసే లేదా నియంత్రించే యంత్రాంగం స్కూల్ యాజమాన్యాల వద్ద లేవు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పైపై మెరుగులే..

పైపై మెరుగులతోనే బస్సులు రోడ్డెక్కుతున్నాయి. బ్రేక్‌లు, క్లచ్‌ల నిర్వహణ సరిగా లేకపోవటం, అత్యవసర ద్వారాలు లేకపోవటం, వృద్ధ డ్రైవర్లు.. ఇలా అనేక అంశాలలో నిబంధనలను పట్టించుకోకుండా బస్సులను నడుపుతున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌లో 20 వేలకుపైగా స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్‌లో 350, మేడ్చల్‌లో 700, రంగారెడ్డిలో 1,200 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పొందలేదు.

మార్గదర్శకాలివే..

- బస్సుల భౌతిక పరిస్థితిని పర్యవేక్షించడానికి ప్రతి విద్యాసంస్థ తల్లిదండ్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా రికార్డును ఏర్పాటు చేయాలి. ప్రతి త్రైమాసికంలో నిర్వహణ, ఫిర్యాదుల పురోగతిని సమీక్షించాలి.
- ప్రతి స్కూల్ బస్సుకు శాశ్వత డ్రైవర్ ఉండాలి.
- 3 నెలలకు ఒకసారి డ్రైవర్‌కు కంటి చూపు పరీక్షలు నిర్వహించాలి. అలాగే డ్రైవర్ల ఆరోగ్య సంబంధిత రికార్డులను నిర్వహణ చేయాలి.
- డ్రైవింగ్ లైసెన్స్, వాహన పర్మిట్‌లను ఆర్టీఏ అధికారులు ధ్రువీకరించాలి.
- బస్సులు ట్రిప్ పూర్తయిన తర్వాత మెకానికల్ విభాగానికి పంపించి, తనిఖీ చేయించాలి.

'క్రైమ్' ఖాకీలకు 'ఖద్దరు' మద్దతు!

నేరాలు చేసిన వారికే వత్తాసు పలుకుతున్న నేతలు

- చర్యలు తీసుకోవద్దంటూ వెనకేసుకొస్తున్న వైనం
- ఈ కోణంలో ఉన్నతాధికారులపై తీవ్రంగా ఒత్తిళ్లు
- మూడు కమిషనరేట్లలోనూ కనిపిస్తున్న వ్యవహారాలు



సాక్షి, సిటీబ్యూరో: 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అనేక మంది రాజకీయ నాయకులు వివిధ సందర్భాల్లో చెప్పే మాట ఇది. అయితే కొందరు నేతలే క్రైమ్ చేసిన ఖాకీల విషయంలో చట్టం తన పని తాను చేసుకోకుండా అడ్డుపడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ ధోరణి మరింత పెరిగిందనేది బహిరంగ రహస్యమే. రాజధాని పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలోనూ ఈ ఖద్దరు జోక్యానికి సంబంధించిన ఉదాహరణలు ఉన్నాయి. 'ఏటీఎం దేవేందర్'. 'గేమింగ్ యాక్ట్ యాదగిరి రావు', 'ఐఆర్‌ఎస్ కృష్ణ'... ఈ మూడు వ్యవస్థల్లోని అవస్థల్ని ఎత్తి చూపిస్తున్నాయి. తొలి రెండు కేసుల్లో అరెస్టులు తప్పించిన రాజకీయ నాయకులు తాజాగా ఎస్సై కృష్ణ అంశంలోనూ ఇవే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

నిందితుడి ఏటీఎం కార్డు వాడినా..

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఎస్.దేవేందర్ ఓ కేసులో అగర్వాల్‌ను అరెస్టు చేశారు. ఇతడి నుంచి స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డును తన అధీనంలోనే ఉంచుకుని, దాన్ని వినియోగించి రూ.5.07 లక్షలు కాజేశాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో తొలుత దేవేందర్‌ను అంబర్‌పేట పీటీసీకి అటాచ్ చేసిన ఉన్నతాధికారులు ఆపై సస్పెండ్ చేశారు. చట్ట ప్రకారం దేవేందర్ చేసింది గ్రేవ్ అఫెన్స్‌గానే పరిగణించాలి. అయినప్పటికీ అధికారులు ఆ కోణంలో ముందుకు వెళ్లలేదు. వాస్తవానికి సదరు ఏటీఎం కార్డు అతడు వాడలేదని, తిరుపతి వెళ్తున్న తన స్నేహితురాలికి ఇచ్చాడని తెలిసింది. ఈ కేసులో ఆమెను నిందితురాలిని చేసి, దేవేందర్‌పై కేసు నమోదు చేసి కటకటాల్లోకి పంపే ఆస్కారం ఉన్నా అధికారులు ఆ కోణంలో ఆలోచించలేదు.

ఏసీబీ చరిత్రలో 'కొత్త రికార్డు'..

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మియాపూర్ పోలీసుస్టేషన్‌లో జరిగిన ఓ 'ఏసీబీ కేసు' విషయంలో ఆ అధికారులు తీసుకున్న చర్య కొత్త రికార్డుగా మారింది. ఈ ఠాణా పరిధిలోని గేమింగ్ యాక్ట్ కేసులో ప్రభు, అశోక్ పట్టుబడ్డారు. ఈ కేసును మియాపూర్ అడ్మిన్ ఎస్సై యాదగిరి రావు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ వేశారు. కేసు ముగిసినప్పటికీ నిందితులతో నడుస్తోందనే చెప్పి ఈ ఎస్సై, హెడ్-కానిస్టేబుల్ రూ.2.5 లక్షల లంచం డిమాండ్ చేశారు. రూ.50 వేలు విడతల వారీగా తీసుకుంటూ వెంకట్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు. అతడి వాంగ్మూలంలో ఎస్సై సూచనల మేరకే తాను ఈ లంచం తీసుకున్నాననీ చెప్పాడు. ఆ సమయంలో యాదగిరి రావు అందుబాటులో లేకపోవడంతో వెంకట్‌రెడ్డి మాత్రమే అరెస్టు అయ్యాడు. చాన్నాళ్లు పరారీలో ఉన్న యాదగిరి రావుకు ఏసీబీ అధికారులు గతంలో ఉన్నదూ లేని విధంగా సీఆర్పీసీ 41ఏ నోటీసులు జారీ చేశారు. ఉన్నతాధికారులు సస్పెన్షన్‌తో సరిపెట్టాల్సి వచ్చింది.

ఒకప్పుడు పోస్టింగ్స్ వరకే..

పోలీసు విభాగంలో రాజకీయ జోక్యం చాన్నాళ్లుగా ఉంది. ఒకప్పుడు తప్పు చేసినా తమ అనుచరులు, వర్గం వారిని రక్షించుకోవడం వరకే ఇది ఉండేది. ఆపై పోస్టింగ్స్‌లో జోక్యం చేసుకోవడం, పైరవీలు, లెటర్లు వరకు వెళ్లింది. ఇప్పుడు పరిస్థితులు మరింత దిగజారాయి. నేరాలు చేసిన పోలీసులకూ వెనకేసుకు వస్తున్న రాజకీయ నాయకులు అనేక మంది ఉంటున్నారు. వీరికి అరెస్టు చేయవద్దని, అవసరమైతే కేసు నుంచి పూర్తిగా తప్పించాలని ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి.

– 'సాక్షి'తో మాజీ అదనపు ఎస్పీ

కనిపించకుండా 'తిరుగుతున్న' కృష్ణ..

ముషీరాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే ఆదాయపు పన్ను శాఖ మాజీ అదనపు కమిషనర్, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి శామ్యూల్ ఇంట్లో చోటు చేసుకున్న భారీ చోరీలో దుండిగల్ మాజీ క్రైమ్ ఎస్సై ఎస్.కృష్ణ పాత్ర రూఢీ అయింది. భూ లావాదేవీల్లో తలెత్తిన వివాదాల నేపథ్యంలో శామ్యూల్ ఇంట్లో డాక్యుమెంట్ల చోరీకి ఇతగాడే స్కెచ్ వేశాడు. ఈ కేసులో ఇప్పటికే అధికారులు సురేందర్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి వాంగ్మూలంలో కృష్ణ పాత్ర బహిర్గతం కావడంతో పాటు నగల తాకట్టు, డాక్యుమెంట్లు రికవరీల్లో సుస్పష్టమైంది. అయినప్పటికీ ఇప్పటికీ ఇతగాడు పోలీసులు చిక్కకుండా 'తిరుగుతున్నాడు'. చట్ట ప్రకారం ఇతడిని ఈ కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చి అరెస్టు చేసే అవకాశం ఉన్నా... ఆ దిశలో పోలీసులు చర్యలు తీసుకోవట్లేదు. అదేమంటే ప్రత్యేక బృందాల గాలింపు, ఇంకా చిక్కని ఆచూకీ అంటూ చెబుతున్నారు.

పెట్టుబడులు, ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- రూ.కోట్లు కొల్లగొట్టిన కోటిపల్లి శ్రీనివాస్
- రాయదుర్గం పీఎస్‌లో కేసు నమోదు



కోటిపల్లి శ్రీనివాస్ (ఫైల్)

గచ్చిబౌలి: పెట్టుబడి పెడితే ఏడాదిలోనే రెట్టింపు ఇస్తానని కొందరిని, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలు ఇప్పిస్తానని మరి కొందరిని నమ్మించి బురిడీ కొట్టించిన కోటిపల్లి శ్రీనివాస్ కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ మహేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

బాలాపూర్ మండలం మజీద్‌పల్లికి చెందిన ఎరకోటి కృష్ణకు గచ్చిబౌలిలోని ఫ్లోరా గ్రీన్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కోటిపల్లి శ్రీనివాస్ ఒక స్నేహితుడి ద్వారా పరిచయమయ్యారు. తన వద్ద పెట్టుబడి పెడితే సంవత్సరంలోనే రెట్టింపు ఇస్తానని మాయమాటలతో నమ్మించడంతో రెండేళ్ల క్రితం రూ.10 లక్షలు, కొద్ది రోజులకే మరో రూ.8 లక్షలు పెట్టుబడిగా శ్రీనివాస్‌కు ఇచ్చాడు. రెండేళ్లు దాటినా డబ్బులు ఇవ్వకపోవడంతో పలు మార్లు ఒత్తిడి చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో కృష్ణ రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైల్వేతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తన స్నేహితులను నమ్మించి లక్షల్లో దండుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీనివాస్ పై 406, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఆధారాలతో పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. ఇప్పటికే 20 మంది వరకు బాధితులు ఉండవచ్చని, కోటి రూపాయల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోందని సీఐ పేర్కొన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు, ఖమ్మం జిల్లాలకు చెందిన బాధితులే ఎక్కువగా ఉన్నారని, వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు పేర్కొంటున్నారు. మూడేళ్ల నుంచి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ కోసం రాయదుర్గం పోలీసులు వేట ప్రారంభించారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆత్మహత్య

గోల్కొండ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మహావీర్ (42) ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతని 18 నెలల కూతురు కూడా ఉంది. గత కొంత కాలంగా మహావీర్‌కు, అతని భార్యకు మధ్య విభేదాలు వచ్చాయి. దీనికి సంబంధించిన కేసు న్యాయస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో మహావీర్ కుటుంబం విషయంపై ఆందోళనలో ఉన్నాడు. మంగళవారం ఉదయం మహావీర్ ఇంటి నుంచి బయటకు రాలేదు. దీంతో ఆందోళన చెందిన అతని సోదరి ఇంటి తలుపు తట్టింది. అయితే ఎంతకీ తెరవకపోవడంతో తన బంధువులతో కలిసి తలుపు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అప్పటికే మహావీర్ ఇంట్లో ఉన్న రాడ్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా..మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

పనిమనిషి అతి తెలివి.. పక్కింట్లో గుట్టుగా చోరీ

- తాళాలు ఇంటి ఆవరణలోనే ఉంచిన యజమాని
- అదును చూసి దొంగతనానికి పాల్పడి.. పోలీసుల విచారణలో దొరికిన వైనం...
- 24 తులాల బంగారం, రూ.4 లక్షల నగదు స్వాధీనం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డ ఓ పనిమనిషి పక్కింటి గుట్టు తెలుసుకుని చోరీకి పాల్పడింది. విచారణలో అడ్డంగా దొరికిపోయింది. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డి తదితర పోలీసులు వివరాలు వెల్లడించారు. రామంతాపూర్ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి గోవు కరుణాకర్ రెడ్డి గత నెల 30న ఇంటికి తాళం వేసి..అలవాటుగా తాళం చెవిని అక్కడే ఉండే షేవింగ్ కిట్‌లో పెట్టి బెంగుళూరుకు వెళ్లాడు. ఈ నెల 4న తిరిగి ఇంటికి వచ్చారు. 6వ తేదీన బీరువాలో ఉన్న బంగారు నగలు, కొంత నగదు లేదని గమనించిన కరుణాకర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి, బీరువాకు వేసిన తాళాలు వేసినవి వేసినట్లే ఉన్నాయి. కానీ ఉండాల్సిన 75 తులాల బంగారంలో 24 తులాల ఆభరణాలు, రూ.ఐదు లక్షల నగదులో నాలుగు లక్షలు మాయం అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేరం జరిగిన తీరు ఇలా...

కరుణాకర్ రెడ్డికి మూడంతస్తుల భవనం ఉంది. అతని కదలికలను ప్రతిరోజు పక్కంటి పనిమనిషి బొల్ల నిర్మల గమనించేది. నిర్మల కొంత కాలంగా ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడింది. అందుకు డబ్బులు అవసరమయ్యాయి. ఈ నేపథ్యంలో కరుణాకర్ రెడ్డి ఇంటికి తాళం వేసి అక్కడే కీ ఉంచిన విషయాన్ని ఆమె గమనించింది. 4వ తేదీ రాత్రి షేవింగ్ కిట్‌లో ఉన్న తాళం చెవిని తీసుకుంది. ఇంట్లోకి ప్రవేశించి బెడ్ వద్ద వెతకగా..బీరువా కీ కూడా లభించడంతో పని సులువు అయ్యింది. బీరువాలో ఉన్న ఆభరణాలు మూడు మూటల్లో ఉండటంతో తెలివిగా మూడింటిలో నుంచి కొన్ని కొన్ని తీసుకుంది. అలాగే ఐదు లక్షల నగదులో రూ.నాలుగు లక్షలు తీసుకుని యథావిధిగా తాళాలు వేసి వెళ్లిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన ఉప్పల్ డి.ఐ ఉపేందర్ పక్కింటి వారిని కూడా విచారించారు. ఈ క్రమంలో నిర్మలపై అనుమానం వచ్చింది. వెంటనే అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయట పడింది. ఈ మేరకు నిర్మలను అరెస్టు చేసి రూ.నాలుగు లక్షల నగదు, 24.9 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగతనం కేసును చాకచక్యంగా ఛేధించి పూర్తి నగలు, నగదును రికవరీ చేసిన పోలీసు సిబ్బందిని సత్కరించి నగదు పురస్కారాలు అందజేశారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

- చెన్నైలో మహిళ అరెస్టు
- తల్లిదండ్రుల చెంతకు బాలుడు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈ నెల 4వ తేదీన ఏడు నెలల బాబు కిడ్నాప్ కేసును గోపాలపురం పోలీసులు ఛేదించారు. బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించి నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన పింకీ, అజయ్‌లు భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఏడునెలల వయసున్న కుమారుడు ఉన్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఇస్నాపూర్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 4న సొంత గ్రామానికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన భార్యా భర్తలు ఇక్కడే గొడవపడ్డారు. దీంతో భర్త లగేజీ తీసుకుని తాను తిరిగి ఇస్నాపూర్ వెళ్తానని చెప్పి వెళ్లాడు. దీంతో ముగ్గురు పిల్లలను వదిలిపెట్టి భర్తను వెతుక్కుంటూ పింకీ వెళ్లగా వీరి ఏడు నెలల బాబు కిడ్నాప్‌కు గురయ్యాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టగా కిడ్నాప్ చేసిన మహిళ చెన్నైకి వెళ్లినట్లు గుర్తించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన మహిళ సికింద్రాబాద్ నుంచి ఆటోలో నాంపల్లికి వెళ్లింది. అక్కడ ఆటో డ్రైవర్‌కు గూగుల్‌పే ద్వారా డబ్బులు చెల్లించింది. సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించిన పోలీసులు ఆమె చేసిన గూగుల్‌పే ద్వారా ఫోన్ నెంబర్ సేకరించి కిడ్నాపర్ చెన్నైకి చెందిన నర్మద (35)గా గుర్తించారు. ఈ మేరకు అక్కడకు వెళ్లి అరెస్టు చేసి నగరానికి తీసుకుని వచ్చారు. కాగా చెన్నైలో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేసే నర్మద.. తనకు పెళ్లై చాలా ఏళ్లైనా పిల్లలు లేకపోవడంతో పెంచుకునేందుకు ఎత్తుకుని వెళ్లానని పోలీసుల విచారణలో వెల్లడించింది. ఏది ఏమైనా కిడ్నాప్ కేసు కావడంతో జైలుకు వెళ్లాల్సి వచ్చింది.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

స్థానికుల సమాచారంతో అడ్డుకున్న రెవిన్యూ అధికారులు



తొండుపల్లిలో ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసేందుకు తీసిన గోతులు

శంషాబాద్: కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేసేందుకు అక్రమార్కులు రంగంలోకి దిగారు. గుంతలు తీసి నిర్మాణాలు చేసేందుకు యత్నించారు. సర్కారు స్థలాన్ని కాజేస్తున్న సమచారాన్ని స్థానికులు రెవిన్యూ అధికారులకు అందించడంతో వారి ప్రయత్నం విఫలమైంది. పట్టణంలోని తొండుపల్లి రెవిన్యూ పరిధిలోని సర్వే నంబరు 132లో నాలుగు ఎకరాల పైచిలుకు మాతృక భూమి (ప్రభుత్వ భూమి) ఉంది. ఈ భూమిలో గత రెండురోజులుగా స్థానికంగా కొందరు కబ్జా చేసేందుకు రంగంలోకి దిగారు. భారీ ఎత్తున గోతులు తవ్వడంతో పాటు బోరు వేయించారు. తొండుపల్లి గ్రామస్తులు దీనిపై మంగళవారం రెవిన్యూ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. సంబంధిత స్థలం ప్రభుత్వానిదేనని ఆర్ఐ సునీత వివరించారు. ప్రభుత్వ స్థలంలో పనులు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

నిల్వచేసిన సిలిండర్లతోనే ప్రమాదాలు!

- గడువు ముగిసిన సిలిండర్లను తిరస్కరించాలి..
- లేకుంటే ప్రమాదాలకు ఆస్కారం
- ఎప్పటికప్పుడు సిలిండర్ల పరిశీలన తప్పనిసరి



సాక్షి, సిటీబ్యూరో: గ్యాస్ సిలిండర్ పేలుడు.. సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం వంటి ఘటనలు నిత్యం వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. నగరంలో ప్రధానంగా నిల్వ చేసిన సిలిండర్లతోనే అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కేవలం అవగాహన లోపం..నిర్లక్ష్యం ఈ ప్రమాదాలకు కారణంగా చెబుతున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు, గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించడం వంటి వాటితో పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

నిండా నిర్లక్ష్యమే...

ఎల్పీజీ సిలిండర్ల విషయంలో కొన్ని చమురు సంస్థలు పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. కాలం చెల్లిన సిలిండర్లను వినియోగదారులకు అంటగడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. వినియోగంలో దెబ్బతిన్న సిలిండర్లను మార్చడం లేదా, వాటికి మరమ్మతులు చేయడంలో కంపెనీలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. సిలిండర్ల కాల పరిమితి పూర్తి కాగానే వాటిని రీ-క్యాలిబ్రేషన్ పరీక్షకు పంపాల్సి ఉంటుంది.

మూడు దశల్లో...

గ్యాస్ సిలిండర్ల నాణ్యతకు సంబంధించి నిర్వహించే రీ-క్యాలిబ్రేషన్ పరీక్ష మూడు దశల్లో ఉంటుంది. ముందుగా విజువల్ తనిఖీ చేస్తారు. ఇందులో సిలిండర్ పనికిరాదని తేలితే దాన్ని ధ్వంసం చేయాల్సి ఉంటుంది. లేకపోతే హైడ్రాలిక్ పరీక్షలకు పంపుతారు. అక్కడ సిలిండర్లలో నీటిని నింపి ఐదుసార్లు ప్రెషర్ ద్వారా లీకేజీలను గుర్తిస్తారు. ఆ తర్వాత వాల్వు పరిస్థితిని గమనించి మరోసారి ప్రెషర్ పరీక్ష చేస్తారు. సిలిండర్లలో గాలి నింపి ఒత్తిడిని పెంచుతారు. అన్ని పరీక్షల్లో సిలిండర్ మంచిదని తేలితే దానిని ప్రజా వినియోగానికి అనుమతిస్తారు. అంతా ఓకే అనుకుంటేనే దానిని మరో ఐదు సంవత్సరాల పాటు వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది.

కాలపరిమితి ఇలా...

సిలిండర్‌పై ఉన్న రింగ్ కింది భాగంలో మూడు ఇనుప పట్టీలు ఉంటాయి. వాటిలో ఒక దానిపై లోపలి వైపు సిలిండర్ గడువు తేదీ ముద్రించి ఉంటుంది. అయితే సిలిండర్‌కు వేసి ఉన్న అంకెలు, తేదీలను చాలా మంది పెద్దగా పట్టించుకోరు. కానీ రింగు కింద భాగంలో లోపలి వైపు ముద్రించి ఉన్న తేదీలో 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ప్రతి మూడు నెలలకు ఒక ఆంగ్ల అక్షరం చొప్పున రాసి ఉంటుంది. సంవత్సరంలో నాలుగు భాగాలుగా విభజించి వాటికి ఆంగ్ల భాషల్లోని మొదటి నాలుగు అక్షరాలు ఏ,బీ,సీ,డీగా వేస్తారు. అందులో ఏ అక్షరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు, బీ అక్షరం ఏప్రిల్, మే, జూన్ నెలలకు, సీ అక్షరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు, డీ అక్షరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలను సూచిస్తాయి. సిలిండర్ పై ఏ,బీ,సీ, డీ కేటగిరీల వారీగా కాలపరిమితి తేదీలు ఉంటాయి. ఆ నెల ఆధారంగా సిలిండర్ గడువు ముగిసిందని గుర్తించాలి. గ్యాస్ సిలిండర్‌ను ఎప్పటికప్పుడు వినియోగిస్తే నాణ్యమైన గ్యాస్ అందడంతో పాటు ప్రమాదం జరిగే అవకాశం ఉండదు.

జీవిత కాలం ఏడేళ్లు..

ఖాళీ సిలిండర్లకూ కాల పరిమితి ఏడేళ్లుగా ఉంటుంది. అయితే ఇది వినియోగదారులకు సంబంధం లేదు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని గ్యాస్ నంబర్ల ప్రకారం ఏడేండ్లు దాటిన సిలిండర్లను డీలర్ల నుంచి వెనక్కి తెప్పించుకుని పరీక్షిస్తారు. ఏ మాత్రం వినియోగ యోగ్యం కాని, నాణ్యత లేని సిలిండర్లను తయారీదారులు పక్కన పెడతారు. కొందరు సిలిండర్లను కొనుగోలు చేసిన తర్వాత నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. ఇది కూడా మంచిది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వినియోగదారులు అవసరాన్ని బట్టి గ్యాస్‌ను బుక్‌చేసుకని వారం కంటే ఎక్కువ నిల్వలేకుండా చూసుకోవాలన్నారు.

అద్దె ఇంట్లో రహస్యంగా సీసీ కెమెరా...

- యజమాని నిర్వాకం
- యువతులు దుస్తులు మార్చుకున్న దృశ్యాల రికార్డింగ్
- గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతులు



నిందితుడు సయ్యద్ సలీం

బంజారాహిల్స్: ఇంటిని అద్దెకు ఇచ్చిన యజమాని...ఆ ఇంట్లో యువతులు దుస్తులు మార్చుకుంటున్న దృశ్యాలను వారికి తెలియకుండా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా చూస్తుండటంతో పసిగట్టిన బాధిత యువతులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటగిరిలోని హైలం కాలనీలో సయ్యద్ సలీం అనే వ్యక్తి తన ఇంట్లో ఓ గదిని ఇద్దరు యువతులు, ఒక యువకుడికి అద్దెకిచ్చాడు. రెండున్నర నెలల క్రితం వీరు ఈ గదిలో అద్దెకు దిగారు. కాగా సదరు ఇంటి యజమాని అద్దెకిచ్చిన గదిలో మీటర్ బాక్స్ పేరుతో ఓ ప్లాస్టిక్ బాక్స్‌ను ఏర్పాటు చేసి అందులో సీసీ కెమెరా పెట్టాడు. మరో నాలుగు కెమెరాలు తన ఇంట్లో ఏర్పాటు చేసి..రెండు డీవీఆర్‌లను బిగించాడు. నాలుగు రోజుల క్రితం తమ ఇంట్లో ఏర్పాటు చేసిన బాక్సు నుంచి వైరు నేరుగా ఇంటి యజమాని ఇంట్లోకి వెళ్లడాన్ని గమనించిన యువతులు ఇదేమిటని ఆరా తీశారు. తీరా చూస్తే అది సీసీ కెమెరా అని తేలింది. దీంతో బాధిత యువతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా నిందితుడు సయ్యద్ సలీం సీసీ కెమెరా ఏర్పాటుచేసి యువతులు దుస్తులు మార్చుకుంటున్నప్పుడు వాటిని రికార్డు చేసిన విషయాన్ని ఒప్పుకున్నాడు. ఆ సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశాడు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 355(సి), 509, 67 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఎన్టీఆర్ గార్డెన్ ఘటనలో ముగ్గురిపై వేటు

- క్లాక్ రూమ్ నిర్వాహకులకు రూ.2500 పెనాల్టీ
- హెచ్ఎండీఏ పార్కుల్లో సర్వీసుల డిస్ ప్లే బోర్డులు

సాక్షి, సిటీబ్యూరో: నెక్లెస్ రోడ్డులోని ఎన్టీఆర్ గార్డెన్‌లో క్లాక్ రూమ్ నిర్వాహకులు, సెక్యూరిటీ దురుసుగా ప్రవర్తించారంటూ సోషల్ మీడియా(ట్విట్టర్)లో వచ్చిన వార్తలపై హెచ్ఎండీఏ స్పందించింది. ఈ ఘటనపైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంది. హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ (బీపీపీ) ఓఎస్డీ చంద్రారెడ్డి ఎన్టీఆర్ గార్డెన్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఇక్బాల్ హుస్సేన్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంఘటనకు బాధ్యురాలిగా గుర్తించిన మహిళా సెక్యూరిటీ సిబ్బందితో పాటు క్లాక్ రూమ్‌లో పనిచేస్తున్న ఇద్దర్ని తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. క్లాక్ రూమ్ నిర్వాహకులకు రూ.2,500 పెనాల్టీ విధించారు. ఇకపై హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న అన్ని పార్కులలో సేవలకు సంబంధించిన ఫీజులపై డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్టీఆర్ గార్డెన్ పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్‌కు బీపీపీ ఓఎస్డీ చంద్రారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ట్రాఫిక్ పోలీసులపై దౌర్జన్యం చేసిన ముగ్గురికి జైలు



నిందితులు

హిమాయత్‌నగర్: తప్పతాగి వాహనం నడిపిస్తూ.. పోలీసులకు పట్టుబడ్డారు. ఇది తప్పని చెప్పినా.. పోలీసులను మీరెంత అంటూ వారిపై దౌర్జన్యానికి తెగబడ్డారు ముగ్గురు మందుబాబులు. సెక్రటరియేట్ (లేక్) పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలివీ..ఆదివారం సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు పీపుల్స్ ప్లాజా వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ విధులు నిర్వర్తిస్తున్నారు. అదే సమయంలో మణికొండకు చెందిన ఇడ్లి రవి, ఎస్.శివగౌడ్, యాచారంకు చెందిన దండు మహేష్‌లు పట్టుబడ్డారు. మద్యం సేవించి వాహనం నడపకూడదు కదా, ఇలా ఎందుకు చేస్తున్నారంటూ పోలీసులు ప్రశ్నించగా వారిపై దౌర్జన్యానికి తెగబడ్డారు. బండ బూతులు తిడుతూ వీరంగం సృష్టించారు. దీంతో ఈ ముగ్గురిపై ట్రాఫిక్ పోలీసులు సెక్రెటరియేట్ (లేక్) పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురినీ కోర్టులో హాజరు పరిచారు. దీంతో మంగళవారం ఈ ముగ్గురికీ న్యాయస్థానం 21 రోజుల పాటు జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్ఓ వి.బాలగోపాల్ తెలిపారు.

స్టీల్ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

- రూ.49 లక్షల నగదు సహా బంగారు, వెండి ఆభరణాలు సైతం...
- సుమారు రూ.5 కోట్ల మేర దొంగతనం
- రిసార్ట్‌కు వెళ్లి వచ్చేసరికి ఇల్లు లూటీ
- వాచ్‌మెన్ దంపతులే నిందితులు!

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పీజీ రోడ్ జవహర్‌నగర్‌లోని ఓ స్టీల్ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాంగోపాల్‌పేట్ స్టేషన్ పోలీసుల కథనం మేరకు..రాణిగంజ్‌లో ఐరన్ వ్యాపారం చేసే రాహుల్ గోయల్ జవహర్‌నగర్‌లోని ఓం టవర్స్ మొదటి అంతస్తులో తన సోదరులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ కుటుంబం మొత్తం ఈ నెల 9న ఉదయం 11 గంటలకు శంషాబాద్‌లోని ఓ రిసార్ట్‌కు వెళ్లారు. తిరిగి 10వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చేసరికి వీరుండే ఫ్లాట్స్‌లో తాళాలు పగులగొట్టి ఇంట్లో సామాగ్రి చిందరవందరగా పడిఉండటాన్ని గమనించారు. ఆందోళనతో వెంటనే అల్మారాల్లో చూడగా వాటి తాళాలు పగులగొట్టి ఉండగా..బంగారం, వెండి, వజ్రాభరణాలు, రూ.49 లక్షల నగదు కనిపించలేదు. ఇందులో సుమారు 4 కేజీల బంగారు, 10 కేజీల వెండి ఆభరణాలు, వజ్రాభరణాలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటి విలువ దాదాపు ఐదు కోట్ల రూపాయల మేర ఉండొచ్చని అంచనా వేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వాచ్‌మెన్ దంపతుల పనే..

కాగా ఈ అపార్ట్‌మెంట్‌లో గత ఐదేళ్లుగా నేపాల్‌కు చెందిన కమల్ అనే వ్యక్తి భార్యతో కలిసి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గోయల్ కుటుంబం మొత్తం రిసార్ట్‌కు వెళ్లడంతో వాచ్‌మెన్ దంపతులు ఆభరణాలు, నగదు తీసుకుని ఉడాయించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో కనిపించాయి. దీంతో వెంటనే పోలీసులు రెండు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నేపాల్‌కు చెందిన వ్యక్తులు కావడంతో ఈ బృందాలు అక్కడికి కూడా వెళ్లాయి.

కుమార్తెను చూసేందుకు నగరానికి వచ్చిన తండ్రి అదృశ్యం



సత్యనారాయణ(ఫైల్)

వెంగళరావునగర్: కుమార్తెను చూడానికి నగరానికి వచ్చిన ఓ రిటైర్డ్ ఉద్యోగి నగరంలో కనిపించకుండా పోయిన సంఘటన మధురానగర్ పోలీసస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా జజ్జులగుంట గ్రామానికి చెందిన సత్యనారాయణ తన కుమార్తెను చూడానికి ఈ నెల 9న నగరానికి బయలుదేరాడు. ఆ రోజు రాత్రి దాదాపు 9.30 గంటల సమయంలో దోపిచర్ల గ్రామం వద్దకు అతని చిన్నకుమారుడు సితారా ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు పంపాడు. బస్సు నగర శివారులోని పనామా గోడౌన్ వద్దకు రావడానికి ఉదయం 4 గంటల సమయం పడుతుందని చెప్పడంతో సత్యనారాయణ కుమార్తె నాగిని తన భర్తను ఆ ప్రాంతానికి పంపింది. అయితే సత్యనారాయణ ఆ స్టేజిలో దిగలేదు. నాగిని భర్త ఎంతసేపు వేచిచూసినా రాకపోవడంతోపాటు ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో విషయాన్ని బావమరిదికి తెలియజేయగా అతను ట్రావెల్స్ ఏజెంట్‌కు ఫోన్ చేసి ప్రశ్నించాడు. బస్సు డ్రైవర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్న ఏజెంట్ సత్యనారాయణ అనే వ్యక్తి అమీర్‌పేట మైత్రీవనం వద్ద దిగాడని పేర్కొన్నాడు. దాంతో హుటాహుటిన అల్లుడు, కుమార్తె తదితర బంధువులు మైత్రీవనం తదితర ప్రాంతాలకు వచ్చి చుట్టుపక్కల విచారించారు. ఫలితం లేకపోవడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

ట్రస్ట్ పేరిట బురిడీ



నిందితుడు రిషబ్ మాలిక్ గుర్తింపు కార్డు

బంజారాహిల్స్: 'మాకు బ్యాంకులో వందల కోట్ల నిల్వలు ఉన్నాయి. ఆదాయ పన్ను నుంచి తప్పించుకోవాలంటే ట్రస్ట్‌కు వాటిని బదిలీ చేస్తాం. అందుకోసం మీరు కొంత పెట్టుబడి పెడితే సంస్థల మాటున మా వద్ద ఉన్న డబ్బును మీ అకౌంట్‌లోకి బదిలీచేస్తాం...' అంటూ నమ్మించి నగరవాసులనుంచి డబ్బులు దండుకున్న ఓ ముఠాను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... న్యూ ఢిల్లీకి చెందిన మచ్తాబేర్ ఇన్ఫోర్నో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు నోయిడాలోని డూయిష్ బ్యాంకులో రూ.867 కోట్ల నిధులు ఉన్నాయని, దీంట్లో ఫైనాన్షియల్ అడ్వయిజర్‌గా పనిచేస్తున్న రిషబ్ మాలిక్ నగరానికి చెందిన కొంతమందిని నమ్మించాడు. ఆ బ్యాంకు నకిలీ ఖాతాలను, రూ.867 కోట్లు ఉన్న స్టేట్‌మెంట్లు చూపించాడు. ఇది నమ్మిన చాలా మంది డబ్బులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. మీరు ఓ ట్రస్ట్ పేరుతో బ్యాంకు ఖాతా తెరిస్తే మేం మా బ్యాంకు నుంచి వాటిని మీ ఖాతాల్లోకి మళ్లిస్తామంటూ నమ్మించారు. ఈ వ్యవహారాలు మాట్లాడేందుకు, పలువురిని నమ్మించేందుకు సోమవారం జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో ఓ వ్యక్తిని కలిసేందుకు వచ్చిన రిషబ్ మాలిక్‌ను పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో ఈ మొత్తం గుట్టురట్టయింది. రిషబ్ మాలిక్‌పై ఐపీసీ సెక్షన్ 420, 467, 468 కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్, భరత్‌నగర్ 11కేవీ ఫీడర్లు బేగంపేట, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రశాంత్‌నగర్ కాలనీ, బల్కంపేట, బి.కె.గూడ, మసీదు, ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్‌తో పాటుగా భరత్‌నగర్‌కాలనీ, మహేశ్వర్‌నగర్ కాలనీ, శక్తినగర్, ఎల్ఐజీ, ఈడ బ్ల్యుస్, ఎంఐజీ, హెచ్ఐజీ క్వార్టర్స్, ఎస్పీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యశక్తి, ఐజీపురం, ఎంసీహెచ్ మార్కెట్, సారథి నగర్ 11కేవీ ఫీడర్లు బేగంపేట, గ్రీన్‌లాండ్స్, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల అపోలో ఆస్పత్రి ఎదురు, లాల్‌బంగ్లా ఏరియా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, ఐజీపురం, బేగంపేట బస్తీ, అపరాజిత కాలనీ, సతాయిత్ మంజిల్, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్ఆర్‌టీ కాలనీ, బోరబండ శివాలయం వీధి, సారథినగర్, హెచ్ఎఫ్ నగర్, హెచ్ఎఫ్‌నగర్ కమ్యూనిటీ హాల్, సంజయ్‌నగర్, శ్రీరామ్‌నగర్, కార్మికనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

జేవీఆర్ పార్కు 11కేవీ ఫీడర్ నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో...

వెంగళరావునగర్: జేవీఆర్ పార్కు 11కేవీ ఫీడర్ నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. అమృత 11కేవీ ఫీడర్ ముఫకంజ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు దానం నాగేందర్ గల్లీ, రోడ్-3, దానం నాగేందర్, కవితల గృహాలకు విద్యుత్ ఉండదన్నారు. డి.కె.బస్తీ 11కేవీ ఫీడర్ రోడ్-2 సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల డికె బస్తీ ఏరియా, రోడ్-5, బంజారాహిల్స్ ప్రభుత్వ పాఠశాల ఏరియాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు, ఈ-సేవ 11కేవీ రోడ్-2 సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు రోడ్-7, 14, కుక్కల హాస్పిటల్, రోడ్-4, ఉడుపి హోటల్, ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

కాంగ్రెస్ షేక్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ షేక్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా డి. సత్యనారాయణ నియమితులయ్యారు. తనను నమ్మి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, కాంగ్రెస్ గెలుపు కృషి చేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా లియాకత్‌అలీ



రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా శ్రీరాంనగర్‌కు చెందిన మైనారిటీ నాయకుడు మహ్మద్ లియాకత్‌అలీ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ జారీ చేశారు.

మిస్సింగ్ కేసును 24 గంటల్లో ఛేదించిన బోరబండ పోలీసులు



అభిషేక్‌ను తల్లి వజ్రకు అప్పగిస్తున్న దృశ్యం

రహమత్‌నగర్: మిస్సింగ్ కేసును చాలెంజ్‌గా తీసుకున్న బోరబండ పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. వివరాలివీ... కళ్యాణ్ నగర్‌కు చెందిన అభిషేక్ ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేదని మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లి వజ్ర ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆదేశాల మేరకు సెక్టార్ ఎస్ఐ మనోజ్ కుమార్ వేగంగా విచారణ ప్రారంభించారు. అభిషేక్ సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా అతను తాండూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులకు సమాచారం అందించి అభిషేక్‌ను తీసుకొచ్చి తల్లిదండ్రులను అప్ప జెప్పారు. బోరబండ పోలీసులు పనితీరుపై అభిషేక్ తల్లి వజ్ర, డివిజన్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 67, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 95, బజ్జీమిర్చి 80, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 19, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 23, బీట్‌రూట్ 25, ఉల్లి 22, ఆలు 21, సొరకాయ 15, , ముల్లంగి 4-6.మునగకాయ 3-4.

బోనమెత్తిన బస్తీలు



- ఫిలింనగర్ బస్తీలో బోనాల సందడి
- బస్తీల్లో పండగ వాతావరణం

ఫిలింనగర్ బస్తీలలో ఆషాఢ మాస బోనాల వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఫిలింనగర్ బస్తీల్లోని దీన్‌దయాల్‌నగర్, దుర్గా భవానీనగర్, వినాయక నగర్, గౌతంనగర్ బస్తీల్లో కొలువుదీరిన అమ్మవారి ఆలయాల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనమెత్తి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. – ఫిలింనగర్







వినాయకనగర్ మారెమ్మ-ఎల్లమ్మ గుడిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం



అమ్మవారికి సమర్పించేందుకు ఆలయాలకు బోనాలతో వస్తున్న మహిళలు

కులంపేరుతో దూషించిన వారిని కఠినంగా శిక్షించాలి

బంజారాహిల్స్: కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ రోడ్ నెం. 4 సుఖ్‌దేవ్‌నగర్ బస్తీకి చెందిన అరుంధతి మాదిగ సేవా సంఘం అధ్యక్షుడు చిత్రం బాబా, ప్రధాన కార్యదర్శి పి. ఫణికుమార్ సాయి ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బస్తీకి చెందిన యువకులు మద్యం సేవించి గొడవకు దిగారని తెలిపారు. అందులో ఎస్.దినేష్ అనే యువకుడు కులం పేరుతో శంకర్, రాకేష్ తదితరులను దూషించాడని ఆరోపించారు. ఇలా తిట్టడం వరుసగా ఇది మూడోసారి అని గతంలో రెండుసార్లు సర్దిచెప్పామన్నారు. తరచూ తమ కులాన్ని దూషిస్తూ కించపరుస్తూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఆరోపించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇన్‌స్పెక్టర్ నరేందర్‌కు ఫిర్యాదు చేస్తున్న అరుంధతి మాదిగ సేవా సంఘం నేతలు

ముమ్మరంగా 'ఆపరేషన్ ముస్కాన్'

బంజారాహిల్స్: బాల కార్మికులను పనిలో చేర్చుకోవద్దని బడికి పంపాలనే లక్ష్యంతో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. బాల కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే జూబ్లీహిల్స్ ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కమలాకర్, చైల్డ్ లైన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు జరిగాయి. ఇందులో భాగంగా వెంకటగిరిలోని ఓ పాన్‌షాప్ మహ్మద్ అయాన్ అనే 16 సంవత్సరాల బాలుడు పని చేస్తుండగా బృందం గుర్తించి పాన్‌షాప్ యజమాని జాఫర్‌కు ` 5100 జరిమానా విధించారు. బాలుడికి విముక్తి కలిగించి తల్లిదండ్రులకు అప్పగించారు. గత వారం రోజుల నుంచి ఈ తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

'ఆరు నెలల్లో వాహనాల కోసం సంప్రదించకపోతే వేలం వేస్తాం'

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాల కోసం వాహనదారులు పోలీసులను ధ్రువపత్రాలతో సంప్రదించకపోతే వేలం వేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సైబరాబాద్ పరిధిలో 539 వాహనాలను స్వాధీనం చేసుకొని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ వాహనాల వివరాలను సైబరాబాద్ వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.inలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్న యజమానులు వాటిని తిరిగి పొందేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌ఓను కలిసి మీ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆరు నెలల కాలపరిమితి లోపు సంప్రదించాలి. వివరాలకు ఎంటీఓ ఎస్. విష్ణు(94905 17317)లో సంప్రదించాలి.

షౌకత్‌నగర్‌లో విజయారెడ్డి పర్యటన

వెంకటేశ్వరకాలనీ: కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని ప్రజలకు తెలియజేయడానికి వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని షౌకత్‌నగర్ బస్తీలో ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి పర్యటించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు రాహుల్ గాంధీ సందేశ కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న విజయారెడ్డి

అన్నపూర్ణ స్టూడియో వద్ద భారీ పైప్‌లైన్ నిర్మాణం

బంజారాహిల్స్: కృష్ణానగర్ వైపు నుంచి బంజారాహిల్స్‌కు అన్నపూర్ణ స్టూడియో మీదుగా నిర్మిస్తున్న లింకు రోడ్డ వద్ద జరుగుతున్న జలమండలి పైప్‌లైన్ పనులను జలమండలి జీఎం హరి శంకర్ మంగళవారం పరిశీలించారు. వెంకటగిరి రిజర్వాయర్ నుంచి బంజారాహిల్స్‌లోని తట్టికాన రిజర్వాయర్‌కు ఇక్కడున్న 1200 ఎంఎం డయా భారీ పైప్‌లైన్ ద్వారా నిత్యం నీటి పంపింగ్ జరుగుతుంది. కాగా ప్రస్తుతం ఇక్కడ వేస్తున్న లింకు రోడ్డు వల్ల పైప్‌లైన్ రోడ్డు మధ్యలోకి వస్తుండటంతో పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్‌ను రూ. 2.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. 170 మీటర్ల పొడవులో ఈ భారీ పైప్‌లైన్ నిర్మాణం జరుగుతున్నది. ఇప్పటికే 90 శాతం మేర పనులు పూర్తయ్యాయని జంక్షన్ల నిర్మాణంతో ఈ పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

సెల్‌ఫోన్ ఇవ్వలేదని యువకుడిపై బీరు సీసాతో దాడి

బంజారాహిల్స్: సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఆగ్రహంతో మద్యం మత్తులో ఓ యువకుడిపై బీరు సీసాతో దాడి చేసిన రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాల్లోకి వెళ్తే... బోడుప్పల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ అనిల్‌కుమార్(28) సోమవారం రాత్రి శ్రీకృష్ణానగర్‌లోని సవేరా బార్‌కు వచ్చారు. మద్యం మత్తులో సమీపంలో ఉన్న ఎస్‌కె వలి అని సినీ కార్మికుడి వద్దకు వెళ్లి మాట్లాడుకోవడానికి ఫోన్ కావాలని అడిగాడు. మీరెవరో నాకు తెలియదు, ఫోన్ ఎందుకు ఇవ్వాలంటూ వలి ప్రశ్నించాడు. అక్కడి నుంచి వెళ్లిన అనిల్‌కుమార్ మరో వ్యక్తి ఫోన్ తీసుకొని మాట్లాడిన అనంతరం వచ్చి వలితో గొడవపడ్డాడు. మాటామాటా పెరిగింది. తాగిన మైకంలో అనిల్‌కుమార్ తన చేతిలో ఉన్న బీరు సీసాతో వలీ తలపై బాదాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్చారు.

బెల్టు షాపులపై దాడి: మద్యం బాటిళ్ల స్వాధీనం

రహమత్‌నగర్: బోరబండ బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ సమాచారం మేరకు... బోరబండ డివిజన్‌లో వినాయక నగర్, బంజారానగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారంతో శ్రీరాములు, సరళల నివాసాలపై దాడులు చేశారు. వారి నుంచి 470 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

బోరబండలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం బోరబండ అడ్మిన్ ఎస్ఐ మహేష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో గంజాయి విక్రయం, బెల్టు షాపులు రోజుకురోజుకూ పెరిగిపోతున్నాయని, దీంతో తరుచూ గొడవలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయన్నారు. గ్యాంగ్ వార్‌లు మితిమీరిపోతున్నాయని దానిని అరికట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో మందుబాబుల ఆగడాలు పెరిగి పోవడంతో బాలికలు తీవ్ర భయాందోళన చెందుతున్నారన్నారు. ఈ విషయాలను నగర పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, గంగరాజు, రామకృష్ణ, సత్యనారాయణ, ప్రేమ్, కిలారి మనోహర్, కొత్త వెంకటేశ్, రాజ్‌కుమార్, షర్మిలాజాదవ్, కృష్ణమోహన్, మన్మథరావు, రూప, నీలం రతన్‌కుమార్, శరణ్‌రెడ్డి, అనూప్, రాజు, రవి, ప్రశాంత్, శివ, మహేష్, బోస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రహమత్‌నగర్: సీఎం సహాయనిధితో ఎంతో మంది ప్రాణాలు నిలబడుతున్నాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన నాగమణి, నిజామొద్దీన్, పద్మ, శ్రావణి, శ్రీనివాస్‌రెడ్డి, నస్రీన్, షేక్ రఫీక్‌లకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, దుబాయ్ నజీర్, ఫయాజ్, షరీఫ్, రవిశంకర్, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను కడుపులో పెట్టుకుంటాం: ఎమ్మెల్యే దానం



ఎమ్మెల్యే దానంను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

ఫిలింనగర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని, వారిక ఏ కష్టమొచ్చినా అండగా నిలబడతామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గానికి చెందిన పలువురు తెలంగాణ ఉద్యమకారులు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆయన నివాసం వద్ద కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఆయనకు చెప్పుకున్నారు. చాలా మంది ఉద్యమకారులు ఇప్పటికీ నిరుపేదలుగానే ఉన్నారని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సొంతిళ్లు లేక కిరాయి ఇళ్లల్లో అద్దెలు చెల్లించుకునే స్తోమత లేని వారందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాంచందర్, జగన్, నర్సింహా, ఉమ, ప్రభాకర్, మాణిక్యం, ఉపేందర్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నేతలు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి జరుగుతుందని సంక్షేమ పథకాలు పేదలకు చేరతాయని ప్రజలు నమ్ముతున్నారని అందుకే రోజురోజుకూ కాంగ్రెస్‌లోకి చేరికలు పెరుగుతున్నాయని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్‌రోడ్ నెం. 3 షౌకత్‌నగర్ బస్తీకి చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన అనంతరం ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి రావడం ద్వారా పేదల ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు పార్టీలో చేరబోతున్నారని అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో కాంగ్రెస్‌లోకి చేరికలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు.

ప్రజల కోసం వైద్య వృత్తిని చేపట్టడం గర్వకారణం

వెంగళరావునగర్: బస్తీల్లో నివసించే ప్రజలకు సేవ చేయడానికే వైద్య వృత్తిని చేపట్టి సేవలందించడం ఎంతో గర్వకారణంగా ఉందని ఆల్ ఇండియా లైనెస్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ బస్తీలో గత పాతికేళ్లుగా అతితక్కువ ఫీజుతో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పెండెం చంద్రకాంత్ గాంధీని ఆయన సతీమణి నిర్మలను మంగళవారం క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా క్లబ్ మెంబర్లు మాట్లాడుతూ... ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడైన పెండెం వెంకటేశ్వర్లు కుమారుడైన చంద్రకాంత్ గాంధీ తన తండ్రినే కాకుండా మనదేశ జాతిపిత గాంధీని ఆదర్శంగా తీసుకుని విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. విద్య, వైద్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో ఇలాంటి వైద్యులు చాలా అరుదుగా ఉన్నారని చెప్పారు. భవిష్యత్‌లో కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈ సేవలు కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో ఆలిండియా లైనెస్ క్లబ్ భాగ్యనగర్ కమిటీ సభ్యులు సౌజన్య, కనకదుర్గ, సాయి సరిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ గాంధీ దంపతులను సన్మానిస్తున్న లైనెస్ క్లబ్ మెంబర్లు

కరాటేలో సత్తాచాటిన ఫిలింనగర్ విద్యార్థులు

ఫిలింనగర్: ఫిలింనగర్ డ్రాగన్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు కూకట్‌పల్లిలో జరిగిన సెకండ్ నేషనల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో సత్తా చాటారు. సోమవారం పతకాలు సాధించిన విద్యార్థులకు ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో కరాటే మాస్టర్లు హనీఫ్, వెంకట్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఫిలింనగర్‌కు చెందిన విద్యార్థులు 15 బంగారు పతకాలు, 10 మంది రజత పతకాలు, 5 మంది కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: ఎలాంటి సమస్య అయినా పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ తదితర విభాగాలకు చెందిన అధికారులతో బేగంపేట డివిజన్ పరిధిలోని చీకోటి గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ముఖ్యంగా ఈ ప్రాంతం లోతట్టు ప్రాంతం కావడంతో వరదనీరు చేరి ముంపునకు గురవుతుండటంతో పాటు తరచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతంలో ఉన్నందున భారీగా వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. వరద నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు సాఫీగా వెళ్లేలా నూతన డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బేగంపేట డివిజన్‌లో ఏ సమస్య తీసుకున్నా శాశ్వతంగా పరిష్కారం జరిగేలా చూశామని పేర్కొన్నారు. శ్యాంలాల్ బిల్డింగ్‌లో ధనియాలగుట్ట శ్మశానవాటికను అన్ని హంగులతో అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. బేగంపేట ప్రధాన నాలా అభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పా రు. దీని ద్వారా నాలా పరీవాహక ప్రాంత ప్రజల ముంపు సమస్య తొలగనున్నదన్నారు. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, సత్యనారాయణ, డీఎంసీ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శిలో 'నల్ల' ఇంధనం!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. డిపాజిట్‌దారులు లిఖితపూర్వకంగా తెలిపే వివరాలను సీఐడీ అధికారులు మరోసారి క్షుణ్నంగా పరిశీలించి వాస్తవికతను నిగ్గు తేలుస్తారు. ఆర్బీఐ, కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు నిబంధనలను ఎందుకు పాటించలేదు? అనే కోణాల్లో విచారణను చేయనున్నారు. తద్వారా నల్లధనం వ్యవహారాలపై ఒక నిర్ధారణకు వచ్చి తదుపరి చర్యలు చేపడతారు.

మూసివేసిన చిట్టీల నిర్వహణకు ప్రత్యేక అధికారి!

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినందున మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన 23 చిట్టీ గ్రూపులను మూసివేయాలని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే ఆదేశించింది. ఆ మేరకు చిట్టీ గ్రూపుల మూసివేత దాదాపు పూర్తయ్యింది. మరిన్ని గ్రూపులను మూసివేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈమేరకు ఇప్పటికే గుర్తించిన అక్రమాలతో నివేదికను రూపొందిస్తున్నారు. మూసివేసిన చిట్టీల నిర్వహణ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక అధీకృత అధికారిని నియమించడానికి సన్నద్ధమవుతున్నారు. మూసివేసిన చిట్టీల గ్రూపుల్లోని చందాదారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లకు చందాలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే చిట్టీ పాట పాడిన చందాదారులు మిగిలిన వాయిదాలను చెల్లించాలి. మూసివేసిన చిట్టీ గ్రూపుల చందాదారులకు వారి మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియ పర్యవేక్షణకు అధీకృత అధికారిని నియమిస్తూ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

చార్జిషీటు వచ్చాక వివేకా హత్య కేసు విచారణ

స్పష్టం చేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ అందిన తర్వాత విచారణ చేపడతామని తెలంగాణ హైకోర్టు చెప్పింది. వివేకా హత్య కేసులో కిరాయి హంతకుడు షేక్ దస్తగిరి (ఏ–4)ని సీబీఐ అప్రూవర్‌గా ప్రకటించి, అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీ కృష్ణారెడ్డి వేర్వేరుగా పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.సురేందర్ మంగళవారం మరోసారి విచారణ జరిపారు. ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేశారు కదా అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. సాంకేతిక అంశాలు సరిగా లేవని సీబీఐ ప్రత్యేక కోర్టు చార్జిషీట్‌ను వెనక్కు ఇచ్చిందని పిటిషనర్ల తరఫు లాయర్లు తెలిపారు. ఆ అంశాలను సరిచేసి మళ్లీ కోర్టుకు అందజేశామని సీబీఐ తెలిపింది. విచారణను న్యాయమూర్తి ఈ నెల 20కి వాయిదా వేశారు.

స్క్రీన్ ప్లే.. రామోజీ
డైరెక్షన్.. చంద్రబాబు
యాక్షన్.. పవన్‌కల్యాణ్

'దుష్ట' పన్నాగం!

సేవామూర్తులపై ఆది నుంచీ దుష్ట చతుష్టయం అక్కసు

పథకం ప్రకారం వ్యవస్థపై విషం..

■ వలంటీర్లు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల పెరిగాయి. వలంటీర్ల వ్యవస్థ ప్రజాస్వామ్యానికే పెను సవాల్‌గా మారింది. ప్రజలు స్వేచ్ఛగా జీవించే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛకు పెను విఘాతంగా మారింది. వలంటీర్ల వ్యవస్థ ప్రజలను భయపెడుతోంది. ఈ వ్యవస్థ ఓ మాఫియాలా మారిందని విపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వలంటీర్ల అరాచకాల గురించి చెబుతూ పోతే పెద్ద గ్రంథమే అవుతుంది.
– 2022 డిసెంబర్ 10న 'ఈనాడు' ప్రత్యేక కథనం.

■ వలంటీర్లనే సమాంతర సర్కారీ వ్యవస్థను సృష్టించి స్వీయ కార్యాలను చక్కబెట్టుకోగలుతున్నారు. వాటికి ప్రజలు మూగ ప్రేక్షకులు, బాధితులు కావాల్సి రావడమే ఆంధ్ర రాష్ట్రానికి పట్టిన ఏలిన నాటి శని మహిమ.
– 2023 మార్చి 3న 'ఈనాడు' ఎడిటోరియల్

■ ఊళ్లల్లో వలంటీర్లు పెద్ద న్యూసెన్స్ అయ్యారు. బ్రిటీష్ వాళ్లకు ఏజెంట్లలా వీళ్ల ప్రభుత్వానికి ఏజెంట్లుగా మారారు. బెదిరింపులు, అవినీతికి పాల్పడుతున్నారు.
– 2021 అక్టోబర్ 30న కుప్పం పర్యటనలో బాబు.

■ వలంటీర్లకు సన్మానమంటూ రూ.233 కోట్లు తగలేస్తూ పండుగ చేసుకుంటున్నారు.
– 2022 ఏప్రిల్ 7న చంద్రబాబు ట్వీట్

■ వలంటీర్ల కథేంటో చూస్తాం. ఆ వ్యవస్థే దండగ. టీడీపీ కార్యకర్తలు వలంటీర్ల లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి పార్టీ ఆఫీసు నంబరుకు వాట్సాప్ చేస్తే వారి సంగతి చూసుకుంటాం. ఈ వివరాలు పంపిన వారికి రూ.10 వేల పారితోషికం కూడా పార్టీ తరఫున ఇస్తాం.
– 2021 మార్చి 29న తిరుపతిలో అచ్చెన్నాయుడు.

■ 'వలంటీర్లు ప్రతి గ్రామంలో ఏ కుటుంబంలో ఆడపిల్లలకు ఏ లోపాలున్నాయి? ఎలాంటి అలవాట్లు ఉన్నాయి? ఎవరైనా ప్రేమిస్తున్నారా? వితంతువులున్నారా?అనే సమాచారాన్నివలంటీర్లు ఇవ్వడంతో మహిళలను ట్రాప్ చేసి కిడ్నాప్ చేస్తున్నారు.
– 2023 జూలై 9న ఏలూరులో పవన్‌కల్యాణ్

సాక్షి, అమరావతి: వలంటీర్ల గురించి ఒక్కమాటలో చెప్పాలంటే సేవామూర్తులు.. సంక్షేమ సారథులు! దేశమంతా వారి పనితీరును మెచ్చుకుంది. కోవిడ్ వేళ మానవతామూర్తులుగా నిలిచిన వలంటీర్ల సేవలను ప్రధాని సైతం అభినందించారు. మూటలు మోసే ఉద్యోగాలని తొలుత వలంటీర్లను తూలనాడిన వారు ఆ తరువాత నోట మాట రాక సర్దుకున్నారు. నాలుగేళ్లలో కోట్ల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.25 లక్షల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా జమ చేయడం వెనుక ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించిన వలంటీర్ల కృషి దాగి ఉంది. ఇంత సంక్షేమం సాకారం కావడం.. ప్రతి ఇల్లూ లబ్ధి పొందిన సంతోషంతో కళకళలాడటం దుష్ట చతుష్టయానికి మింగుడు పడటం లేదు! వలంటీర్ వ్యవస్థపై ఓ పథకం ప్రకారం బురద చల్లుతూ యాక్షన్‌లోకి దిగాయి! పాత కథనాలను వల్లె వేస్తూ స్క్రిప్ట్ ప్రకారం తమతమ పాత్రలను పక్కాగా పోషిస్తున్నాయి! అందులో తాజా అంకమే వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులతో పోలుస్తూ జనసేనాని తన శక్తిమేరకు ఈ డ్రామాను రక్తి కట్టించడం!!



పశ్చిమగోదావరి జిల్లా తణుకులో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసిన వలంటీర్లు

మహమ్మారికి ముకుతాడు..

2019 ఆగస్టు 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన వలంటీర్ల వ్యవస్థ తమ అత్యుత్తమ సేవలతో రాష్ట్ర ప్రజలందరి మన్ననలు పొందడమే కాకుండా దేశానికే ఆదర్శంగా మారింది. పాలనలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు, పట్టణ ప్రాంతాల్లో 70–100 ఇళ్లకు ఒకరు చొప్పున వలంటీర్ల నియామకంతో పాలనలో వేగం పెరిగి ఏ కార్యక్రమమైనా గంటల వ్యవధిలోనే ప్రజల చెంతకు చేరేందుకు దోహదపడింది. కరోనా సమయంలో సర్వే ద్వారా బాధితులను మూడు రోజుల వ్యవధిలోనే గుర్తించి మహమ్మారికి అడ్డుకట్ట వేసేందుకు తోడ్పడింది. కోవిడ్ బారినపడ్డ వారి వద్దకు వెళ్లేందుకు సొంత కుటుంబ సభ్యులే జంకినా వలంటీర్లు మాత్రం వెనుకాడలేదు. ఎప్పటికప్పుడు వ్యాధి సోకినవారిని గుర్తిస్తూ వైద్య సేవలను అందచేయడం ద్వారా ప్రాణాలను కాపాడారు. 4నెలల వ్యవధిలో 14 విడతలు ఫీవర్ సర్వే నిర్వహించి సమర్థంగా కోవిడ్‌ను కట్టడి చేయగలిగారు. వలంటీర్ల వ్యవస్థ క్షేత్రస్థాయిలో అత్యంత సమర్థంగా పనిచేయడం ద్వారా ఒకే రోజు రికార్డు స్థాయిలో 13.59 లక్షల మందికి వ్యాక్సిన్లను ప్రభుత్వం అందజేసింది.కరోనా సమయంలో వలంటీర్ల సేవలను ప్రధాని మోదీ సైతం ప్రశంసించారు.

పడిగాపులు లేవు.. పలకరింపులే

గతంలో అవ్వాతాతలు పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే నడవలేని పరిస్థితిలో కూడా కచ్చితంగా రావాల్సిన దుస్థితి. ఆత్మగౌరవాన్ని చంపుకుంటూ ఎక్కడిస్తారో అంతుబట్టక ప్రతి నెలా కార్యాలయాల వద్ద దయనీయంగా పడిగాపులు కాయాల్సి వచ్చేది. అలాంటిది ఇప్పుడు వలంటీర్లు టంచన్‌గా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చిరునవ్వుతో పలకరిస్తూ వైఎస్సార్ పెన్షన్ కానుక సొమ్మును అందజేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి నెలా మొదటి తారీఖునే దాదాపు 64 లక్షల మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఏ చిన్న ఇబ్బందీ కలుగకుండా దాదాపు రూ.1,750 కోట్లు వలంటీర్ల ద్వారా వారి చేతికి అందుతున్నాయి.

నేరుగా, పారదర్శకంగా రూ.2.25 లక్షల కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ విధానంలో 8.06 కోట్ల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.25 లక్షల కోట్లను నేరుగా జమ చేసింది. పథకం అమలు సమయంలో అర్హులకు సమాచారం ఇవ్వడంతోపాటు అనంతరం డబ్బులు అందినట్లు ఈ–కేవైసీ ద్వారా లబ్ధిదారుల నుంచి అంగీకారాన్ని తీసుకుంటున్నారు. తద్వారా పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది.

దేశానికే దిక్సూచిగా..

సంక్షేమ పథకాల అమలుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్‌లు, విద్య, సామాజిక రంగ నిపుణులతో కూడిన కమిటీ వలంటీర్ల పనితీరును పరిశీలించి దేశమంతా అమలు చేయాలని సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. మన రాష్ట్రంలో వలంటీర్ల సేవలను గుర్తించిన కేరళ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అనంతపురం జిల్లాలో పర్యటించిన కర్ణాటక ఐఏఎస్ అధికారుల బృందం తమ రాష్ట్రంలోనూ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుకు అనుగుణంగా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ప్రకటించింది. మహారాష్ట్ర సర్కారు సైతం వలంటీర్ల సేవలకు ప్రశంసించింది.


తప్పు చేస్తున్నారు కాబట్టే మీకు కోపం

వలంటీర్లపై మరోసారి పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వలంటీర్ల వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వలంటీర్లు తన ఫ్లెక్సీలను, బొమ్మలను చెప్పులతో కొట్టడం చూశానని, తప్పు చేస్తున్నారు కాబట్టే వారికి కోపం వచ్చిందని అన్నారు. తాను సరైన పాయింట్ ఎత్తాను కాబట్టే ఈ స్థాయిలో స్పందన వచ్చిందన్నారు. మంగళవారం ఏలూరు నగరంలోని క్రాంతి కల్యాణమండపంలో దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల ముఖ్యనేతలు, మహిళల విస్తృత స్థాయి సమావేశంలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. వలంటీర్లు సేకరించిన డేటా ఎవరికి ఇస్తున్నారు, ఏ డేటా సెంటర్‌కు వెళుతోంది, వైఎస్సార్‌సీపీ ఆఫీసులో ఉందా, జగన్ ఇంట్లో ఉందా, సెక్యూర్ డేటాను ఎక్కడికి పట్టుకుపోతున్నారు, వలంటీర్ ఫోన్ మిస్ అయితే ఎవరు బాధ్యత వహిస్తారు, వలంటీర్ వ్యవస్థ లేకపోతే పాలన ఆగిపోతుందా.. అంటూ ప్రశ్నించారు. రేషన్ వాహనాలు లేకపోతే పంపిణీ ఆగిపోతుందా అని ప్రశ్నించారు. అసలు వలంటీర్ల వ్యవస్థ అర్థం లేనిదన్నారు. వారికి ఎవరూ డేటా ఇవ్వొద్దన్నారు. జనవాణిలో కొందరు తనను కలిసినప్పుడు వలంటీర్లు ఇంటికి వచ్చి తమ ఆడపిల్లలను ఇబ్బంది పెడుతున్నారని చెబితే తనకు ఇదంతా తెలిసిందన్నారు. వ్యక్తిగత వివరాలు, ఆధార్, బ్యాంక్ ఖాతాలో జమ వివరాలు వంటివన్నీ కూడా వలంటీర్లు తెలుసుకుంటున్నారని చెప్పారు.

'సుప్రీం' ఉత్తర్వులన్నా లెక్కలేదా?

మీ ఇష్టం వచ్చినట్లు కూల్చివేస్తారా?.. జీహెచ్‌ఎంసీ అధికారులపై హైకోర్టు మండిపాటు



సాక్షి, హైదరాబాద్: దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను కూడా పట్టించుకోరా? సుప్రీంకోర్టు ఆదేశాలన్నా ఇంత లెక్కలేనితనమా.. అని జీహెచ్‌ఎంసీ అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. ఆదివారం ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని అత్యున్నత న్యాయస్థానం చెప్పినా మీరు కూల్చివేస్తారా అని మండిపడింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దన్న ఈ కోర్టు ఆదేశాలన్నా లెక్కలేదా అని ప్రశ్నించింది. విచారణకు హాజరుకావాలని అధికారులను ఆదేశించినా.. కారణాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు హాజరుకాకుంటే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని.. ఇది కచ్చితంగా కోర్టు ధిక్కరణే అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు ఆదేశించినా జీహెచ్‌ఎంసీ అధికారులు నందకుమార్‌కు చెందిన డెక్కన్ కిచెన్‌ను కూల్చివేశారని పేర్కొంటూ జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్ లో డబ్ల్యూ3 హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కన్నెగంటి లలిత మంగళవారం విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రవితేజ, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రాజ్‌కుమార్‌లకు ఫారమ్–1 (వ్యక్తిగత హాజరు) నోటీసులు జారీ చేసింది. ఇందులో భాగంగా రవితేజ, రాజ్‌కుమార్‌లు కోర్టుకు హాజరయ్యారు. లోకేశ్‌కుమార్ మాత్రం అత్యవసర సమావేశం కారణంగా రావడం లేదని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అంత అత్యవసరంగా ఆదివారం కూల్చివేయాల్సిన అవసరం ఏముంది?. సెలవు రోజుల్లో ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి కదా. ప్రతివాదులందరూ కోర్టు ధిక్కరణ ఎదుర్కోవాల్సిందే. తదుపరి విచారణకు లోకేశ్‌కుమార్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ప్రతివాదులందరూ హాజరుకా వాల్సిందే. కూల్చివేతకు సంబంధించి అనుసరించిన నివేదికను అందజేయాలి' అని ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను గురువారా నికి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో బంజారాహిల్స్ ఎస్‌హెచ్‌ఓ ఎం.నరేందర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా, నటులు వెంకటేశ్, రానా, నిర్మాత సురేశ్‌ను ప్రతివాదులుగా చేరుస్తూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పిటిషనర్ నందకుమార్ పేర్కొన్నారు. వారికి కూడా కోర్టు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

'సుప్రీం'లో ఉండగా, ఇక్కడ విచారణ ఎందుకు?

సాక్షి, హైదరాబాద్: పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై సుప్రీంకోర్టు విచారణ చేస్తున్నప్పుడు ఇక్కడ మళ్లీ అవసరం లేదు కదా అని హైకోర్టు వ్యాఖ్యానించి వాదనలు ముగించింది. పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రాసిన లేఖను హైకోర్టు టేకెన్ అప్ సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రంలో 774 పోలీస్‌స్టేషన్లు ఉండగా, ఇప్పటికే 369 స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మిగతా చోట్ల కూడా ఆ దిశగా పని జరుగుతోందని, ఇదే అంశంపై సుప్రీంకోర్టులోనూ విచారణ సాగుతోందని చెప్పారు. సుప్రీంకోర్టు తదుపరి విచారణ జూలై 25న ఉందని, ఈలోపు మరో 103 స్టేషన్లలో కెమెరాల ఏర్పాటు పూర్తవుతుందని వెల్లడించారు.

నగర వార్తలు

నేడు శోభన్‌బాబు అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

నాగోలు: ప్రముఖ సినీ నటుడు శోభన్‌బాబు అభిమానులకు దూరమై 15 సంవత్సరాలైన సందర్భంగా శోభన్ బాబు అభిమానుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించనున్నారు. నగరంలోని రవీంద్రభారతిలో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని వాణి గిరిజా సంగీత నాటక కళా సమితి అధ్యక్షుడు, శోభన్ బాబు జీవితకాలపు అభిమాని చల్లగాని వెంకట్ రాజు, ఆహ్వాన కమిటీ సభ్యులు మిరియాల చంద్రశేఖర్, గట్ల రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. శోభన్‌బాబు మహోన్నత వ్యక్తిత్వంతో పాటు ఆయన అభిమానుల నిస్వార్థ సేవా నిరతి గురించి వెంకట్ రాజు రాసిన స్థితప్రజ్ఞుడు అనే పుస్తకాన్ని ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ఆవిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

వరద నివారణకు ఏం చర్యలు చేపట్టారు?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో హైదరాబాద్‌లో వరద నివారణకు, ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఏం చర్యలు చేపట్టారో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, హెచ్‌ఎండీఏ మేనేజింగ్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి వివరాలు అందజేయాలని పేర్కొంది. విచారణను ఆగస్టు 28కి వాయిదా వేసింది.

'హైదరాబాద్ కళాసిగూడలో ఏప్రిల్‌లో పాల ప్యాకెట్ కోసమని బయటకు వెళ్లిన 11 ఏళ్ల చిన్నారి మౌనిక నీటితో నిండి ఉన్న గుంతలో పడి.. నాలాలో కొట్టుకుపోయి మృతి చెందింది. అలాగే జూబ్లీహిల్స్ ప్రాంతంలో వివేక్ అనే ఆరేళ్ల బాలుడు నీటి గుంతలో పడి మరణించాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ రెండు ఘటనలు జరిగాయి. వరదల నివారణకు ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టలేదు. జీహెచ్‌ఎంసీ కూడా తమకూ ఏం పట్టనట్టే వ్యవహరించింది. దీని కారణంగా హైదరాబాద్‌లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు' అని పేర్కొంటూ వచ్చిన లేఖను హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టి.. పైవిధంగా ఆదేశాలు జారీ చేసింది.

తండ్రి అనుమానమే నిజమైంది

ప్రియుడి మోజులో కన్నకూతుర్ని తల్లే చంపేసింది

- ఊపిరాడకుండా చేసి ఉసురు తీసింది
- చిన్నారి తన్విత మృతి కేసులో వెలుగు చూసిన వాస్తవం


తన్విత (ఫైల్)


వివరాలు వెల్లడిస్తున్న కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఎస్‌ఐ షఫీ

కుషాయిగూడ: ప్రియుడిపై మోజుతో కన్నబిడ్డనే కడతేర్చిందో కసాయి. ఆ తర్వాత అనారోగ్యంతో మృతి చెందినట్టు చిత్రీకరించేందుకు యత్నించి అడ్డంగా దొరికిపోయింది. కూతురు మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి చేసిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు కన్న తల్లే ఈ దారుణానికి పాల్పడినట్టు తేల్చారు. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం... కుషాయిగూడకు చెందిన నాయక్‌వడి రమేష్ (30) కల్యాణి 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగున్నరేళ్ల కూతురు తన్విత సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో 2021 నుంచి ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. రమేష్ డ్రైవర్‌గా పనిచేస్తూ తల్లి, తమ్ముడితో కలిసి ఉంటుండగా, కల్యాణి కుషాయిగూడ మార్కెట్‌లో పని చేస్తూ.. సమీపంలో కూతురు తన్వితతో కలిసి ఉంటోంది. ఈ నెల 1న కల్యాణి కూతురు తన్వితకు ఆరోగ్యం బాగోలేదని ఆసుపత్రికి తీసుకెళ్తున్నామని భర్తకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో అంతా కలిసి ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే వైద్యులు తన్విత చనిపోయినట్లు ప్రకటించారు. రోజూ మాదిరిగానే స్కూల్‌కు వెళ్లి వచ్చిన కూతురు భోజనం చేసి పడుకుందని, నిద్రలోనే ఇలా జరిగిందని కల్యాణి అందరినీ నమ్మించింది.

అనుమానంతో ఫిర్యాదు...

భార్య తీరుపై అనుమానం కలిగిన తండ్రి రమేష్ తన కూతురు చనిపోలేదని, చంపేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం రిపోర్ట్‌లో ఊపిరాడకపోవడంతో చిన్నారి చనిపోయినట్టు వెల్లడైంది. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా వాస్తవం వెలుగులోకి వచ్చింది.

అడ్డు తొలగించుకోవాలని...

కల్యాణికి జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన ఇండ్ల నవీన్‌కుమార్ (19) అనే దూరపు బంధువుతో పరిచయం ఏర్పడింది. కుషాయిగూడలో కూతురుతో కలిసి ఉంటున్న కల్యాణి వద్దను అతను తరచూ వచ్చేవాడు. ఇద్దరు పెళ్లి చేసుకుందామనుకున్నారు. కల్యాణి భర్తకు విడాకులిచ్చి ప్రియుడిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంది. విడాకులు సాధ్యం కాకపోవడంతో కూతురు తన్వితను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 1న స్కూల్‌కు వెళ్లి వచ్చిన తన్విత నిద్రలో ఉండగా ముందే వేసుకున్న ప్లాన్ ప్రకారం ముఖంపై బెడ్‌షీట్ కప్పి దిండుతో అదిమిపట్టి ఊపిరాడకుండా చేసి చంపేసింది. నిందితులు కల్యాణి, నవీన్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. చిన్నారి హత్య కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ షేక్ షఫీలను డీసీపీ జానకి, ఏసీపీ వెంకట్‌రెడ్డి అభినందించారు.

మొహర్రం నేపథ్యంలో భారీ బందోబస్తు

నగర సీపీ సీవీ ఆనంద్ వెల్లడి

చార్మినార్: షియా ముస్లింలు నిర్వహించే మొహర్రం సంతాప దినాలకు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ తెలిపారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో సంబంధిత ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో పాటు షియా ముస్లిం మత పెద్దలతో మొహర్రం ఏర్పాట్లపై కో–ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ నెల 19వ తేదీన వివిధ ఆషూర్‌ఖానాలలో ప్రతిష్ఠించే ఆలంల ఏర్పాట్లు, నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ ఆనంద్ మాట్లాడుతూ మొహర్రం సంతాప దినాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే సంబంధిత మంత్రులు, మైనార్టీ వెల్ఫేర్, వక్ఫ్‌బోర్డు, హోం డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తగిన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. 29వ తేదీన మొహర్రం సామూహిక ఊరేగింపు ఉంటుందన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రోడ్ల మరమ్మతులు, విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో వీధి లైట్ల ఏర్పాట్లు, మరమ్మతులు, జలమండలి ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం, మురుగునీటి పారుదల సమస్యల పరిష్కరించడానికి ఇప్పటికే కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ జాయింట్ సీపీ ఎం.శ్రీనివాస్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, తూర్పు, దక్షిణ మండలం డీసీపీ రూపేష్, పశ్చిమ, దక్షిణ మండలం డీసీపీ కిరణ్ ప్రభాకర్, నగర ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్‌లతో పాటు ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హఫందీ, కార్పొరేటర్లు, షియా ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


సాలార్‌జంగ్ మ్యూజియం సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఆనంద్



సీఎంకు కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మెడికల్ కళాశాలను మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మంగళవారం సచివాలయంలో సీఎం కేసీఆర్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఈ ప్రాంతంలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.
– సాక్షి, సిటీబ్యూరో

అందరి సహకారంతో బోనాల జాతర విజయవంతం

ఉజ్జయినీ మహంకాళిని 30 లక్షల మంది దర్శించుకున్నారు: మంత్రి తలసాని


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట: రెండు రోజుల పాటు సాగిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతరలో సుమారు 30 లక్షల మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇంత పెద్ద జాతరలో ఏ ఒక్క సంఘట జరుగకుండా అన్ని శాఖల అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకులంతా సహకరించారన్నారు. ఆయన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పోలీసులు గత వారం రోజుల నుంచి 24 గంటలు పనిచేస్తూ ఏ చిన్న సంఘటనా జరుగకుండా బందోబస్తు నిర్వహించారన్నారు. దక్కన్ మానవ సేవా సమితి, భారత్ స్కౌట్స్, ఆర్య సమాజ్ లాంటి స్వచ్ఛంద సంస్థలు కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా సేవలు అందించారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బోనాల జాతరను వైభవంగా నిర్వహిస్తుండటంతో విశ్వవ్యాప్తం కావడంతో విదేశాల్లో సైతం అమ్మవారి జాతరను వీక్షిస్తున్నారన్నారు. భక్తులు, ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు కూడా పోలీసులు, అధికారులకు సహకరించి విజయవంతం చేశారన్నారు. పాత బస్తీ నుంచి బోనాల ఉత్సవాలు తిలకించేందుకు వచ్చి విద్యుత్ షాక్‌తో మరణించిన ఠాకూర్ ఆకాశ్‌సింగ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాస్, చైర్మన్ సురిటి రామేశ్వర్, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అరుణగౌడ్, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

20,21 తేదీల్లో మార్కెటింగ్, టెక్నాలజీ ఎలివేట్ ఎక్స్‌పో


ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

రాయదుర్గం: దక్షిణ భారత దేశంలో నిర్వహించనున్న అతిపెద్ద మార్కెటింగ్, టెక్నాలజీ ఎలివేట్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ మంగళవారం హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో జరిగింది. రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత తౌటం సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈథోస్ ఇమాజినేషన్ నిర్వహించే ఈ ఎక్స్‌పోను ఈ నెల 20, 21 తేదీల్లో రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్, శాంతతౌటం మాట్లాడుతూ, దక్షిణ భారత దేశంలోని అతిపెద్ద మార్కెటింగ్, సాంకేతికత ఈవెంట్ ఎలివేట్ ఎక్స్‌పోను నగరంలో ఏర్పాటు చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఈథోస్ ఇమాజినేషన్ వ్యవస్థాపకుడు, సీఈఓ వరప్రసాద్ మాట్లాడుతూ, రెండు రోజుల పాటు సాగే ఈ ఎక్స్‌పోలో డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా స్ట్రాటజీలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, ఈ–కామర్స్ ట్రెండ్స్, డేటా అనలిటిక్స్ వంటి అంశాలపై నిపుణుల కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు ఉంటాయన్నారు.

వెంచర్ల పేరిట మోసం

- రూ.3 కోట్ల మేర వసూలు చేసిన రియల్టర్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

వెంగళరావునగర్: అనుమతులు లేకుండా వెంచర్లు వేయడమే కాకుండా కస్టమర్స్ నుంచి 3 కోట్ల రూపాయలకు పైగా తీసుకుని ఓ రియల్టర్ మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మధురానగర్‌లోని సాయి సూర్య డెవలపర్స్ గ్రీన్ మెడోస్ పేరుతో కంచర్ల సతీష్ చంద్ర గుప్తా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. 2021 జనవరి నెలలో సంగారెడ్డి జిల్లా కంచర్లగూడ సమీపంలోని భానూర్ వద్ద లేఅవుట్లు వేశామని, తమకు ప్రభుత్వం నుంచి అప్రూవల్ కూడా లభించిందని చెప్పి కస్టమర్స్ నుంచి ప్లాట్ల కొనుగోలు కోసం తమ ఏజెంట్ల ద్వారా డబ్బులు వసూలు చేసుకున్నాడు. వాస్తవానికి అతనికి ఎలాంటి అనుమతులు రాలేదని వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అదే ఏడాది ఏప్రిల్ నెలలో గచ్చిబౌలిలో నివాసం ఉండే నక్కా విష్ణువర్ధన్ అతని స్నేహితులు మరో పది మంది ప్లాట్ల కోసం సతీష్‌చంద్ర ఏజెంట్ల ద్వారా దాదాపు రూ.3 కోట్ల 21 లక్షల 34 వేల వరకు చెల్లించారు. రెండు నెలల్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తామని ఆ సమయంలో సతీష్‌చంద్ర హామీ ఇచ్చాడు. అయితే ఇప్పటి వరకు కూడా ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయలేదు. ఇదిగో అదిగో అంటూ తిప్పడం ప్రారంభించాడు. తమ నగదును తిరిగి ఇవ్వమని అడిగినా ఇవ్వలేదు. వాస్తవానికి అప్పటికే ఆ ప్లాట్లను వేరేవారికి విక్రయించినట్లు ఇటీవల బాధితులు తెలుసుకున్నారు. దాంతో మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 12-7-2023

పరిశోధనను సేవబాట పట్టించింది

*** నిఖిల గోవతి**

డిగ్రీలు చేసి, ఉద్యోగాలు చూసుకొని స్థిరపడిపోవడం గురించి ఆలోచిస్తుంటారు చాలా మంది. తమ చదువు పేదలకు ఉపయోగపడితే ఎంతో మేలు అని ఆశిస్తుంటారు కొంతమంది. అలాంటి కోవకి చెందుతుంది కర్పూరం గోవతి నిఖిల. సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో ఉండే నిఖిల గుర్గావ్ మేదాంత ది మెడిసిటీ హాస్పిటల్‌లో డిస్‌ఫేజియా స్పెషలిస్ట్‌గా పరిశోధనలు చేస్తోంది. గోవతి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు 5వేల మంది పేదవారికి కంటి, గుండె, క్యాన్సర్ చికిత్సలలో సహాయసహకారాలు అందించింది. ఈ యేడాది యంగెస్ట్ రీసెర్చర్ ఇన్ డిస్‌ఫేజియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, భారత్ గౌరవరత్న శ్రీ సమ్మాన్ కౌన్సిల్ అవార్డులు పొందింది. ఈ సందర్భంగా మాట్లాడినప్పుడు ఎన్నో విషయాలను ఇలా పంచుకుంది.

''తెలియని తపన నన్ను ఓ కొత్త మార్గంవైపు నడిపించింది. పరిశోధనల వైపుగా అడుగులు వేయించింది. ఈ మూడేళ్లలో 5 వేల మందికి సాయం చేసేలా మార్చింది. బీఎస్సీ ఆడియాలజీ పూర్తయ్యాక ఎమ్మెస్సీలో చేరాను. ఫైనల్ ఇయర్ ఎగ్జామ్ పూర్తవగానే మేదాంత హాస్పిటల్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది తమ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరమని. కాలేజీలో కండక్ట్ చేసిన ఎగ్జామ్స్ నుంచి వచ్చిన అవకాశమని తెలిసి చాలా ఆనందించాను.

పరిశోధనలో..

అనేక ఆరోగ్య సమస్యలలో ముఖ్యంగా నిమోనియా, గుండెకు సంబంధించిన చికిత్సలు జరిగినప్పుడు కొన్నాళ్ల వరకు ఆహారాన్ని మింగడంలో కలిగే ఇబ్బందుల కారణంగా మరణాల రేటు పెరుగుతోందని మా పరిశోధనలో తేలింది. న్యూరో పేషంట్స్‌లో 80 శాతం డిస్‌ఫేజియా సమస్య ఉంటుంది. ఆహారాన్ని మింగే పద్ధతిలో తేడా ఉంటే ఆ ఆహారం నేరుగా లంగ్స్‌లోకి చేరి, ప్రమాదం కలుగుతుంది. అందుకని ఈ పేషెంట్స్‌కు, వీళ్లను చూసుకునేవారికి ఏ విధంగా ఆహారాన్ని తీసుకోవాలనే విషయాల మీద గైడెన్స్ ఇస్తుంటాను. ఈ వైపుగా మన దగ్గర ఇంకా ఆలోచన పెరగలేదు. అమెరికాలో ఈ విషయాలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. దీంతో ఈ విభాగంలో నాకు ఆసక్తి కలిగింది. లోతుగా పరిశోధనలు చేయడం మొదలు పెట్టాను. నాకు అడ్వైజ్ చేసే డాక్టర్లు, ప్రొఫెసర్ల సలహాలు మరెన్నో విషయాలను పరిచయం చేసింది. ఢిల్లీ సమీపంలోని హాస్పిటల్ కావడంతో వచ్చే పేషెంట్స్ సంఖ్య కూడా ఎక్కువే. ప్రతి ఒక్క పేషెంట్ నుంచి వారి ఆరోగ్యసమస్యల ద్వారా తెలుసుకునే విషయాలు ఎన్నో ఉంటాయి. అలా నా పరిశోధనకు సంబంధించి 31 ఆర్టికల్స్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. జైపూర్, రాజస్థాన్, యూపీ నుంచి వచ్చే స్టూడెంట్స్‌కు సెషన్స్ కండక్ట్ చేస్తుంటాను.

కరోనా నుంచి..

అవసరమైన వారికి సాధ్యమైనంత వరకు నా స్నేహబృందంతో సాయం అందిస్తూ వచ్చాను. అప్పటి నుంచి కంటి, గుండె చికిత్సలు, నిమోనియా, పార్కిన్‌సన్స్, నీ రీప్లేస్‌మెంట్, న్యూరో డిజార్డర్స్ వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి డాక్టర్లతో మాట్లాడి ఫీజు తగ్గింపులో సాయం చేస్తుండేదాన్ని. కోవిడ్ పేషెంట్స్‌పైన రీసెర్చ్ చేసినప్పుడు మరణాలు పెరగడానికి అందరికీ ఒకే విధమైన చికిత్స అందించడం సరికాదని తెలుసుకున్నాను.

ప్రతి ఒక్కరూ భిన్నంగా చికిత్స చేయాలనే అంశాల మీద చేసిన రీసెర్చ్ పేపర్స్‌కి మంచి ప్రశంసలు అందాయి. ఈ సమయంలోనే ఫౌండేషన్‌గా సేవలను ఒక గ్రూప్‌కిందకు తీసుకురావాలనిపించింది. అందుకు, మా ప్రొఫెసర్లు, కుటుంబసభ్యుల సపోర్ట్ ఉంది.

అభ్యర్థన మేరకు

ప్రభుత్వ, కార్పొరేట్ హాస్పిటల్స్‌లోని డాక్టర్స్ నెట్‌వర్క్ నుంచి పరిచయాలు ఉన్నాయి. వారిని అభ్యర్థించి పేదవాళ్లలో ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు సూచించడం, వారి చేత హెల్త్ క్యాంపులు నిర్వహించడం చేస్తుంటాను. ఏయే సమయాల్లో క్యాంపులను నిర్వహించాలో ముందే ప్లానింగ్ ఉంటుంది కాబట్టి, దానిని అనుసరించి డాక్టర్లను అభ్యర్థిస్తుంటాను. మా నాన్న హరిరాజ్ కుమార్ రేషన్ షాప్ నిర్వహిస్తుంటారు. అక్కడకు వచ్చేవాళ్లలో దాదాపు పేదవాళ్లే ఉంటారు. వాళ్లకు అవసరమయ్యేలా క్యాంపులు నిర్వహించాను. నోటి మాట ద్వారా సాయం చేస్తూ వెళ్లడమే. దీని కోసం నేనేమీ డబ్బులు ఖర్చు పెట్టడం లేదు. ఎవరి నుంచీ సాయం తీసుకోవడం లేదు. నాకున్న నెట్‌వర్క్ ద్వారా నోటి మాట ద్వారా సాయం చేయడం ప్రస్తుతం చేస్తున్న పని. మెడిసిన్స్ అవసరం ఉన్న పేషెంట్స్‌కు జెనెరిక్ మెడిసిన్ ద్వారా సర్వీస్ చేయడం, నర్సుల సాయం తీసుకోవడం వంటివీ జరుగుతుంటాయి. నా టీమ్‌లో అందరూ స్వచ్ఛందంగా సేవ చేసేవారే. ఇంటి వద్ద ఉన్నప్పుడే కాదు గుర్గావ్‌లో ఉన్నా ఫోన్ కాల్ ద్వారా అవసరమైన వారికి అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తుంటాను'' అని వివరించింది నిఖిల.

– నిర్మలారెడ్డి

ఒప్పించి.. మెప్పించాను..

అమ్మనాన్నలు ఇంజనీరింగ్ చేసి త్వరగా స్థిరపడిపోతే చాలు అనుకునేవారు. కానీ, అనుకోకుండా మెడికల్ వైపుగా వచ్చాను. ఎమ్మెస్సీ తర్వాత గుర్గావ్‌లో ఇంటర్వ్యూ ఉందనే విషయం కూడా ఇంట్లో చెప్పలేదు, వద్దంటారు అనే ఆలోచనతో. అమ్మమ్మతో కలిసి ఢిల్లీ టూర్ వెళతాను అని ఒప్పించి వెళ్లాను. అక్కడ మొదటాలో సీట్ వచ్చాక అప్పుడు విషయాన్ని చెప్పాను. నాకున్న ఆసక్తిని చూసి అమ్మనాన్నలు సరే అన్నారు. కూతురు అంత దూరంలో ఎలా ఉంటుందో అనే బెంగ వాళ్లను ఒప్పుకోనివ్వదని ఆ పని చేశాను. ఇప్పుడు నేను చేస్తున్న రీసెర్చ్‌కి, సర్వీస్‌కు అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. నాకు ఇంత మంచి గుర్తింపు రావడం గర్వంగా భావిస్తుంటారు.

– డా.కర్పూరం గోవతి నిఖిల



● నిఖిల గోవతి

కుంగుబాటు కుండతో మాయం

ఏదైనా సమస్య ఎదురైతే చాలామంది దాని నుంచి దూరంగా పారిపోవడానికి చూస్తారు. కొంతమంది మాత్రం సమస్యను అధిగమించేందుకు రకరకాల మార్గాలు వెదుకుతారు. అలా వెతికిన వారికి .. పరిష్కారం తప్పకుండా దొరుకుతుందని చెబుతోంది సైమాషఫీ. డిప్రెషన్ నుంచి బయటపడేందుకు సైమా చేసిన ప్రయత్నం నేడు మరికొంతమందికి ఉపాధి కల్పించడంతోపాటు, కనుమరుగైపోతున్న కళకు జీవం పోస్తోంది.

కశ్మీర్‌కు చెందిన 33 ఏళ్ల సైమాషఫీ జమ్ము అండ్ కశ్మీర్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఎందుకో తనకి తెలియకుండానే మనసులో నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. వాటి నుంచి ఎలాగైనా బయట పడాలని రకరకాలుగా ప్రయత్నించేది. ఒకరోజు చైనా తత్త్వవేత్త చెప్పిన ''మట్టిని పాత్రగా మలిచినప్పటికీ, మనం ఏం కోరుకుంటామో దానితోనే ఆ పాత్రలోని శూన్యం నిండుతుంది'' అన్న కొటేషన్ గుర్తుకొచ్చింది. దీంతో తన డిప్రెషన్‌ను కుండలో నింపాలని నిర్ణయించుకుంది సైమా.



చిన్నప్పటి నుంచి మట్టి అంటే సైమాకు ఇష్టం. డిప్రెషన్ నుంచి బయటపడేందుకు.. మట్టితో కుండలేగాక, బొమ్మలు కూడా తయారు చేయాలని నిర్ణయించుకుంది. అనుకున్న వెంటనే మట్టి కుండల తయారీకి పూనుకుంది. కశ్మీరి వ్యాలీలో కుండల తయారీ శిక్షణ ఇచ్చేవారు లేరు. పైగా కుండల తయారీ, కుండలకు వేసే రంగులకు సైతం అధునాతన పద్ధతులను జోడించాల్సిన అవసరం ఉందని గుర్తించింది. కుండల తయారీ ఒక కళే కాదు సంప్రదాయంలో భాగం. అది అంతరించకూడదు అనుకుని... కుండల తయారీకి ఎలక్ట్రిక్ చక్రం, గ్యాస్ బట్టీ తీసుకురావాలనుకుంది. కానీ కశ్మీర్‌లోయలో అవి ఎక్కడా దొరకలేదు.

బెంగళూరులో శిక్షణ

కుండల తయారీలో శిక్షణ తీసుకునేందుకు బెంగళూరు వెళ్లింది. అక్కడ కుండల తయారీలో క్రాష్ కోర్సు చేసి వివిధ ఆకారాల్లో కుండలు ఎలా తయారు చేయాలో నేర్చుకోవడంతోపాటు, కశ్మీరీలు వాడే సంప్రదాయ పాత్రల తయారీని సైతం నేర్చుకుని అధునాతన సాంకేతికత జోడించి కుండల తయారీని ప్రారంభించింది. రకరకాల కుండలను తయారు చేసి విక్రయిస్తూనే, మరోపక్క కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న కుండల తయారీ కేంద్రాలను సందర్శించి అనుభవం కలిగిన నిపుణులతో వర్క్‌షాపులు నిర్వహించేది. ఇలా కుండల తయారీలో సరికొత్త పద్ధతుల గురించి అవగాహన కల్పిస్తోంది. వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ కశ్మీరి కుండలను ఎలా పరిరక్షించుకోవాలో చెబుతోంది. తన కుండల తయారీ జర్నీ గురించి వివరిస్తూ... అందరిలో స్ఫూర్తి నింపుతోంది.

ప్రభుత్వ సహకారంతో..

కశ్మీరీ సనాతన కుండల తయారీని కాపాడుతోన్న విషయం అక్కడి ప్రభుత్వానికి తెలియడంతో స్టేట్ హ్యాండీ క్రాఫ్ట్స్ విభాగం సైమాతో.. తన అనుభవాలను ఇతర కళాకారులకు చెబుతూ సలహాలు సూచనలు ఇప్పిస్తోంది. దీంతో కుండల పునరుద్ధరణకు మంచి స్పందన లభిస్తోంది. అంతేగాక నైపుణ్యం గల కళాకారుల డేటాను హస్తకళల శాఖాధికారులు సేకరిస్తున్నారు. సైమా గురించి తెలిసిన చాలామంది యువతీ యువకులు కుండల తయారీ మొదలు పెట్టి ఉపాధి పొందుతున్నారు.



● సైమా షఫీ

థ్రెడ్స్ యువతరం కొత్త చుట్టం

యూత్ పల్స్



మెటా వారి 'థ్రెడ్స్' ట్విట్టర్-కిల్లర్ అవుతుందా లేదా అనేది తెలియదుగానీ ఈ యాప్‌పై యువత అమిత ఆసక్తి ప్రదర్శిస్తోంది. ట్విట్టర్ కంటే 'థ్రెడ్స్' ఏ రకంగా భిన్నమైనది అనే విశ్లేషణ ఒక కోణం అయితే, కొత్తవాటిపై సహజమైన ఆసక్తి మరో కోణం...

మెటా వారి టెక్స్ ఆధారిత సంభాషణ యాప్ 'థ్రెడ్స్' ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్‌లకు అందుబాటులోకి వచ్చింది. యాప్ మొదలైన రెండు గంటలోనే ఇరవై లక్షల మంది యూజర్‌లు సైనప్ అయ్యారు. నాలుగు గంటలలో ఆ సంఖ్య యాభై లక్షలకు చేరడం చూస్తుంటే థ్రెడ్స్ 'ట్విట్టర్'కు గట్టిపోటీ ఇవ్వనుందనే విషయం అర్థమవుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా వందకు పైగా దేశాల్లో అందుబాటులోకి వచ్చిన 'థ్రెడ్స్' డేటా ప్రైవసీ నిబంధనల కారణంగా యూరప్‌లో అందుబాటులోకి రాలేదు.

థ్రెడ్స్‌కు సంబంధించి ఇన్‌స్టాగ్రామ్ యూజర్‌లు తమ యూజర్ నేమ్ కొనసాగించవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లోని రెడీ-మేడ్ యూజర్ బేస్ వల్ల 'థ్రెడ్స్' ట్విట్టర్‌ని మించిపోతుంది అనే అంచనా ఉంది.

'థ్రెడ్స్‌పై యూత్ ఆసక్తి ప్రదర్శించడానికి కారణం ఏమిటి?' అనే ప్రశ్నకు దేశంలోని వివిధ నగరాలకు చెందిన యువగళాల మాటల్లోనే జవాబు దొరుకుతుంది.

'ట్విట్టర్ ఎలాన్ మస్క్ అధీనంలోకి వచ్చిన తరువాత ప్రయోజనకరమైన మార్పుల కంటే అవసరం లేని మార్పులే ఎక్కువ జరిగాయి. యూజర్‌ల ట్వీట్ల మీద ఆంక్షలు, బ్లూటిక్స్ పై కొత్త రూల్స్... మొదలైనవి చిరాకు తెప్పించాయి' అంటుంది ముంబైకి చెందిన ఎంబీఏ స్టూడెంట్ మనీష.

'థ్రెడ్స్ అనేది ట్విట్టర్‌కు కాపీ-పేస్ట్' అనే విమర్శ మాట ఎలా ఉన్నా 'ట్విట్టర్‌తో పోల్చితే భిన్నంగా ఉంది' అని చెప్పుకోవడానికి కొన్ని అంశాలు ఉన్నాయి.

'జుకర్ బర్గ్ కాపీ-పేస్ట్ విధానాన్ని నమ్ముకొని బాహుబలి లాంటి ట్విట్టర్‌ను ఢీ కొనడానికి రంగంలోకి దిగుతాడని నేను అనుకోవడం లేదు. ట్విట్టర్‌తో పోల్చితే థ్రెడ్స్ కచ్చితంగా భిన్నంగా ఉంటుంది. థ్రెడ్స్‌లో పోస్ట్ చేసే వీడియోల నిడివి అయిదు నిమిషాలు. ట్విట్టర్‌లో అయితే రెండు నిమిషాల ఇరవై సెకండ్లు. థ్రెడ్స్‌లో పోస్ట్ పరిమితి అయిదు వందల. ట్విట్టర్‌లో రెండు వందల ఎనభై. భవిష్యత్తులో మరిన్ని మార్పులు జరగవచ్చు' అంటుంది చెన్నైకి చెందిన ఇంజినీరింగ్ స్టూడెంట్ చైత్ర.

'థ్రెడ్స్'లోని వినూత్నమైన ఫీచర్ 'ఫెడివర్స్' యూత్‌కు నచ్చింది. ఆల్టర్‌నేటివ్ మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ 'మాస్టడన్'లాంటి వాటితో 'థ్రెడ్స్' యూజర్‌లు ఇంటరాక్ట్ కావచ్చు. ఎప్పటికప్పుడు ప్లాట్‌ఫామ్ మైగ్రేషన్‌లో యూత్ చురుగ్గా ఉంటుంది.

'యూనివర్శిటీ ఆఫ్ కొలరాడో బౌండర్'కు చెందిన ప్రొఫెసర్ కేసీ ఫైస్లర్ ఆన్‌లైన్ కమ్యూనిటీని లోతుగా అధ్యయనం చేసిన 'ఇన్ఫర్‌మేషన్ సైంటిస్ట్'గా పేరు తెచ్చుకుంది. 'ప్లాట్‌ఫామ్ మైగ్రేషన్స్' గురించి రీసెర్చ్ ప్రాజెక్ట్ చేసింది.

'ప్లాట్‌ఫామ్‌ను ఎందుకు మార్చారు? మార్చడం ద్వారా ఎదురైన సవాళ్లు, అనుభవాలు' అనే అంశంపై యువతరంలో ఎంతోమందితో మాట్లాడింది.


'ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పడిపోయే పరిస్థితుల్లో ఉన్నప్పుడు అందులోని ఆన్‌లైన్ కమ్యూనిటీ తట్టాబుట్టా సర్దుకొని కొత్త ప్లాట్‌ఫామ్‌లోకి వెళుతుంది. మైగ్రేషన్‌కు సంబంధించి తొలి దశలో కొత్త ప్లాట్‌ఫామ్ గురించి ప్రోత్సాహకరంగా మాట్లాడుకుంటారు. ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. అందరి కంటే ముందు తామే ఉండాలనుకునేవారితోపాటు, స్నేహితులు కదిలేవరకు కదలని వారు కూడా ఉంటారు' అంటుంది ఫైస్లర్.

ట్విట్టర్‌తో పోల్చితే హ్యాష్‌ట్యాగ్స్, వెబ్ వెర్షన్, ఎడిట్ పోస్ట్‌లు, డీఎం ఆప్షన్, ఏఐ జనరేటెడ్ ఆల్ట్ టెక్స్, ట్రెండింగ్ టాపిక్స్, క్రోనలాజికల్ ఫీడ్... మొదలైన ఫీచర్స్ 'థ్రెడ్స్'లో లేవు అనే మాట వినిపిస్తోంది. ఎన్నో అంచనాలతో 'థ్రెడ్స్'లోకి వచ్చిన నవతరాన్ని మెటా నిరుత్సాహ పరుస్తుందా? ఒక మీమ్‌లో చూపినట్లు వేగంగా వచ్చిన వాళ్లు అంతే వేగంగా వెళ్లిపోతారా?

'థ్రెడ్స్ ద్వారా జుకర్‌బర్గ్ కచ్చితంగా అద్భుతాలు సృష్టిస్తాడు' అనే ఆశావాదంతో ఎంతకాలమైనా ఎదురుచూసే వాళ్లు ఉంటారా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఓహో జిలేబిబాలా!





ట్విట్టర్ వర్సెస్ థ్రెడ్స్ నేపథ్యంలో యువ నెటిజనులు మీమ్స్, జోక్స్ పేలుస్తున్నారు. 'ఎట్ ది రేట్ ఆఫ్' సింబల్‌ని పోలిన 'థ్రెడ్స్' లోగో అచ్చం జిలేబిలా ఉందని కొందరు రెండు ఫొటోలను పక్కపక్కన పెట్టి పోస్ట్ చేస్తున్నారు. ఒక మీమ్‌లో... ట్విట్టర్ ఆఫీస్ కిటికీ నుంచి మార్క్ జుకర్‌బర్గ్ దొంగచాటుగా తొంగి చూస్తుంటారు. 'థ్రెడ్స్‌లోకి వెళ్లిన వారు కేవలం 5 నిమిషాల తరువాత బ్యాక్ టు ట్విట్టర్ అంటూ ఎలా పరుగెత్తుకు వస్తున్నారో చూడండి' అంటూ ట్విట్టర్ వీరాభిమానులు వీడియో క్లిప్ పోస్ట్ చేశారు. నసీబ్, గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్, సూర్యవంశ్... మొదలైన బాలీవుడ్ సినిమాల క్లిప్‌లకు ట్విట్టర్-థ్రెడ్స్‌కు సంబంధించి ఫన్నీ కామెంట్స్ జత చేస్తున్నారు.

సెంచరీ బామ్మ.. సెన్సేషనల్ టాటూలు!



● అపోవాంగ్ ఓడ్

వోగ్ స్టార్

మౌలిక సదుపాయాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా సరిగా లేని గ్రామంలో ఉన్న వాంగ్ దగ్గర టాటూలు వేయించుకోవడానికి అంతర్జాతీయ ఔత్సాహికులు అమితాసక్తి కనబరుస్తున్నారు. అత్యంత వృద్ధ టాటూ ఆర్టిస్ట్ దగ్గర టాటూ వేసుకోవాలన్న ఆసక్తికి తోడు, వాంగ్ వేసే జామెట్రిక్ డిజైన్స్ కోసం ఎగబడుతున్నారు. ఎన్నో ఏళ్లనాటి కళను సెంచరీ దాటాక కూడా కాపాడుతూ తరువాతి తరాలకు అందిస్తోన్న వాంగ్‌ను 'వోగ్' సత్కరించింది. ఈ ఏడాది ఏప్రిల్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆమె రూపాన్ని చిత్రించింది. ఇప్పటి దాక వోగ్ కవర్‌పేజీపై వచ్చిన అత్యంత వృద్ధ స్టార్‌గా వాంగ్ నిలవడం విశేషం.

ఎంతో ఇష్టమైన పేర్లు, నచ్చిన డిజైన్లను శరీరం మీద పచ్చబొట్టు (టాటూ) వేయించుకోవడం ఇప్పుడు ఫ్యాషన్. ఈ అభిరుచి కొత్తగా వచ్చిందేం కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గిరిజన తెగల సంస్కృతి, సంప్రదాయాల్లో వందల ఏళ్లుగా భాగంగా ఉన్నదే. ఇప్పుడు టాటూలు వేయడానికి వాడుతోన్న సూదులు, టాటూ గన్‌లకు బదులు.. అప్పట్లో పదునైన గులాబీ ముళ్లు, సొరచేప పళ్లతో టాటూలు వేసేవాళ్లు. అప్పటి టాటూ పద్ధతులు చాలా వరకు కనుమరుగయ్యాయి. కానీ వందల ఏళ్లనాటి టాటూ టెక్నిక్‌ను సజీవంగా ఉంచేందుకు కృషిచేస్తోంది అపోవాంగ్ ఓడ్. 106 ఏళ్ల వయసులో పురాతన టాటూలను వేస్తూ కళను సజీవంగా ఉంచుతోంది వాంగ్. అంతేగాక ప్రపంచంలో అత్యంత వృద్ధ టాటూ ఆర్టిస్ట్‌గా నిలిచి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

ఫిలిప్పీన్స్‌కు చెందిన అపో వాంగ్ ఓడ్‌ను మరియా ఒగ్గే అని కూడా పిలుస్తారు. మనీలాకు దగ్గరల్లో ఉన్న కలింగా ప్రావిన్స్‌లోని మారుమూల బుస్కలాన్ గ్రామంలో పుట్టి, అక్కడే స్థిరపడింది. టీనేజ్‌లో ఉండగా 'మాంబా బాటక్' అనే టాటూ కళను నేర్చుకుంది. పదహారేళ్ల వయసులో తండ్రితో కలిసి మాంబా బాటక్ వేస్తూ టాటూ ఆర్టిస్ట్‌గా మారింది. అప్పట్లో మాంబా బాటక్ వేయగల ఒకే ఒక మహిళా ఆర్టిస్ట్ అపోవాంగ్. చుట్టుపక్కల గ్రామాలకు సైతం వెళ్లి అక్కడ టాటూలు వేసేది. పురుషుల్లో ధైర్యసాహసాలకు గుర్తుగానూ, యోధులుగా గుర్తింపు పొందిన వారికి, అందాన్ని రెట్టింపు చేసుకోవడానికి మహిళలు ఈ టాటూలు వేయించుకునేవారు.



అలా అప్పటి నుంచి ఇప్పటిదాకా ఏళ్ల తరబడి టాటూలు వేస్తూనే ఉంది వాంగ్.

బొగ్గులో నీళ్లు కలిపి సిరా తయారు చేసి వెదురు పుల్లలు (బ్యాంబూ స్టిక్స్), పంపర పనస ముళ్లతో ఈ టాటూలను వేయడం వాంగ్ ప్రత్యేకత. చుక్కలతో రకరకాల ఆకర్షణీయమైన డిజైన్లు వేస్తుంది. ప్రస్తుతం ఈ టాటూలు వేయడం వచ్చిన వారు ఎవరూ లేరు. వాంగ్ తన తండ్రి దగ్గర నేర్చుకున్న ఈ ఆర్ట్‌ను రక్తసంబంధీకులకు మాత్రమే నేర్పిస్తోంది. వాంగ్‌కు పిల్లలు ఎవరూ లేకపోవడంతో తన మేనకోడలికి మాంబా బాటక్‌లో శిక్షణ ఇస్తోంది.

''ఈ టాటూలు వేసేవాళ్లంతా చనిపోయారు. నేను ఒక్కదాన్నే ఉన్నాను. అయినా నాకు దిగులు లేదు. తరువాతి తరానికి శిక్షణ ఇస్తున్నాను. వాళ్లు టాటూ మాస్టర్స్ అవుతారు'' అని వాంగ్ చెబుతోంది.

వర్షాకాలంలోనూ... నీళ్లు పోస్తేనే పచ్చదనం

బ్యూటిప్స్

వర్షాలు పడుతున్నాయి కదా ఇంక మొక్కలకు నీళ్లు పోయనవసరంలేదని కొంతమంది అనుకుంటారు. కానీ వర్షాల్లో కూడా కొన్నిరకాల మొక్కలకు నీళ్లు పోస్తేనే గార్డెన్ పచ్చగా కళకళలాడుతుంది. అందుకు ఇవే కారణాలు...

● సాధారణంగా మొక్కలకు వర్షాకాలంలో సహజసిద్ధంగా నీళ్లు అందుతాయి. కానీ, కుండీల్లో ఉన్న మట్టి తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచలేకపోతే, మొక్కలు త్వరగా ఎండిపోతాయి. అందువల్ల ఎప్పటికప్పుడు తేమను చూసుకుని మొక్కలకు నీళ్లు పోయాలి.

● కుండీల్లో పెరుగుతోన్న కొన్ని రకాల మొక్కలు చాలా పొడవుగా ఉంటాయి. దట్టంగా ఉన్న ఆకులు, కొమ్మలు కూడా వెడల్పుగా విస్తరించి చినుకులను అడ్డుకుంటాయి. వర్షం చినుకులు కొమ్మలపై పడి పక్కకు జారిపోతాయి. దీనివల్ల వేర్లకు సరిగా నీరు అందదు. అందువల్ల గుబురుగా ఉన్న కుండీ మొక్కలకు తప్పని సరిగా నీళ్లుపోయాలి.





సౌత్‌జోన్ జట్టులో రోహిత్ రాయుడు

దేవధర్ ట్రోఫీ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్ జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన సౌత్ జోన్ జట్టులో హైదరాబాద్‌కు చెందిన రోహిత్ రాయుడు, ఆంధ్ర క్రికెటర్ రికీ భుయ్‌లకు స్థానం లభించింది. మయాంక్ అగర్వాల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ కూడా సౌత్ జోన్ జట్టులోకి ఎంపికయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో అర్జున్ గోవా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దేవధర్ ట్రోఫీ ఈనెల 24 నుంచి ఆగస్టు 3 వరకు పుదుచ్చేరిలో జరుగుతుంది.

సింధు ర్యాంక్‌లో పురోగతి

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పీవీ సింధు మూడు స్థానాలు పురోగతి సాధించి 12వ ర్యాంక్‌కు చేరుకుంది. గతవారం కెనడా ఓపెన్‌లో సింధు సెమీఫైనల్‌కు చేరింది. కెనడా ఓపెన్‌లో పురుషుల సింగిల్స్‌లో విజేతగా నిలిచిన భారత ప్లేయర్ లక్ష్య సేన్ ఏడు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. హెచ్‌ఎస్ ప్రణయ్ ఎనిమిది నుంచి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోగా... కిడాంబి శ్రీకాంత్ 20వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.



టెస్టు సమరం 'కొత్త'గా మొదలు

సరిగ్గా నెల రోజుల విరామం తర్వాత భారత అభిమానుల కోసం మళ్లీ క్రికెట్ సందడి. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో ఓటమిని ఎదుర్కొన్న అనంతరం టీమిండియా మరోసారి సంప్రదాయ క్రికెట్‌లో కొత్త పోరుకు సన్నద్ధమైంది. 2023-25 డబ్ల్యూటీసీ క్యాలెండర్‌లో భాగంగా భారత్ తమ తొలి సిరీస్ బరిలోకి దిగనుంది. ఈ సారి వెస్టిండీస్ రూపంలో బలహీన ప్రత్యర్థి భారత్ ముందుంది. వన్డే వరల్డ్ కప్‌కు అర్హత సాధించలేక, టెస్టుల్లో అంతంత మాత్రం ప్రదర్శనతోనే పడుతూ లేస్తూ సాగుతున్న విండీస్ జట్టు టీమిండియాకు ఏమాత్రం పోటీనివ్వగలదనేది చూడాలి.

నేటి నుంచి భారత్, వెస్టిండీస్ తొలి మ్యాచ్

- ఫేవరెట్‌గా టీమిండియా
- సొంతగడ్డపై పోటీకి విండీస్ సై

రాత్రి 7:30 నుంచి దూరదర్శన్ స్పోర్ట్స్ చానెల్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



రోసీ (డొమినికా): భారత్, వెస్టిండీస్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా నేటి నుంచి ఇరు జట్ల మధ్య తొలి టెస్టు జరుగుతుంది. చివరిసారిగా 2019లో విండీస్ గడ్డపై పర్యటించిన భారత్ 2–0తో సిరీస్ గెలుచుకుంది. ఇప్పు డు కూడా రెండు జట్ల బలాబలాలను చూస్తే భారత్ అన్ని రకాలుగా పటిష్టంగా ఉంది. అయితే సొంతగడ్డపై అప్పుడప్పుడు సంచలనాలు సృష్టించగల సామర్థ్యం విండీస్‌కు ఉంది. వరుసగా రెండుసార్లూ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరిన భారత్ ఇక్కడి నుంచే సాధ్యమైనన్ని ఎక్కువ పాయింట్లు రాబట్టుకోవాలని భావిస్తోంది.

యశస్విపై దృష్టి...

డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడిన భారత బృందం నుంచి చూస్తే దాదాపు అదే తుది జట్టుతో బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ప్రధాన తేడా మూడో స్థానంలో పుజారా లేకపోవడమే. ఈ సిరీస్ కోసం కొత్తగా ప్రయత్నించేందుకు యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ రూపంలో భారత్‌కు అవకాశం ఉంది. ముంబైకి ఓపెనర్ అయిన యశస్వి ఇక్కడా ఓపెనర్‌గా, గిల్ మూడో స్థానంలో ఆడటం దాదాపు ఖాయమైంది. ప్రధాన బ్యాటర్లలో రోహిత్, గిల్, కోహ్లిలపై బ్యాటింగ్ భారం ఉంది. ఓవల్ టెస్టులో రాణించి తన స్థానం నిలబెట్టుకున్న రహానే వైస్‌కెప్టెన్‌గా మరింత అదనపు బాధ్యతతో ఆడనున్నాడు. బౌలింగ్‌లో షమీకి ఈ సిరీస్ నుంచి విశ్రాంతినివ్వగా... నవదీప్ సైనీ లేదా జైదేవ్ ఉనాద్కట్‌లలో ఒకరికి అవకాశం లభిస్తుంది. ప్రధాన పేసర్‌గా సిరాజ్... స్పిన్నర్లుగా రవీంద్ర జడేజాతో పాటు డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడని అశ్విన్ కూడా తుది జట్టులో ఉంటారు.

సమష్టిగా ఆడితేనే...

చాలా కాలంగా వెస్టిండీస్ టెస్టు జట్టు పేలవ ఫామ్‌లోనే ఉంది. చివరిసారిగా మార్చిలో టెస్టు సిరీస్ ఆడిన ఆ జట్టు 0–2తో దక్షిణాఫ్రికా చేతిలో ఓడింది. కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్, తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ ఓపెనర్లుగా అందించే ఆరంభం జట్టుకు కీలకం కానుంది. తర్వాతి బ్యాటర్లలో రీఫర్, బ్లాక్‌వుడ్ మాత్రమే నమ్మదగిన ఆటగాళ్లు. ఆల్‌రౌండర్‌గా రోచ్ అనుభవం జట్టుకు ఉపయోగపడవచ్చు. కైల్ మేయర్స్ లేకపోవడం లోటు. రోచ్, జోసెఫ్, హోల్డర్ పేస్ బౌలింగ్ భారం మోస్తారు. షెనాన్ గాబ్రియెల్‌కు అవకాశం దక్కుతుందా చూడాలి. వీరు తమ స్థాయికి తగినట్లుగా ఆడితే భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టవచ్చు. కార్న్‌వాల్ రూపంలో రెండో స్పిన్నర్ జట్టులో ఉన్నాడు.

51 వెస్టిండీస్ గడ్డపై విండీస్‌తో భారత్ 51 టెస్టులు ఆడింది. 9 టెస్టుల్లో నెగ్గి, 16 టెస్టుల్లో ఓడింది. 26 టెస్టులు 'డ్రా' అయ్యాయి. ఓవరాల్‌గా రెండు జట్ల మధ్య 98 టెస్టులు జరిగాయి. భారత్ 22 టెస్టుల్లో నెగ్గి, 30 టెస్టుల్లో ఓడింది. 46 టెస్టులు 'డ్రా' అయ్యాయి.



స్వితోలినా సంచలనం

- ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ స్వియాటెక్‌పై విజయం
- వింబుల్డన్ టోర్నీలో రెండోసారి సెమీస్‌లోకి

లండన్: గత ఏడాది అక్టోబర్‌లో పాపకు జన్మనిచ్చి... ఏప్రిల్‌లో మళ్లీ రాకెట్ పట్టిన ఉక్రెయిన్ టెన్నిస్ స్టార్ ఎలీనా స్వితోలినా వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పెను సంచలనం సృష్టించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో స్వితోలినా 7–5, 6–7 (5/7), 6–2తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను బోల్తా కొట్టించింది. 2019 తర్వాత మళ్లీ వింబుల్డన్ టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన స్వితోలినాకు వింబుల్డన్ నిర్వాహకులు 'వైల్డ్ కార్డు' కేటాయించారు. స్వియాటెక్‌తో 2 గంటల 51 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో స్వితోలినా ఐదు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, స్వియాటెక్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 14 సార్లు దూసుకొచ్చి తొమ్మిదిసార్లు పాయింట్లు నెగ్గిన స్వితోలినా 25 విన్నర్స్ కొట్టింది. నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గి, తొలిసారి వింబుల్డన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన స్వియాటెక్ 41 అనవసర తప్పిదాలు చేసింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 76వ స్థానంలో ఉన్న స్వితోలినా సెమీఫైనల్ చేరిన క్రమంలో నలుగురు గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్‌ను ఓడించడం విశేషం. తొలి రౌండ్‌లో వీనస్ విలియమ్స్ (అమెరికా)పై, రెండో రౌండ్‌లో సోఫియా కెనిన్ (అమెరికా)పై, నాలుగో రౌండ్‌లో విక్టోరియా అజరెంకా (బెలారస్)లపై స్వితోలినా గెలిచింది. సెమీఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన మర్కెటా వొండ్రుసోవాతో స్వితోలినా తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో 42వ ర్యాంకర్ వొండ్రుసోవా 6–4, 2–6, 6–4తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)పై సంచలన విజయం సాధించింది.


స్వియాటెక్

12వసారి సెమీస్‌లో జొకోవిచ్

పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) 12వసారి వింబుల్డన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాడు. క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 4–6, 6–1, 6–4, 6–3తో ఏడో సీడ్ రుబ్లెవ్ (రష్యా)పై గెలిచాడు. మరో క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) 6–4, 3–6, 6–2, 6–2తో సఫీయులిన్ (రష్యా)పై నెగ్గి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) 3–6, 6–3, 6–3, 6–3తో బెరెటిని (ఇటలీ)పై, ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) 3–6, 7–6 (8/6), 7–6 (7/4), 6–3తో దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలిచి తొలిసారి వింబుల్డన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరారు.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్ మూడో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 7–5, 4–6, 7–6 (10/7) తో డేవిడ్ పెల్ (నెదర్లాండ్స్)–రీస్ స్టాల్డెర్ (అమెరికా) జంటను ఓడించింది. జూనియర్ బాలుర సింగిల్స్ రెండో రౌండ్‌లో మానస్ ధామ్నె (భారత్) 1–6, 4–6తో సియర్లీ (బ్రిటన్) చేతిలో ఓడిపోయాడు.

బ్యాటింగ్‌లో నిరాశ... బౌలింగ్‌తో హుషారు

- దీప్తి, షఫాలీ మాయాజాలం
- బంగ్లాదేశ్‌పై 8 పరుగులతో భారత విజయం
- సిరీస్ 2–0తో టీమిండియా సొంతం



మిర్పూర్: భారత మహిళా బ్యాటర్ల స్కోరు, జట్టు స్కోరు తక్కువే! మ్యాచ్‌పై ఆశలే లేని చోట స్పిన్నర్లు దీప్తి శర్మ (3/12), షఫాలీ వర్మ (3/15) మ్యాజిక్ చేశారు. ఇద్దరు వరుసగా 19వ, 20వ ఓవర్ వేసి అనూహ్యంగా భారత్‌ను రెండో టి20లో గెలిపించారు. ఇంకో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను అందించి మురిపించారు. బంగ్లాదేశ్ అమ్మాయిలతో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో హర్మన్‌ప్రీత్ బృందం 8 పరుగుల తేడాతో గెలిచింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసింది. బంగ్లాదేశ్‌పై టి20 మ్యాచ్‌లో భారత్‌కిదే అత్యల్ప స్కోరు! ఏకంగా పది మంది బ్యాటింగ్‌కు దిగితే ఇందులో ఏ ఒక్కరు 20 పరుగులైనా చేయలేకపోవడం గమనార్హం. షఫాలీ వర్మ (14 బంతుల్లో 19; 4 ఫోర్లు) టాప్ స్కోరర్! స్మృతి మంధాన (13; 2 ఫోర్లు), యస్తికా భాటియా (11; 1 ఫోర్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (10; 1 ఫోర్), అమన్‌జోత్ కౌర్ (14; 2 ఫోర్లు) డబుల్ డిజిట్ చేశారంతే. దీంతో జట్టు వంద పరుగులైనా చేయలేకపోయింది. సుల్తానా ఖాటున్ 3, ఫాహిమా ఖాటున్ 2 వికెట్లు తీశారు. తర్వాత బంగ్లా 20 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌటైంది. మనవాళ్లెవరూ 20 పరుగులైనా చేయలేకపోవడం విడ్డూరమైతే... ప్రత్యర్థి జట్టులో నిగార్ సుల్తానా (38; 2 ఫోర్లు) తప్ప ఇంకెవరూ పట్టుమని పది పరుగులైనా చేయలేకపోయారు. నిగార్‌ను దీప్తి అవుట్ చేసినప్పుడు బంగ్లా స్కోరు 86/6. మిగతా 7 బంతులకు జట్టు 10 పరుగుల దూరంలోనే ఉంది. కానీ షఫాలీ 20వ ఓవర్లో రబేయా (0)ను రనౌట్ చేసింది. నహిదా (6), ఫాహిమా (0), మారుఫా (0)లను స్పిన్‌తో బోల్తా కొట్టించింది. మిన్ను మణి 2 వికెట్లు తీయగా, ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ బారెడ్డి అనూషకు ఒక వికెట్ దక్కింది. గురువారం ఆఖరి టి20 జరుగుతుంది.



నేటి నుంచి దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఫైనల్ నేడు బెంగళూరులో మొదలుకానుంది. హనుమ విహారి సారథ్యంలోని సౌత్ జోన్ జట్టు ప్రియాంక్ పాంచాల్ కెప్టెన్సీలోని డిఫెండింగ్ చాంపియన్ వెస్ట్ జోన్ జట్టుతో తలపడనుంది. గత ఏడాది ఫైనల్లో వెస్ట్ జోన్ జట్టు 294 పరుగుల తేడాతో సౌత్ జోన్ జట్టును ఓడించింది. సౌత్ జోన్ చివరిసారి 2011లో దులీప్ ట్రోఫీ టైటిల్ గెలిచింది. వెస్ట్ జోన్ జట్టు 19సార్లు చాంపియన్‌గా నిలిచింది. విహారితో పాటు మయాంక్ అగర్వాల్, తిలక్ వర్మ, రికీ భుయ్, సాయి సుదర్శన్ ఆటతీరుపై సౌత్ జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. పృథ్వీ షా, పుజారా, సూర్యకుమార్ యాదవ్, సర్ఫరాజ్‌లతో వెస్ట్ జోన్ కూడా పటిష్టంగా ఉంది.


సినిమా

మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల తాజా చిత్రాల సెట్స్‌లో 'డిష్యుం.. .. డిష్యుం' సౌండ్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు స్టార్స్ విలన్లను రఫ్ఫాడిస్తున్నారు... రిస్కీ ఫైట్ చేస్తున్నారు. ఆ డిష్యుం.. డిష్యుం... విశేషాలు తెలుసుకుందాం.

డిష్యుం.. డిష్యుం...


'గుంటూరు కారం'లో మహేశ్‌బాబు


'దేవర'లో ఎన్టీఆర్


'గేమ్ ఛేంజర్'లో రామ్‌చరణ్

గుంటూరు కారం.. నాటు ఫైటు

'గుంటూరు కారం' ఎంత ఘాటుగా ఉంటుందో ఆ రేంజ్‌లో నాటు ఫైటు చేస్తున్నారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో 'గుంటూరు కారం' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో ఆరంభమైంది. తొలుత మహేశ్‌బాబు పాల్గొనగా కాలేజీ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ప్రస్తుతం యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. నాటు ఫైట్స్‌తో విలన్ల తుక్కు రేగ్గొడుతున్నారు మహేశ్. మరి.. ఈ ఫైట్‌ను విజువల్‌గా ఎంజాయ్ చేయాలంటే సంక్రాంతి వరకూ ఎదురు చూడక తప్పదు. ఎందుకంటే 'గుంటూరు కారం' సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఎస్. చినబాబు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీ లీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

యాక్షన్ దేవర

'దేవర' షూటింగ్ ఎప్పట్నుంచి మొదలైందో అప్పట్నుంచే ఎన్టీఆర్ ఫుల్ యాక్షన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఇప్పటివరకు జరిగిన ఈ సినిమా ప్రతి షెడ్యూల్‌లోనూ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడమే ఇందుకు ఓ నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ నెల మొదటివారంలో 'దేవర' తాజా షెడ్యూల్ ప్రారంభమైంది. ప్రస్తుతం ఎన్టీఆర్, మలయాళ నటుడు షైన్ టామ్ చాకోల్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారని టాలీవుడ్ టాక్. ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్స్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేశారట. అంతేకాదు.. ఈ ఫైట్ పూర్తి కాగానే మరో ఫైట్ మాస్టర్ సాల్మోన్ డిజైన్ చేసిన యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ పాల్గొంటారు. ఈ చిత్రంలో విలన్ రోల్ చేస్తున్న సైఫ్ అలీఖాన్ ఈ షెడ్యూల్‌లో జాయిన్ అయ్యే చాన్సెస్ ఉన్నాయి. ఆల్రెడీ ఎన్టీఆర్ – సైఫ్‌ల మధ్య హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బేట్స్ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించిన సంగతి తెలిసిందే. ఇక 'జనతా గ్యారేజ్' (2016) చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ 'దేవర'లో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

గేమ్ ఛేంజర్ యాక్షన్


'గేమ్ ఛేంజర్'గా ఫైట్ చేస్తున్నారు రామ్ చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న సినిమా 'గేమ్ ఛేంజర్'. ఈ చిత్రదర్శకుడు శంకర్ 'ఇండియన్ 2'తో బిజీగా ఉండటం, హీరో రామ్‌చరణ్ హాలిడేస్ వంటి కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్‌కు కాస్త గ్యాప్ వచ్చింది. తాజాగా ఈ వారంలో షూటింగ్‌ను తిరిగి ఆరంభించడానికి సన్నాహాలు చేస్తోంది యూనిట్. ఈ కొత్త షెడ్యూల్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారని తెలిసింది. స్టంట్ మాస్టర్స్ అన్బు–అరివు ఈ ఫైట్‌ని డిజైన్ చేయనున్నారట. ఆల్రెడీ సినిమా క్లయిమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ పూర్తయింది. తాజా యాక్షన్ షెడ్యూల్ చిత్రీకరణతో 'గేమ్ ఛేంజర్' సినిమాకు సంబంధించిన యాక్షన్ పోర్షన్స్ పూర్తవుతాయనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న ఈ సినిమా 2024లో రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

సంగీత్ సందడి


సుశాంత్, కీర్తీ సురేష్, చిరంజీవి, తమన్నా

చిరంజీవి టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించగా, ఆయనకు జోడీగా తమన్నా నటించారు. సుశాంత్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారు. కాగా 'భోళా శంకర్' చిత్రంలోని 'జామ్ జామ్ జజ్జనక..' పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ మంగళవారం విడుదల చేసింది. సంగీత దర్శకుడు మహతి స్వరసాగర్ స్వరకల్పనలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, మంగ్లీ పాడారు. పెళ్లి వేడుకల్లో భాగంగా జరిగే సంగీత్‌లోని పాటగా 'జామ్ జామ్ జజ్జనక..' ఉంటుందని తెలిసింది. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది.

థ్రిల్ ఇచ్చే హిడింబ


అశ్విన్

అశ్విన్ బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వం వహించిన చిత్రం 'హిడింబ'. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఎస్‌వీకే సినిమాస్‌పై గంగపట్నం శ్రీధర్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 20న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ''ఇండియన్ సినిమాల్లో ఇంతకు ముందెన్నడూ చెప్పని కథ, ఇంతకు ముందు ఎవరూ టచ్ చేయని జానర్'' అంటూ రిలీజ్ డేట్ పోస్టర్‌లో వేశారు మేకర్స్. ''యూనిక్ కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని, థ్రిల్‌ని ఇచ్చేలా 'హిడింబ'ని మలిచారు అనిల్ కన్నెగంటి. ఈ చిత్రంలో కొన్ని ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని సెన్సార్ వారు చెప్పారు. దీంతో రివ్యూ కమిటీ ద్వారా సినిమాని రీ–సెన్సార్ చేసి విడుదల చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బాడిసా, కెమెరా: బి. రాజశేఖర్.

ఆ మాటని నమ్మను

\- వైష్ణవీ చైతన్య



''బస్తీలో పెరిగిన ఓ అమాయకురాలు సిటీకి వస్తుంది. చిన్నప్పటి నుంచి ఓ అబ్బాయితో ప్రేమలో ఉంటుంది. సిటీలో కాలేజీకు వచ్చాక మరో అబ్బాయి లైఫ్‌లోకి వస్తాడు. ఆ తర్వాత ఆ అమ్మాయి జీవితం ఎలా ప్రభావితం అయింది? అనేది 'బేబీ'లో సాయి రాజేష్‌గారు చక్కగా చూపించారు'' అని వైష్ణవీ చైతన్య అన్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బేబీ'. సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా వైష్ణవీ చైతన్య మాట్లాడుతూ– ''మాది హైదరాబాద్. యూ ట్యూబర్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా నా గురించి కొందరికి తెలుసు. ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నాకు హీరోయిన్‌గా 'బేబీ' మొదటి సినిమా. నన్ను నమ్మి, నాలో ధైర్యం నింపి అవకాశం ఇచ్చిన సాయి రాజేష్‌గారికి థ్యాంక్స్. నా జీవితంలో చాలా గొప్ప అవకాశం ఇది. వాస్తవ ఘటనలతో రూపొందిన సినిమా. తెలుగు అమ్మాయిలకు తెలుగులో చాన్స్‌లు ఇవ్వరనే మాటని నేను నమ్మను. మన వంతు ప్రయత్నం చేసినప్పుడే అవకాశాలు వస్తాయి. 'బేబీ' తర్వాత నేను ఏ కొత్త ప్రాజెక్ట్‌కు సైన్ చేయలేదు'' అన్నారు.

హై ఓల్టేజ్ యాక్షన్


విశాల్

విశాల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మార్క్ ఆంటోనీ' విడుదల తేదీ ఫిక్స్ అయింది. వినాయక చవితి పండగను పురస్కరించుకుని సెప్టెంబర్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. వినోద్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం రిలీజ్ డేట్ ప్రకటించి, విశాల్ పోస్టర్‌ని విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్, హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. టైమ్ ట్రావెల్ థీమ్ చుట్టూ తిరిగే ఈ చిత్రంలో భారీ యాక్షన్ సీన్స్, సైన్స్ ఫిక్షన్ అంశాలు, ఎస్‌జే సూర్య కామెడీ.. ఇలా అన్నీ ప్రేక్షకులను అలరిస్తాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. సునీల్, సెల్వ రాఘవన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: అభినందన్ రామానుజం.

రఖ్ విశ్వాస్


అక్షయ్ కుమార్

అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, పరేష్ రావల్ ప్రధాన పాత్రధారులుగా ఉమేష్ శుక్లా దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'ఓఎమ్‌జీ' (ఓ మై గాడ్). 2012లో విడుదలైన ఈ చిత్రం దాదాపు రూ. రెండొందల కోట్ల వసూళ్లు సాధించి సూపర్‌హిట్‌గా నిలిచింది. పదేళ్ల తర్వాత 'ఓఎమ్‌జీ'కి సీక్వెల్‌గా 'ఓఎమ్‌జీ 2' (ఓ మై గాడ్ 2) రానుంది. అమిత్ రాయ్ దర్శకత్వంలో అక్షయ్ కుమార్, పంకజ్ త్రిపాఠి, యామీ గౌతమ్, అరుణ్ గోవిల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఇది. ఈ చిత్రం ఆగస్టు 11న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'రఖ్ విశ్వాస్' అంటూ ఈ సినిమా టీజర్‌ను అక్షయ్ కుమార్ షేర్ చేశారు. ఈ సినిమాలో శివుడిగా అక్షయ్‌కుమార్, భక్తునిగా పంకజ్ త్రిపాఠి నటిస్తున్నారు. కాగా 'ఓఎమ్‌జీ 2' చిత్రం విద్యా వ్యవస్థ నేపథ్యంలో తెరకెక్కిందని బాలీవుడ్ టాక్.

తెలుగులో తారకాసుర


తృప్తీ శుక్లా

రవికిరణ్, మాన్విత హరీష్ జంటగా చక్రవర్తి, తృప్తీ శుక్లా, హాలీవుడ్ నటుడు డేని సపని కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'తారకాసుర'. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో నరసింహులు నిర్మించారు. కన్నడలో హిట్‌గా నిలిచిన ఈ చిత్రాన్ని 'తారకాసుర' పేరుతోనే విజయ్ భాస్కర్ రెడ్డి పాళ్యం తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ నగేష్ నారదాసి, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయి వెంకట్, పద్మిని నాగులపల్లి అతిథులుగా హాజరై, 'తారకాసుర' తెలుగులోనూ హిట్టవ్వాలని అన్నారు. ''తారకాసుర'లో తెలుగు నేటివిటీకి తగ్గట్టు కొన్ని మార్పులు చేస్తాం. మా బ్యానర్‌లో ఓ స్ట్రయిట్ సినిమా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు విజయ్ భాస్కర్ రెడ్డి పాళ్యం.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
274	84
65,618	19,439

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,719	▲	33
డోజోన్స్	34,140	▲	197
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,283	▲	9
డాక్స్	15,790	▲	117
షాంఘై	3,221	▲	18
నికాయ్	32,204	▲	14

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,866	▲	210
బంగారం (99.5 స్వచ్ఛత)	58,630	▲	209
వెండి (కిలో)	70,828	▲	197

కార్‌ట్రేడ్ చేతికి సోబెక్ ఆటో

డీల్ విలువ రూ. 537 కోట్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఆటో క్లాసిఫైడ్ ప్లాట్‌ఫామ్ కార్‌ట్రేడ్ టెక్ ఆటోమోటివ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ నిర్వహణ సంస్థ సోబెక్ ఆటో కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. క్లాసిఫైడ్స్ ఇంటర్నెట్ బిజినెస్‌ను సైతం నిర్వహించే సోబెక్‌లో 100 శాతం వాటా సొంతం చేసుకునేందుకు రూ. 537 కోట్లకుపైగా వెచ్చించనుంది. ఇందుకు ఓఎల్‌ఎక్స్ ఇండియా బీవీతో వాటా కొనుగోలు ఒప్పందాన్ని(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు కార్‌ట్రేడ్ వెల్లడించింది. 2023 జూన్ 30న ఓఎల్‌ఎక్స్ ఇండియాకు చెందిన క్లాసిఫైడ్ ఇంటర్నెట్ బిజినెస్‌ను సోబెక్ కొనుగోలు చేసింది. బిజినెస్ బదిలీ ప్రాతిపదికన డీల్ కుదిరింది.

ఐఫోన్ల తయారీలో టాటా!

విస్ట్రాన్ ప్లాంటు కొనుగోలుకు కసరత్తు



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం టాటా గ్రూప్ త్వరలోనే యాపిల్ ఐఫోన్లను భారత్‌లో తయారు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐఫోన్ల సరఫరాదారు విస్ట్రాన్‌కు కర్ణాటకలో ఉన్న ప్లాంటును కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఆగస్టులో ఈ డీల్ పూర్తయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే ఐఫోన్లను తయారు చేసే తొలి భారతీయ కంపెనీగా టాటా నిలవనుంది. సుమారు 600 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 4,000 కోట్లు) విలువ చేసే విస్ట్రాన్ ప్లాంటు కొనుగోలు కోసం దాదాపు ఏడాది కాలంగా చర్చలు జరుగుతున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ఇందులో ప్రస్తుతం లేటెస్ట్ ఐఫోన్ 14 మోడల్‌ను అసెంబుల్ చేస్తుండగా.. 10,000 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. టాటా గ్రూప్ ఇప్పటికే ఐఫోన్ చాసిస్‌లను తమ తమిళనాడు ప్లాంటులో తయారు చేస్తోంది.

2 కోట్లకు పైగా ఐటీఆర్‌లు నమోదు



న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు 2 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. జూలై 11 నాటికి ఇంత మంది ఐటీఆర్‌లు దాఖలు చేసినట్లు ఆదాయపన్ను శాఖ ట్విట్టర్‌లో ప్రకటించింది. గతేడాది జూలై 20 నాటికి కానీ 2 కోట్ల ఐటీఆర్‌లు నమోదు కాలేదు. పన్ను చెల్లింపుదారులు ఈ ఏడాది 9 రోజుల ముందే 2 కోట్ల రిటర్నుల మైలురాయి నమోదుకు సహకరించినట్లు ఆదాయపన్ను శాఖ పేర్కొంది. అసెస్‌మెంట్ సంవత్సరానికి 2023-24 సంబంధించి ఇప్పటికీ ఐటీఆర్‌లు దాఖలు చేయని వారు, వెంటనే ఆ పనిని పూర్తి చేసుకోవాలని కోరింది.

మళ్లీ రూపాయి ప్లస్

18 పైసలు బలపడి 82.41కు



న్యూఢిల్లీ: డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ మరోసారి బలపడింది. 18 పైసలు పుంజుకుని 82.41 వద్ద ముగిసింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి క్రితం ముగింపు 82.59తో పోలిస్తే తొలుత 82.42 వద్ద ఉత్సాహంగా ప్రారంభమైంది. తదుపరి డాలరుతో మారకంలో 82.32 వరకూ లాభపడింది. ఇంట్రాడే కనిష్టం 82.43కాగా.. చివరికి 82.41 వద్ద ముగిసింది. వెరసి గత రెండు రోజుల్లో 20 పైసలు బలపడింది. ఇందుకు ఈక్విటీ మార్కెట్లు లాభపడటం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు సహకరించినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. డాలరుతో మారకంలో ఆసియా కరెన్సీలు పుంజుకోవడం సైతం రూపాయికి బలాన్నిచ్చినట్లు తెలియజేశాయి.

ఆన్‌లైన్ గేమింగ్‌పై 28% జీఎస్‌టీ

గుర్రపు పందెం, క్యాసినోలపై కూడా అదే రేటు • క్యాన్సర్ ఔషధాలు చౌక
'మల్టీప్లెక్స్' భారం తగ్గింపు • అత్యున్నత స్థాయి మండలి కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్, గుర్రపు పందెం, క్యాసినోలపై పూర్తి స్థాయిలో 28% వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధిస్తూ అత్యున్నత స్థాయి మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన మంగళవారం ఇక్కడ జరిగిన 50వ మండలి సమావేశం క్యాన్సర్ ఔషధాలకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు నిచ్చింది. ప్రత్యేక వైద్య ప్రయోజనాల కోసం ఉద్దేశించిన ఆహారంపై కూడా ఇదే నిర్ణయం వర్తిస్తుంది. మండలి తీసుకున్న నిర్ణయాల ప్రకారం సినీప్లెక్స్‌లో ఉండే రెస్టారెంట్లలో ఇకపై జీఎస్‌టీ 5% మాత్రమే పడుతుంది. గతంలో ఈ రేటు 18 శాతంగా ఉంది. మల్టీ యుటిలిటీ వెహికిల్ (లేదా) మల్టీ పర్పస్ వెహికిల్‌పై ప్రస్తుతం 20% సెస్‌రేటును 22 శాతానికి పెంచుతూ మండలి నిర్ణయం తీసుకుంది. దీనితో యూవీ విభాగంలో ధరలు పెరగనున్నాయి. అయితే దీనిలో సెడాన్లు భాగం కాదు. కాగా, గేమింగ్, హార్స్ రేసింగ్, క్యాసినో గెలుపులపై 28 శాతం జీఎస్‌టీ ఈ పరిశ్రమను పూర్తిగా దెబ్బ తీస్తుందని సంబంధిత వర్గాలు విమర్శించాయి.

చిప్ ప్లాంటుపై ఫాక్స్‌కాన్ సొంత ప్లాన్

- ప్రోత్సాహకాల కోసం విడిగా దరఖాస్తు చేసుకునే యోచన
- భారత్‌లో సెమీకండక్టర్ల ప్లాంటుకు కట్టుబడి ఉన్నామని వెల్లడి

న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం వేదాంతతో జాయింట్ వెంచర్ నుంచి తప్పుకున్న ఫాక్స్‌కాన్ సొంతంగానే భారత్‌లో సెమీకండక్టర్ల ప్లాంటు నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించింది. చిప్‌ల తయారీకి సంబంధించి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల కోసం విడిగా దరఖాస్తు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించింది. అనువైన భాగస్వాములను ఎంచుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. వేదాంతాతో జాయింట్ వెంచర్ నుంచి వైదొలగడంపై స్పందిస్తూ.. 'ఇదేమీ ప్రతికూల పరిణామమేమీ కాదు. ప్రాజెక్టు తగినంత వేగంతో ముందుకు సాగడం లేదని ఇరు పక్షాలు గుర్తించాయి. సవాళ్లను అధిగమించడం అంత సులువుగా జరగడం లేదు. పైగా ప్రాజెక్టుకు వెలుపలి అంశాలు కూడా ఇందుకు తోడయ్యాయి. దీంతో మా గ్రూపు, వాటాదారులపై పడే ప్రభావాలన్నింటినీ పరిశీలించిన మీదటే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొంది. 'కొత్త ప్రదేశంలో ఫ్యాబ్రికేషన్ యూనిట్లను కొత్తగా ప్రారంభించడమనేది సవాలే. అయితే, 1980ల నుంచి ఇలాంటి సవాళ్లను ఎన్నో అధిగమిస్తూ, ముందుకు సాగుతున్నాం. భారత్‌లో చిప్ ప్లాంటు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం' అని ఫాక్స్‌కాన్ స్పష్టం చేసింది. తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్.. భారత్‌లో తొలి సెమీకండక్టర్ల తయారీ యూనిట్ ఏర్పాటు కోసం వేదాంతాతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడం, సాంకేతిక భాగస్వామి కుదరకపోవడంతో దాన్నుంచి తప్పుకోవడం తెలిసిందే.

సోనాలికా క్యూ1 అమ్మకాల్లో రికార్డు

ఏప్రిల్-జూన్‌లో 40,700 ట్రాక్టర్ల విక్రయం



హైదరాబాద్: భారత్ నెంబర్ 1 ట్రాక్టర్ ఎక్స్‌పోర్ట్ బ్రాండ్ సోనాలికా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్)లో రికార్డు స్థాయిలో 40,700 ట్రాక్టర్ల అమ్మకాలు జరిపింది. సోనాలికా వ్యాపార చరిత్రలో ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఇంత భారీ స్థాయిలో విక్రయాలు జరపడం ఇదే తొలిసారి. మార్కెట్ షేర్‌లో కూడా సంస్థ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఇదే తరహా రికార్డు విక్రయాలు మున్ముందు త్రైమాసికాల్లో కూడా కొనసాగుతాయన్న విశ్వాసాన్ని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన తెలిపింది. వ్యవసాయం-పర్యావరణ వ్యవస్థల మధ్య సమతౌల్యత సాధిస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలు, నాణ్యతతో కూడిన హెవీ డ్యూటీ ట్రాక్టర్లు అలాగే ఇతర సరసమైన వ్యవసాయ ఉత్పాదకతలను అందించడానికి కట్టుబడి ఉన్నట్లు ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ (సోనాలికా అండ్ సోలిస్)జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ పేర్కొన్నారు. రైతులను మరింత ఉత్పాదకత దిశగా నడిపించడానికి, ప్రగతిశీల బాటలో వారిని సంపన్నులుగా మార్చడానికి సంస్థ తన వంతు కృషి చేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు.

రెండో రోజూ మార్కెట్లు అప్

- సెన్సెక్స్ 274 పాయింట్లు ప్లస్
- 65,618 వద్ద ముగింపు
- 84 పాయింట్లు ఎగసిన నిఫ్టీ
- హెవీవెయిట్ షేర్ల దన్ను



ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. సెన్సెక్స్ 274 పాయింట్లు ఎగసి 65,618కు చేరగా.. 84 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ 19,439 వద్ద ముగిసింది. అధికశాతం ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల మధ్యే కదిలాయి. వెరసి సెన్సెక్స్ ఒక దశలో 526 పాయింట్లు జంప్‌చేసి 65,870ను అధిగమించగా.. నిఫ్టీ 19,515 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. ప్రధానంగా ఇండెక్స్ హెవీవెయిట్స్ రిలయన్స్, ఐటీసీ, ఇన్ఫోసిస్ తదితరాలు మార్కెట్లకు జోష్‌నిచ్చాయి. ఇటీవల పెట్టుబడుల బాటలో సాగుతున్న విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

లాభాల బాటలో

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆటో, ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, ఆయిల్ అండ్ గ్యాస్ 1 శాతం స్థాయిలో లాభపడగా.. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్స్ 0.2 శాతం నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐషర్, సన్ ఫార్మా, టాటా కన్స్యూమర్, అపోలో హాస్పిటల్స్, మారుతీ, టాటా మోటార్స్, ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, టైటాన్, నెస్లే, ఆర్‌ఐఎల్ 3-1.2% మధ్య ఎగశాయి. అయితే యూపీఎల్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌సీఎల్ టెక్, హిందాల్కో, హీరో మోటో, ఎస్‌బీఐ 2.3-0.6% క్షీణించాయి.

చిన్న షేర్లు జూమ్: మార్కెట్లను మించుతూ బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ దాదాపు 1 శాతం బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,870 లాభపడితే.. 1,627 నష్టపోయాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు తాజాగా రూ. 1,197 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. డీఐఐలు రూ. 7 కోట్లను వెనక్కి తీసుకోగా.. గత రెండు రోజుల్లోనూ ఎఫ్‌పీఐలు రూ. 1,378 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కాగా.. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.2 శాతం బలపడి 77.83 డాలర్లకు చేరింది.

వేదాంతా నేలచూపు

సెమీకండక్టర్ తయారీ భాగస్వామ్య సంస్థ(జేవీ) నుంచి తైవాన్ దిగ్గజం ఫాక్స్‌కాన్ వైదొలగిన నేపథ్యంలో వేదాంతా లిమిటెడ్ కౌంటర్లో అమ్మకాలు తలెత్తాయి. దీంతో వేదాంతా షేరు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో 2% క్షీణించి రూ. 278 దిగువన స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో 1.36 కోట్లు, బీఎస్‌ఈలో 6.66 లక్షలు చొప్పున షేర్లు చేతులు మారాయి. 19.5 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన జేవీ నుంచి ఫాక్స్‌కాన్ వైదొలగడం తెలిసిందే.

ఐటీసీ సంజీవ్ పురి వేతనం రూ.16.31 కోట్లు

2022-23లో 50 శాతం అధికం



న్యూఢిల్లీ: ఐటీసీ చైర్మన్, ఎండీ సంజీవ్ పురి పారితోషికం గతేడాది (2022-23) 53 శాతం పెరిగి రూ.16.31 కోట్లకు చేరింది. ఇందులో కనీస వేతనం రూ.2.88 కోట్లు కాగా, పనితీరు ఆధారిత బోనస్, ఇతర ప్రోత్సాహకాలు, కమీషన్ మొత్తం రూ.12.86 కోట్లుగా ఉంది. 2021-22 సంవత్సరానికి సంజీవ్ పురి అందుకున్న వేతనం రూ.10.66 కోట్లు. ఆగస్ట్ 11న ఐటీసీ వార్షిక సాధారణ సమావేశం జరగనుంది. సంజీవ్ పురిని మరో ఐదేళ్లపాటు ఎండీ, చైర్మన్‌గా నియమించే ప్రతిపాదనకు వాటాదారుల ఆమోదం కోరనుంది. 2019 జూలై 22న ఐటీసీ ఎండీగా ఆయన నియమితులయ్యారు. 2024 జూలై 21 వరకు ఆయన పదవీకాలం అమల్లో ఉంది. ఆ తర్వాత నుంచి ఐదేళ్లు లేదంటే ఆయన కోరుకున్నంత వరకు ఎండీ, చైర్మన్‌గా కంపెనీ తిరిగి నియమించనుంది. ఐటీసీలో పురి తర్వాత అత్యధికంగా నకుల్ ఆనంద్ రూ.8.18 కోట్ల పారితోషికం అందుకున్నారు.

జాబ్ పాయింట్

మహిళా అభివృద్ధి-శిశుసంక్షేమ శాఖ.. ఖమ్మం జిల్లాలో వివిధ ఉద్యోగాలు

ఖమ్మం జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖకు చెందిన డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్(ఖమ్మం)లో కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **పోస్టుల వివరాలు:** కౌన్సిలర్-01, మేనేజర్-01, సోషల్ వర్కర్-01, ఏఎన్‌ఎం/నర్సు-01, అసిస్టెంట్ డేటా ఎంట్రీ ఆపరేటర్-03, ఆయా-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమాతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బాల భవన్ రక్ష కార్యాలయం, పాత డీఆర్‌డీఏ కార్యాలయం దగ్గర, ఖమ్మం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.07.2023.
» **వెబ్‌సైట్:** khammam.telangana.gov.in

మిధాని, హైదరాబాద్‌లో వివిధ పోస్టులు

హైదరాబాద్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-01, మేనేజర్-01, హౌస్ కీపర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ/గ్రాడ్యుయేషన్/సీఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణులవ్వాలి.**వయసు:** 30 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:**పోస్టును అనుసరించి నెలకు రూ.19,130 నుంచి రూ.2.2 లక్షల వరకూ వేతనం చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ప్రొఫిషియన్సీ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2023.
» **వెబ్‌సైట్:** https://midhaniindia.in

జిల్లా గ్రంథాలయ సంస్థ, వైజాగ్‌లో 12 పోస్టులు

విశాఖపట్నంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** గ్రేడ్-3 లైబ్రేరియన్-07, రికార్డ్ అసిస్టెంట్-01, లైబ్రరీ హెల్పర్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఏదైనా డిగ్రీ, సీఎస్ఐఎస్సీ, కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెక్రటరీ, జిల్లా గ్రంథాలయ సంస్థ, రామా టాకీస్ దగ్గర, విశాఖపట్నం చిరునామకు పంపించాలి. » **దరఖాస్తులకు చివరితేది:** 15.07.2023.
» **వెబ్‌సైట్:** visakhapatnam.ap.gov.in

ఇగ్నో, న్యూఢిల్లీలో 12 నాన్‌టీచింగ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-8, టెక్నికల్ మేనేజర్-4
» **అర్హత:** పోస్టును అనుసరించి బీసీఏ/బీఎస్సీ/బీఏ/బ్యాచిలర్స్ ఆఫ్ వొకేషనల్/బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 37 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.34,800 నుంచి రూ.39,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.08.2023.
» **వెబ్‌సైట్:** www.ignou.ac.in

సర్కారీ బ్యాంకుల్లో.. క్లర్క్ కొలువు



» నోటిఫికేషన్ విడుదల చేసిన ఐబీపీఎస్
» 11 జాతీయ బ్యాంకుల్లో.. 4,545 క్లర్క్ పోస్టులు
» ఏపీలో 77, టీఎస్‌లో 27 పోస్టులు
» మూడు దశలుగా ఎంపిక ప్రక్రియ

ఐబీపీఎస్.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టే సంస్థ! ఇది తాజాగా కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ ఫర్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ క్లర్క్స్-13 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 4,545 క్లర్క్ పోస్టులను భర్తీ చేయనుంది. ఏదైనా బ్యాచిలర్ డిగ్రీతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఐబీపీఎస్ తాజా నోటిఫికేషన్ ద్వారా.. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుల్లో పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది పోస్టుల సంఖ్య తగ్గింది. గత సంవత్సరం 6,035 పోస్టులకు ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఈ ఏడాది మాత్రం 4,545 పోస్టులనే ప్రకటించింది.

అర్హతలు

- 21.07.2023 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్ లేదా డిప్లొమా/డిగ్రీ కలిగుండాలి. లేదా హైస్కూల్/కాలేజ్ స్థాయిలో కంప్యూటర్/ఐటీని ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి.
- **వయసు:** జూలై 1, 2023 నాటికి 20-28 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

- ఐబీపీఎస్ క్లర్క్స్ నియామక ప్రక్రియలో భాగంగా రెండంచెల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ రాత పరీక్ష; మెయిన్ రాత పరీక్ష.
- ముందుగా ప్రిలిమినరీ రాత పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్‌మార్కుల జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు. మెయిన్‌లోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్ అందిస్తారు.

ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష

ఐబీపీఎస్ రాత పరీక్షను ప్రాంతీయ భాషల్లో కూడా నిర్వహించనున్నారు. ఇంగ్లిష్‌తోపాటు హిందీ, తెలుగు, అస్సామీ, గుజరాతీ, మరాఠీ, కొంకణి, ఉర్దూ, కన్నడ, మళయాళం, మణిపురి, ఒడియా, తమిళం, పంజాబీ భాషల్లో పరీక్ష రాసే వీలుంది. అభ్యర్థులు తాము ఏ రీజియన్‌కు దరఖాస్తు చేసుకున్నారో.. ఆ రీజియన్‌కు నిర్దేశించిన రీజనల్ లాంగ్వేజ్‌లో మాత్రమే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఏపీ అభ్యర్థులు ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో.. తెలంగాణ అభ్యర్థులు ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఉర్దూ భాషల్లో పరీక్షకు హాజరు కావచ్చు.

ప్రిలిమినరీ ఎగ్జామినేషన్

ఐబీపీఎస్ క్లర్క్స్ నియామక ప్రక్రియలోని తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో మూడు విభాగాల్లో జరుగుతుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు.. ఇలా మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు.

మెయిన్స్ పరీక్ష

మొదటి దశ ప్రిలిమ్స్‌లో సాధించిన మార్కుల ఆధారంగా.. పోస్టుల సంఖ్యను అనుసరించి మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష నాలుగు విభాగాల్లో 190 ప్రశ్నలు-200 మార్కులకు జరుగుతుంది. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు-40 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-60 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 160 నిమిషాలు. రెండు దశల పరీక్షలకు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి నాలుగో వంతు మార్కును తగ్గిస్తారు.

సక్సెస్ సాధించేలా

రెండు దశలుగా ఆన్‌లైన్‌లో నిర్వహించే రాత పరీక్షల్లో విజయానికి అభ్యర్థులు దరఖాస్తు దశ నుంచే అడుగులు వేయాలి. ఐబీపీఎస్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం-తొలి దశ ప్రిలిమ్స్ పరీక్ష ఆగస్ట్/సెప్టెంబర్‌లో; రెండో దశ మెయిన్ ఎగ్జామ్ అక్టోబర్‌లో జరగనున్నాయి. కాబట్టి అభ్యర్థులు ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటికీ ఉమ్మడి ప్రిపరేషన్ కొనసాగించాలి. ఎందుకంటే.. ప్రిలిమ్స్ తర్వాత మెయిన్స్‌కు నెల రోజులకంటే తక్కువ వ్యవధి ఉంటుంది.

ఆ మూడు విభాగాలు

- ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/న్యూమరికల్ ఎబిలిటీ.. ఈ మూడు విభాగాలు ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో ప్రశ్నల క్లిష్టత స్థాయి కొంత తక్కువగా.. మెయిన్స్ క్లిష్టత స్థాయి కొంత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ఈ మూడు విభాగాలకు మొదటి నుంచే మెయిన్స్ దృక్పథంతో ప్రిపరేషన్ సాగించాలి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఈ విభాగంలో ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. ఇంగ్లిష్ విభాగానికి సంబంధించి గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం కూడా పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో రాణించడానికి అర్థమెటిక్ అంశాలైన పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లను సాధన చేయాలి.

రీజనింగ్

ఇందులో మంచి మార్కుల సాధనకు కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

మెయిన్స్‌కు అదనపు సమయం

ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌తోపాటే మెయిన్స్‌లో అదనంగా ఉండే జనరల్ అవేర్‌నెస్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్ అంశాలపై దృష్టిపెట్టాలి. ప్రిలిమ్స్ ఆఖరి స్లాట్ పరీక్ష ముగిసిన తర్వాత మెయిన్‌కు తక్కువ సమయం అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవధిలో మెయిన్స్‌లో అదనంగా ఉండే రెండు విభాగాలకు ప్రిపరేషన్ పూర్తి చేయడం సాధ్యంకాదు.

జనరల్ అవేర్‌నెస్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

బ్యాంకింగ్ రంగ పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

మాక్ టెస్ట్‌లకు హాజరు

ప్రిలిమ్స్ కోసం మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం మేలు చేస్తుంది. ప్రిలిమ్స్ ముగిసిన తర్వాత మెయిన్స్‌కు అందుబాటులో ఉండే వ్యవధిలో గ్రాండ్ టెస్ట్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజు ఒక గ్రాండ్ టెస్ట్ రాసేలా ప్లాన్ చేసుకోవాలి. మెయిన్స్‌లో లభిస్తున్న వెయిటేజీకి అనుగుణంగా అదనపు అంశాలకు కొత్తగా ప్రిపరేషన్ సాగించాలి. వెయిటేజీ కొంచెం తక్కువగా ఉందని భావిస్తే ఆందోళన చెందకుండా.. అప్పటికే పట్టు సాధించిన అంశాల ప్రాక్టీస్ సమయం కేటాయించాలి.

క్లర్క్ నుంచి.. డీజీఎం వరకు

ఐబీపీఎస్ నియామక ప్రక్రియలో విజయం సాధించి.. బ్యాంక్‌లో క్లర్క్‌గా నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులు భవిష్యత్తులో సీజీఎం లేదా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ స్థాయి వరకు పదోన్నతులు పొందే అవకాశం ఉంది. తొలుత ఎంపికైన వారికి ఆరు నెలలు ప్రొబేషన్ పిరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. పూర్తి స్థాయిలో నియామకం ఖరారవుతుంది.

ఆ తర్వాత కనీసం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని.. బ్యాంకులు అంతర్గతంగా నిర్వహించే రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో విజయం సాధిస్తే.. ట్రెనీ ఆఫీసర్ (ఎంజీఎస్-ఐఐ) హోదా లభిస్తుంది. ఫాస్ట్ ట్రాక్ ప్రమోషన్ ఛానెల్ విధానంలో ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత నేరుగా జేఎంజీఎస్ స్కేల్-1 ఆఫీసర్‌గా పదోన్నతి పొందొచ్చు. క్లర్క్‌గా కెరీర్ ప్రారంభించాక.. జేఏఐఐబీ, సీఏఐఐబీ కోర్సులు పూర్తి చేస్తే.. ఫాస్ట్ ట్రాక్ ప్రమోషన్ ఛానల్ ద్వారా మూడేళ్ల అనుభవంతో ట్రెనీ ఆఫీసర్‌గా తొలి పదోన్నతి పొంది.. ఆ తర్వాత ప్రతి మూడేళ్ల సీనియారిటీతో డీజీఎం హోదా వరకు చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూలై 1 – జూలై 21, 2023
- **ప్రిలిమినరీ పరీక్ష హాల్ టికెట్ల డౌన్‌లోడ్ ప్రారంభం:** ఆగస్ట్
- **ప్రిలిమినరీ ఎగ్జామ్ తేదీలు:** ఆగస్ట్/సెప్టెంబర్‌లో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ibps.in

శిల్పారామాల్లో వస్త్ర పరిశ్రమ శాఖ మ్యూజియంలు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: నగరంలోని శిల్పారామాల్లో వస్త్ర పరిశ్రమల శాఖ తరఫున మ్యూజియంలు ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించిన ఏర్పాట్లను వెంటనే ప్రారంభించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు ఆదేశించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, దక్షిణ మధ్య రైల్వేను సంప్రదించి చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. చేనేత జౌళి శాఖ కార్యకలాపాలపై అధికారులు, వివిధ విభాగాల ఇన్‌చార్జిలతో మంగళవారం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రాంగణంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఆగస్టు ఏడో తేదీన జరిగే జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, వారి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు చేనేత వారోత్సవాలు నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నేతన్నల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పనితీరు, అమలు, ఫలితాలు, ఆయా కార్యక్రమాల్లో అవసరమైన మార్పు చేర్పులు సూచించేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి సంస్థలతో అధ్యయనం చేయించాలని ఆదేశించారు. నేతన్నకు చేయూత, నేతన్నకు బీమా కార్యక్రమాన్ని మరింతగా విస్తృతపరచాలన్నారు. చేనేత మిత్ర పథకాన్ని మరింత సరళీకరించేందుకు అవసరమైన అంశాలపై కేటీఆర్ సమీక్షించారు.

15న పాస్‌పోర్టు రెండో స్పెషల్ డ్రైవ్



రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పాస్‌పోర్టు దరఖాస్తుల సమర్పణకు సుదీర్ఘ కాలం పడుతుండటంతో విదేశాంగ శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ శనివారం పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్ల కోసం రెండో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలోని బేగంపేట, అమీర్‌పేట్, టోలిచౌకి, నిజామాబాద్, కరీంనగర్‌లోని ఐదు పాస్‌పోర్టు సేవా కేంద్రాలతో పాటు 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో కూడా అపాయింట్‌మెంట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నెల 15, 22, ఆగస్టు 5 తేదీల్లో వచ్చే శనివారాల్లో కూడా స్పెషల్ డ్రైవ్ ఉంటుందని వివరించారు. ఒక్కో తేదీన 3715 సాధారణ, తత్కాల్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో బుక్ చేసుకున్నవారు రీషెడ్యూల్ చేసుకోవచ్చని సూచించారు.

వరదల్లో చిక్కుకున్న ముగ్గురు వైద్యులు క్షేమం

- హరీశ్‌రావు చొరవతో సమాచారం అందించిన మనాలి అధికారులు
- డాక్టర్లను హైదరాబాద్‌కు సురక్షితంగా తీసుకురావాలని అధికారులకు మంత్రి ఆదేశం

సుల్తాన్‌బజార్: హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి వరదల్లో చిక్కుకున్న ముగ్గురు హైదరాబాద్ వైద్యులు క్షేమంగా ఉన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు వైద్యుల క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. వారిని అక్కడినుంచి సురక్షితంగా హైదరాబాద్‌కు చేర్చాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా మెడికల్ కళాశాలకు చెందిన ముగ్గురు వైద్యులు హిమాచల్ ప్రదేశ్ మనాలి వరదల్లో చిక్కుకున్నారనే వార్త రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరానికి చెందిన డాక్టర్ బానోతు కమల్‌లాల్, డాక్టర్ రోహిత్ సూరి, డాక్టర్ శ్రీనివాస్‌లు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీజీ పూర్తి చేశారు. హాస్టల్‌లో ఉంటూ ఉస్మానియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. పీజీ పూర్తయిన సందర్భంగా వీరు హిమాచల్‌ప్రదేశ్‌కు టూర్‌కు వెళ్లారు. ఇటీవల ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వరదలు ముంచెత్తాయి. ముగ్గురు వైద్యులు మనాలి వరదల్లో చిక్కుకున్నారని తోటి వైద్యులకు సమాచారం అందింది. వారిని మళ్లీ సంప్రదించేందుకు ప్రయత్నించగా ముగ్గురి ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. దీంతో వైద్యుల తల్లిదండ్రులు, తోటి వైద్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వైద్యుల ఆచూకీ కోసం జూనియర్ డాక్టర్ల సంఘం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు సమాచారం అందించింది. వెంటనే స్పందించిన హరీశ్‌రావు వారు ఎక్కడ? ఎలా? ఉన్నారో తక్షణమే తెలుసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మనాలిలోని ప్రభుత్వ అధికారులను సంప్రదించిన తెలంగాణ అధికారులు.. వైద్యులు క్షేమంగా ఉన్నట్లు మంత్రికి ఫోన్‌లో సమాచారాన్ని అందించారు. వైద్యులను సురక్షితంగా హైదరాబాద్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు.

గురువులతోనే వంటావార్పు

- మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సమ్మె
- విద్యార్థులకు ఆహారం వండిన ఉపాధ్యాయులు





పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మెకు దిగడంతో ఉపాధ్యాయులే భోజనం వండి విద్యార్థుల ఆకలి తీర్చారు. మహబూబాబాద్ కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో, ఆదిలాబాద్ జిల్లా తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులే వంట చేసి విద్యార్థులకు భోజనం వడ్డించారు. - మహబూబాబాద్ అర్బన్/ సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కాకతీయుల తర్వాత మళ్లీ ఇప్పుడే!

ఏడు శతాబ్దాల తర్వాత ఆ మంటపంలో మళ్లీ శివపార్వతుల కళ్యాణం

- సెప్టెంబరులో వేయి స్తంభాల గుడి కళ్యాణమంటపం సిద్ధం
- ఈసారి శివరాత్రి వేడుకలు అందులోనే..
- పూర్తి కావస్తున్న పునర్నిర్మాణ పనులు
- నాటి ఉలి గుర్తులు ఇప్పటికీ పదిలం

ఒకటి కాదు రెండు కాదు.. దాదాపు ఏడు శతాబ్దాల విరామం తర్వాత వేయి స్తంభాల దేవాలయంలో అంతర్భాగంగా ఉన్న కళ్యాణ మంటపంలో శివపార్వతుల కళ్యాణం జరగబోతోంది. కాకతీయుల హయాం తర్వాత మళ్లీ ఇంతకాలానికి కళ్యాణ మంటపం కళకళలాడబోతోంది. విఖ్యాత వేయి స్తంభాల దేవాలయ కళ్యాణ మంటపం పునర్నిర్మాణ పనులు పూర్తి కావచ్చిన నేపథ్యంలో, సెప్టెంబరులో దాన్ని ఘనంగా ప్రారంభించేందుకు కేంద్రప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత వచ్చే శివరాత్రి వేడుకలను అందులోనే నిర్వహించాలని భావిస్తోంది.



సాక్షి, హైదరాబాద్

కాకతీయ చక్రవర్తి రుద్రదేవుడి హయాంలో వేయి స్తంభాలతో రుద్రేశ్వరస్వామి దేవస్థానాన్ని నిర్మించారు. ఓవైపు దేవాలయం, దానికి మరోవైపు కళ్యాణమంటపాన్ని అద్భుత శిల్పకళా వైభవంతో రూపొందించారు. కాకతీయుల ఇలవేల్పుగా భాసిల్లిన పరమశివుడికి ఈ ఆలయంలో నిత్యాభిషేకాలు జరిగేవి. డెక్కన్ ప్రాంతాన్ని వశం చేసుకునే సమయంలో తుగ్లక్ సేనలు దీన్ని పాక్షికంగా ధ్వంసం చేశాయని చరిత్రకారులు చెబుతారు. అప్పట్లో కళ్యాణమంటపం పైకప్పు 40 శాతం కూలిపోయింది. దాంతో ఆ శిథిల మంటపంలో ఇక వేడుకలు నిర్వహించటం ఆపేశారు. అంతే.. మళ్లీ ఇప్పటి వరకు నిర్వహించలేదు. ఇప్పుడు ఆ మంటపాన్ని పునర్నిర్మించటంతో తిరిగి వేడుకల నిర్వహణ ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

చివరి దశలో పనులు..

దాదాపు 18 ఏళ్ల క్రితం కళ్యాణ మంటపాన్ని పునర్నిర్మించాలన్న ఉద్దేశంతో పూర్తిగా విప్పదీశారు. అందులోని రాళ్లకు నంబర్లు వేసి పద్మాక్షి గుట్ట వద్ద ఉంచారు. కానీ పనులు ముందుకు సాగలేదు. మూడేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం దృష్టి సారించి వేగంగా పనుల నిర్వహణ ప్రారంభించింది. ఇప్పుడు ప్రధాన నిర్మాణ పనులు పూర్తికాగా, వారం రోజులుగా పైకప్పు పనులు చేస్తున్నారు. ఆగస్టు చివరి నాటికి ఆ పనులు కొలిక్కి తెచ్చి సెప్టెంబరులో మంటపాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

హనుమకొండకు చేరువగా ఉన్న అమ్మవారి పేట క్వారీ నుంచి మంటప పునర్నిర్మాణ పనులకు రాళ్లను తెచ్చి వాడుతున్నారు. అప్పట్లో కాకతీయ రాజులు నిర్మించిన దేవాలయాలకు ఈ గుట్ట రాయినే వాడేవారు. నాడు రాళ్లను తొలిచేందుకు చేసిన రంధ్రాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. దాదాపు 60 టన్నుల బరువున్న ఓ భారీ బండరాయిని ఇటీవలే మంటపం వద్దకు తరలించారు. దాన్ని పైకప్పుపై అమర్చనున్నారు. ఆ గుండుపై 800 ఏళ్ల కింద తొలిచినప్పటి రంధ్రాల జాడలు ఇంకా ఉండటం విశేషం. అదే

నాటి క్వారీ నుంచే ఇప్పుడూ రాళ్ల వినియోగం..

రాయి భాగాన్ని ఇప్పుడు మళ్లీ వేయిస్తంభాల కళ్యాణ మంటపానికి వినియోగిస్తుండటం యాదృచ్ఛికం. ఈ మంటపానికి సంబంధించి 163 బీమ్‌లకు గానూ 28 జాడ లేకుండా పోయాయి. కూలిన తర్వాత ప్రజలు వాటి ముక్కలను తరలించుకుపోయారు. ఇప్పుడు వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో ఒక్కోటి 8 అడుగుల పొడవు, రెండున్నర అడుగుల వెడల్పు, 30 టన్నుల బరువుండే 8 బీమ్‌ల ఏర్పాటు పనులు పూర్తి కావచ్చాయి. వాటిపై 32 పైకప్పు సల్పలను పరచనున్నారు. ఈ సల్ప రాళ్లు ఒక్కోటి 15 అడుగుల వెడల్పుతో ఉండనున్నాయి.

పనుల్లో తమిళనాడు శిల్పులు


తమిళనాడుకు చెందిన శివకుమార్ స్థపతి ఆధ్వర్యంలో అదే రాష్ట్రానికి చెందిన 28 మంది శిల్పులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. కేంద్రప్రభుత్వం రూ.19 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే రూ.10 కోట్లు ఖర్చు కాగా, నిర్మాణ పనులు పూర్తయ్యే నాటికి మరో రూ.3 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఆ తర్వాత దాని చుట్టూ సుందరీకరణ, ఇతర పనులకు మిగతావి ఖర్చు చేయనున్నారు. ఏఎస్‌ఐ తెలంగాణ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్టు స్మిత ఎస్ కుమార్, కన్జర్వేషన్ అసిస్టెంట్ మడిపల్లి మల్లేశం ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.



నాటి ఉలి గుర్తులు

అలనాటి శైలికి తేడా రానివ్వం

'కాకతీయుల కాలంలో ఏ శైలిని వినియోగించారో ఆ శైలికి ఏమాత్రం తేడా రాకుండా రాళ్లను కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నాం. అలనాటి నిర్మాణం మళ్లీ కళ్ల ముందుంచేందుకు అహరహం శ్రమిస్తున్నాం. ఆగస్టు చివరి నాటికి కళ్యాణ మంటపం సిద్ధమవుతుంది'
-శివకుమార్, స్థపతి



ప్రేమికులపై పోలీస్‌స్టేషన్‌లోనే దాడి

రక్షణ కోసం ఎస్పీ కార్యాలయానికి పరుగులు



గద్వాల క్రైం: పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్న ఓ జంటపై యువతి కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లోనే దాడికి పాల్పడ్డ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. గద్వాలకు చెందిన ప్రశాంత్, మండలంలోని పూడూరుకు చెందిన శిరీష ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురి ఇళ్లలో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ప్రశాంత్ తల్లిదండ్రులు రెండు నెలల క్రితం ఇద్దరికీ వివాహం చేద్దామని యువతి తల్లిదండ్రులతో మాట్లాడగా.. ఇద్దరి కులాలు వేరు కావడంతో అభ్యంతరం చెప్పారు. దాంతో మేజర్లయిన ప్రేమికులు ఈ నెల 8న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. 9న కర్నూలు జిల్లా పాలబుగ్గ సమీపంలోని ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఇంటికి వచ్చేందుకు, తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం చేరుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫర్నిచర్ ధ్వంసం

పోలీసులు ఇరువురి కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి నచ్చజెప్పారు. అయితే యువతి కుటుంబసభ్యులు బలవంతంగా ఆమెను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట జరగ్గా.. ఆమె కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లోని ఫర్నిచర్ ధ్వంసం చేసి యువకుడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. పోలీసు సిబ్బంది అడ్డుకోగా.. వెంటనే రక్షణ కోసం సమీపంలోని ఎస్పీ కార్యాలయానికి రోడ్డు వెంట ఆ ప్రేమజంట పరుగులు తీసింది. ఎస్పీ సృజన వద్దకు వెళ్లి జరిగిన విషయం వివరించారు. వెంటనే ఎస్పీ ఆ ఇద్దరూ మేజర్లు కావడంతో వారికి రక్షణ కల్పించే బాధ్యత పోలీస్‌శాఖపై ఉందన్నారు. భవిష్యత్‌లో వారిపై దాడి చేయడం, అవమానపర్చడం, విడదీసే ప్రయత్నం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇరువురి కుటుంబ సభ్యులను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించారు. ఘటనపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

మహారాష్ట్రలో దొరికిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి



బన్నీని తండ్రికి అప్పగిస్తున్న పోలీసు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్న విద్యార్థి బన్నీ మంగళవారం మహారాష్ట్రలో దొరికాడు. గురువారం వర్సిటీ నుంచి ఔట్ పాసు తీసుకుని వెళ్లిన బన్నీ ఇంటికి వెళ్లలేదు. స్నేహితులకు కూడా చెప్పకుండా సెల్ స్విచాఫ్ చేయడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు బాసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న బాసర ఎస్‌ఐ మహేశ్ రైల్వేస్టేషన్‌లోని సీసీ పుటేజీలు పరిశీలించగా గురువారం ఉదయం 10.40 గంటల ప్రాంతంలో మహారాష్ట్ర వైపు వెళ్లే రైలు ఎక్కినట్లు గుర్తించారు. బన్నీ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మహారాష్ట్రలో ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు.దీంతో మహారాష్ట్ర వెళ్లిన పోలీసులు.. పర్బనీ జిల్లా పూర్ణ ప్రాంతంలో అతడు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులను వెంట తీసుకెళ్లి బన్నీని అక్కడే వారికి అప్పగించారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని బాసర పోలీసులు తెలిపారు.

టీచర్ల పదోన్నతులు చేపట్టాలి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీలపై హైకోర్టులో వివాదం ఉన్నందున తక్షణమే పదోన్నతులు, టీచర్ల నియామకాల ప్రక్రియను ప్రారంభించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ స్టీరింగ్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వేలాది మంది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. వేసవికి ముందే పూర్తి కావాల్సిన బదిలీలు కోర్టు స్టే కారణంగా నిలిచిపోయాయని, విద్యా సంవత్సరం ప్రారంభమైనా బదిలీల వివాదం పరిష్కారం కాలేదని కమిటీ అభిప్రాయపడింది.

బజ్జీల కోసం సైరన్ మోగిస్తూ..

- అత్యవసరమని అంబులెన్సుకు దారిచ్చిన కానిస్టేబుల్
- సిగ్నల్ దాటగానే మిర్చి బండి వద్ద ఆగి బజ్జీలు తిన్న డ్రైవర్
- సైరన్ దుర్వినియోగంపై ట్విట్టర్‌లో డీజీపీ ఆగ్రహం
- డ్రైవర్‌ను తొలగించిన సెంచురీ ఆస్పత్రి యాజమాన్యం



అంబులెన్స్ డ్రైవర్

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: కుయ్ కుయ్ కుయ్ మంటూ సైరన్ మోగిస్తూ వచ్చిన అంబులెన్స్‌ను చూసిన ట్రాఫిక్ కానిస్టేబుల్ హుటాహుటిన స్పందించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనానికి దారి ఇచ్చారు.. అంతే.. అంబులెన్స్ సిగ్నల్ దాటాక మిర్చిబజ్జీల దుకాణం ముందు ఆగింది. సెంచురీ ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్ నిర్వాకమిది. నారాయణగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ మార్గంలో బంజారాహిల్స్ సెంచురీ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ వస్తోంది. ఓల్డ్ సీపీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి ట్రాఫిక్ కనిపించడంతో డ్రైవర్ సైరన్ మోగించాడు. దీంతో అక్కడున్న నారాయణగూడ ట్రాఫిక్ పోలీసు రషీద్ హుటాహుటిన ట్రాఫిక్ క్లియర్ చేశారు. ట్రాఫిక్ నుంచి క్షణాల్లో బయటపడ్డ ఆ డ్రైవర్ కాస్త ముందుకెళ్లాక తాపీగా మిర్చి బజ్జీలు తినడం చూసిన కానిస్టేబుల్ బిత్తరపోయారు. అంబులెన్స్‌లో రోగులు లేరని, ఆసుపత్రి సిబ్బంది మాత్రమే ఉన్నారని గ్రహించారు. ఈ ఉదంతం అంతా వీడియో తీసిన కానిస్టేబుల్ దాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. ఈ వీడియోను తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేసిన డీజీపీ అంజనీకుమార్.. అంబులెన్స్ సైరన్‌ల దుర్వినియోగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఉదంతంలో సదరు అంబులెన్స్ డ్రైవర్, ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పాటు.. ఇకపై ఇలాంటి దుర్వినియోగాలను సహించబోమని హెచ్చరించారు. ఈ ట్వీట్ చూసిన తర్వాత నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులు ఆ అంబులెన్స్‌కు రూ.1000 జరిమానా విధించారు. బుధవారం తనిఖీల కోసం ఆర్టీఏను పంపిస్తున్నట్లు తెలిసింది. డీజీపీ ట్వీట్‌పై సెంచురీ ఆస్పత్రి యాజమాన్యం సైతం స్పందించింది, రోగులు లేకుండా అకారణంగా సైరన్ వేసిన డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించినట్లు తెలిసింది.

కోటి తలంబ్రాల పంటలో వానర సేవ



గోకవరం: భద్రాచలంలో శ్రీరాముని కళ్యాణానికి గోటితో ఒలిచి తలంబ్రాలు సిద్ధం చేసేందుకు కాకినాడ జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురంలో మంగళవారం పంట పొలంలో వానర వేషధారణల్లో భక్తులు దుక్కిదున్ని విత్తనాలు చల్లారు. కోరుకొండ శ్రీకృష్ణచైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణం అప్పారావు ఆధ్వర్యంలో శ్రీరాముడు, ఆంజనేయుడు, అంగదుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు వేషధారణల్లో భక్తులు పొలంలో భక్తిగీతాలు ఆలపిస్తూ రామనామం జపిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీసుకువచ్చిన ధాన్యం విత్తనాలను పొలంలో చల్లారు. అంతకు ముందు ఈ విత్తనాలతో సీతారాముల విగ్రహాలకు అభిషేకం చేశారు. అప్పారావు మాట్లాడుతూ 13వ కోటితలంబ్రాల జ్ఞానయజ్ఞంలో భాగంగా విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే భక్తిభావంతో ఈ యేడాది కూడా ఎకరం పొలంలో కోటితలంబ్రాల పంటను పండిస్తున్నట్లు చెప్పారు.

ప్రతి పౌర్ణమికి అరుణాచలం బస్సులు

టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తమిళనాడులోని అరుణాచలేశ్వరుడి గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులు నడపాలని టీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై 3వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణకు తొలిసారిగా సూపర్ లగ్జరీ బస్సులు నడిపిన సంగతి తెలిసిందే. ఈ బస్సులకు భక్తుల నుంచి మంచి స్పందన రావడంతో ప్రతి పౌర్ణమికి రద్దీని బట్టి హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపేవిధంగా చర్యలు చేపట్టింది. అరుణాచలేశ్వరుడి గిరిప్రదక్షిణ ప్రారంభమయ్యే 4 గంటల ముందుగానే భక్తులను అక్కడికి చేర్చనుంది. ప్రతి పౌర్ణమికి 10 రోజుల ముందుగా ఆన్‌లైన్‌లో బస్సు టికెట్లు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనానంతరం అరుణాచలానికి భక్తులను తరలించనుంది. గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత అదే రోజు సాయంత్రం వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్‌కు తీసుకెళ్లి, అక్కడ దర్శనానంతరం తిరుగుపయనమయ్యే విధంగా చర్యలు చేపట్టింది. గురు పౌర్ణమికి మొదట ఒక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేయగా, నిమిషాల్లో సీట్లన్నీ బుకింగ్ అయ్యాయి. దీంతో రద్దీని బట్టి సర్వీసులు పెంచారు. మొత్తం 32 సూపర్ లగ్జరీ బస్సుల్లో దాదాపు 1,100 మంది భక్తులు అరుణాచలగిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు. అవసరమైతే ఏసీ బస్సులు నడిపేందుకు కూడా ఆర్టీసీ సిద్ధంగా ఉంది. టీఎస్ ఆర్టీసీ సంస్థ అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.inను సందర్శించి ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్: 040-69440000, 040-23450033 నంబర్‌లలో సంప్రదించవచ్చు.

30 రోజుల్లో 'రెరా' అనుమతులు

- రాష్ట్రంలో పకడ్బందీ అమలుకు కసరత్తు
- ఇతర రాష్ట్రాల అమలుపై అధ్యయనం చేస్తున్న టీఎస్ రెరా

సాక్షి, హైదరాబాద్: నిబంధనలన్నీ పాటిస్తే దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అనుమతులు మంజూరు చేయాలని 'రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా)' నిబంధన విధించింది. 'రెరా' మార్గదర్శకాలకు భిన్నంగా ఉన్న దరఖాస్తులను తిరస్కరిస్తారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే.. ఇప్పుడున్న ఫీజుకు అదనంగా ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయాలని 'రెరా' యోచిస్తున్నట్లు తెలిసింది. రెరా నిబంధనలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేందుకు 'తెలంగాణ రాష్ట్ర రెరా' కమిటీ చైర్మన్ సత్యనారాయణ దేశవ్యాప్తంగా 'రెరా' అమలుపై అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ, మహారాష్ట్ర అధికారులతో సమావేశమైన ఆయన మంగళవారం బెంగళూరులోనూ పర్యటించారు. బుధవారం తమిళనాడులోనూ రెరా అమలుతీరుపై అధ్యయనం చేయనున్నారు.

రిజిస్ట్రేషన్ ఫీజులిలా.. 500 చదరపు మీటర్లు లేదా 598 చదరపు గజాల విస్తీర్ణం కన్నా ఎక్కువలో రియల్ వెంచర్ చేసినా, 8 ఫ్లాట్లకు పైన అపార్ట్‌మెంట్ నిర్మించాలన్నా, స్థానిక పంచాయతీ, మున్సిపాలిటీ లేదా ఇతర పట్టణాభివృద్ధి సంస్థల నుంచి పొందిన అనుమతులతో ఆన్‌లైన్ ద్వారా 'రెరా'లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ఇక తప్పనిసరి. గృహావసరాలకు ప్రస్తుతం 1,000 చదరపు మీటర్ల వరకు ప్రతి చదరపు మీటర్‌కు రూ.5 చొప్పున 'రెరా'కు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. 1000 చదరపు మీటర్ల నుంచి 5 లక్షల చదరపు మీటర్ల వరకు చదరపు మీటరుకు రూ.10 చెల్లించాలి. రెసిడెన్షియల్/కమర్షియల్ మిక్స్‌డ్ ప్లాట్లకు 1,000చ.మీ. వరకు చ.మీటరుకు రూ.10, వెయ్యి నుంచి 20 లక్షల చ.మీటర్ల వరకు రూ.15 చొప్పున చెల్లించాలి. కమర్షియల్‌కు వెయ్యి చ.మీటర్ల వరకు ప్రతి చ. మీటరుకు రూ. 20, వెయ్యి చ.మీ నుంచి 10 లక్షల చ.మీటర్ల వరకు చ.మీటరుకు రూ. 25 చెల్లించాల్సి ఉంటుంది. లే అవుట్ అయితే చదరపు మీటరుకు 5 చొప్పున 2లక్షల చ.మీటర్ల వరకు చెల్లించాలి.

'పోలీస్ బోర్డు' నంబర్ల మూగనోము

సాక్షి, హైదరాబాద్: పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు హెల్ప్‌లైన్ నంబర్లు హెల్ప్‌లెస్‌గా మారాయి. పోలీస్ నియామక ప్రక్రియ అత్యంత కీలకదశకు చేరిన ఈ సమయంలో దళారుల ఆటకట్టించేందుకు ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్లు మూగనోము పట్టాయి. సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఎంపికైనవారి జాబితాను త్వరలో విడుదల చేసేందుకు పోలీస్ నియామక మండలి సన్నద్ధమవుతోంది. ఈ దశలోఅభ్యర్థులను దళారులు మోసగించి అందినకాడికి డబ్బు గుంజే అవకాశాలు ఎక్కువ. దళారుల సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు వారికి రూ.3 లక్షల వరకు నగదు పారితోషికం కూడా ఇస్తామని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గతంలో ప్రకటించింది. వివరాలు సేకరించేందుకు 93937 11110 , 93910 05006 హెల్ప్‌లైన్ నంబర్లను కూడా కేటాయించింది. అయితే కార్యాలయ వేళల్లో ఫోన్ చేసినా ఉలుకూపలుకూలేదని అభ్యర్థులు వాపోతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.